కీర్తనలు

# మానస మాధవం-భక్తి గీతాలు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తిరుమల తిరుపతి దేవస్థానం వారి వెబ్ సైట్: http://ebooks.tirumala.org
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## TTD(తిరుమల తిరుపతి దేవస్థానం)


## http://ebooks.tirumala.org



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఓజసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# మానస మాధవం

(శ్రీ వేంకటేశ్వరస్వామిపై భక్తి గీతాలు)

రచన
**కొటికలపూడి కూర్మనాథం**

**ప్రచురణ**

**కార్యనిర్వహణాధికారి**
**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2010**



*MANASA MADHAVAM*
*(Devotional songs on Lord Venkateswara)*

*By*
*Kotikalapudi Kurmanadham*

*© All Rights Reserved*

*T.T.D.Religious Publications Series No. 848*

*First Edition : 2010*

*Copies : 1000*

*Published by*

***I.Y.R.**Krishna Rao, **I.A.S.,***
*Executive Officer*
*Tirumala Tirupati Devasthanams*
*Tirupati*

*D.T.P. : Chief Editor's Office,TTDs, Tirupati.*
*Cover Design : B. Guru Kumar Reddy*

*Printed at*

*Tirumala Tirupati Devasthanams Press*
*Tirupati.*

మానస మాధవం

## మున్నుడి

భగవద్భక్తి మానవులను సన్మార్గంలో నడిపిస్తుంది. అహింసను, మానవత్వాన్ని పెంపొందింపజేస్తుంది. తద్వార సమాజం సుఖశాంతులతో వర్ధిల్లుతుంది. ఈ భక్తిని ప్రచారం చేయడానికి ఇతర కవులు, గాయకులు, కళాకారులు తమవంతు కృషిని కొనసాగిస్తూనే ఉన్నారు.

శ్రీ కొటికలపూడి కూర్మనాథంగారుకూడా శ్రీ వేంకటేశ్వరునిపై ఉన్న తన హృదయగతమైన భక్తిభావాల్ని మాత్రాఛందస్సులో 600 లలిత గీతాలుగా రచించారు. తన మనసులోని ఆర్తిని వెలువరించారు. స్వామివారి వైభవాన్ని కీర్తించారు. దయాపూర్ణ తరంగ అయిన అలమేలు మంగ మాతృప్రేమను అభివర్ణించారు. గరుడాద్రివాసుని భక్తవత్సలతను శ్లాఘించారు. మానవుల మానసాలను ఆవరించుకున్న అజ్ఞాన తిమిరాంధ కారాన్ని పోకార్చి జ్ఞానకాంతుల్ని ప్రసరింపచేయుమని గానయోగ్యమైన తమ కవితలతో మొరపెట్టుకున్నారు.

**"తెల తెల్లవారింది - చలిగాలివీచింది**
**మంచుతెర దోమతెర మాయ మౌతుంది**
**ముద్దైన నగుమోము కననీయవా!**
**ముందుగా మా మనవి వినగోరవా!**

సరళము, భావబంధురము అయిన ఈ భక్తిగీతాలు అటు సాహితీప్రియులకు - ఇటు సంగీతాభిమానులకూ ఆనందసంధాయకాలు కాగలవని విశ్వసిస్తున్నాను.

తిరుమల తిరుపతి దేవస్థానము భక్తి ప్రచారోద్యమంలో భాగంగా ప్రచురితమౌతున్న గ్రంథాల వరుసన ఈ భక్తిగీతాల్ని వెలువరిస్తున్నాం. యథావిధిగా ఈ గ్రంథం పాఠకుల, గాయకుల ఆదరణకు నోచు కుంటుందని భావిస్తున్నాం.

**కార్యనిర్వహణాధికారి**
**తిరుమల తిరుపతి దేవస్థానములు,తిరుపతి**

# నా మాట

**నే**ను 1950 (నా 20వ యేట) నుండి ఏవోపాటలు వ్రాయటం ప్రారంభించేను. అందుకు కారణం మా పూర్వీకులు బొబ్బిలి ఆస్థానంలో కవులు పండితులు కావటం కావచ్చు. ఏ జన్మ సుకృతమో కాని నేనీ కొటికలపూడి వంశంలో పుట్టేను. నాకు కాస్త కవిత్వం అబ్బింది అనుకుంటూ ఉంటాను.

అప్పుడప్పుడు వ్రాసిన పాటలు అన్నీ శతాధికం కాగానే వాటిని కీ॥ శే॥ డా॥ గిడుగు వేంకట సీతాపతిగారు చూడటం సంభవించింది. వారు నన్ను తగినంతగా ప్రోత్సహించేరు. పరిస్థితులు కలసివచ్చి వాటిని 'నవనందిని' అనే పేరుతో పుస్తక రూపంలో ప్రచురించటం జరిగింది.

1964లో మొదట ఆంగ్ల పద్యం ప్రచురితం కాగానే ఆంగ్లంలో కూడా వ్రాయటం ప్రారంభించేను. ఇప్పటికి 15 పుస్తకాలు తెలుగు లోను, 4 పుస్తకాలు ఆంగ్లంలోను ప్రచురించగలగటం కేవలం నేను నమ్మి ఆరాధిస్తున్న ఆ శ్రీహరి కృప. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శ్రీనివాసుడు, బదరీనాథుడు - ఇలా అందరిమీద పాటలు వ్రాయ గలిగేను. చాలా వరకు అన్నీ ప్రచురితమయినాయి. కొలంబియా కంపెనీకి 'శ్రీరామ పట్టాభిషేకం' వ్రాశేను.

నా పుస్తకాలకి డా॥ గిడుగు వేంకటసీతాపతిగారు, శ్రీ స్వామి శివశంకర స్వామిగారు, శ్రీ జమ్ములమడక మాధవరాయ శర్మగారు, డా॥ దివాకర్ల వేంకటావధానిగారు మొదలగువారు పరిచయ వాక్యాలు వ్రాశేరు. నన్ను ప్రోత్సహించి ఆశీర్వదించేరు.

తిరుప్పావు తిరువెమ్బావు తెలుగులోకి పాటలుగా వ్రాశాను. అన్నమయ్య పాటలు 108 ఎంచి ఆంగ్లంలోకి సానెట్లు (Sonnets) గా వ్రాశేను.

సప్తగిరులు అనే పేరుతో 1973లో నేను శ్రీనివాసునిపై వ్రాసిన పాటలు ప్రచురించబడ్డాయి. మరల ఈనాడు తనపై భక్తిని పెంచి నాచే 300కి పైగా పాటలు వ్రాయించుకున్నాడు ఆ పరమాత్మ. ఆ శ్రీమన్నారాయణుడే వేంకటాద్రీశుడు, పురుషోత్తముడు, పరబ్రహ్మ, సర్వాత్మకుడు, సర్వేశ్వరుడు, అణురేణు పరిపూర్ణుడని నా నమ్మకం.

అందుకే విష్ణుభక్తి ఓ మత్తు. ఓ ఉన్మాదం. ఓ వ్యసనం. అది సంక్రమించడం జన్మజన్మల పుణ్యఫలం. జరావ్యాధుల్లో కాపాడేది జనన మరణ వలయంనుండి బయటకు లాగేది అదే. ఆయన భక్త పరాధీనుడు. ఆతని భక్తి తరంగిణిలో పడితే బయటపడటం దుర్లభం. హరిభక్తి ఓ ప్రపంచం. ఆయన చరణాలు పూజనీయాలు. అవి చరమ గమ్యాలు. ఆయనే నా మానసమందిర సుందరుడు. ఆ సప్తగిరీశుని పరంగా నాలో రేగిన భక్తిభావ పరంపరకి అక్షరరూపాల సంపుటే నా ఈ 'మానస మాధవం'.

ఈ గీతికల్లో కొన్ని మాత్రాఛందస్సులో వ్రాశేను. నాకున్న స్వల్ప సంగీత జ్ఞానంతో కొన్ని (లలిత) సంగీతపరంగా పాడుకునేందుకు వీలుగా ఒక లయ (గతి)కి అనుగుణ్యంగా వ్రాశేను. నిజానికి

**పద పదముననూ అర్థవంతమై**
**భక్త కోటికి గాన సుకరమై**
**సాగే గీతులు ప్రీతగు రీతులు**
**సామజ వరదుని సత్ప్రసాదములు**
**వ్రాసే కలమున వరదుడు నిలచి**



**వరుసగ నాచే వ్రాయించాడు**
**నామమాత్రుడనునేనంటాను**
**నారాయణునికి అర్పిస్తాను**

నా మానస మాధవం గ్రంథాన్ని అందంగా ముద్రించి ప్రచురించిన తి.తి.దే. (తిరుపతి) వారందరికీ సదా నా కృతజ్ఞతలు.

ఈ పాటల్లో కొన్ని అయినా కొందరినయినా చదువుకునేట్లుగాని పాడుకొనేటట్లుగాని చేస్తే అది కూడా ఆ సప్తగిరీశుని లీలగా భావిస్తూ ఆయన చరణ కమలాలపై రెండు కన్నీటి బిందువులతో కృతజ్ఞతా సూచకంగా-

విజయనగరం-2 **కొటికలపూడి కూర్మనాథం**
8-8-2009

# మానస మాధవం

**ఏ**డడుగులు కలసి నడుద్దాం
ఏడుకొండలే ఎక్కుదాం

రండి జనులార -
రండి తరించండి -

**మ**నసు మనసు కలుపుదాం
మనమంతా ఒకటౌదాం
మనందరిది ఒకే గతం
మనందరిది ఒకే మతం

**అ**రమరికలు అంతరించి ఆనందం పొందుదాం
ఏడు రంగు లొకటైతే ధవళవర్ణం
ఏడు కొండలెక్కితే దైవదర్శనం
ఆరు గిరులు దాటితే అఖిలాత్ముడు
ఆరు అరులు ఓడితే మోక్షప్రాప్తం

**పా**పాలే మాసిపోవు మనదారిలో
లోపాలు తొలగిపోవు కొండదారిలో
ఏడవ గిరి శిఖరాన గుడిగోపురం
ఆనంద నిలయుడే అచట కాపురం

**బం**డలన్ని పవిత్రం కొండలన్ని విచిత్రం
ప్రకృతంత పవిత్రం ప్రతి అణువు పావనం
పోవుకొలది ప్రపంచాన్ని బాసే అనుభూతి -
చేరుకొలది పరమాత్ముని సన్నిధి ప్రీతి

**ర**ండి రండి జనులార ఈ కొండకు రండి
వేంకటేశునే ఇచ్చట వేడుకొండి

రండి రండి రండమ్మా రండి
రండి రండి రండయ్యా రండి

**భ**క్తితో హృదయాలను బలపడనీయండి
భవబాధలు తీరునండి బంధాలు విడునండి
ఆ భావనతో మీరు అర్థించండి
ప్రార్థనతో పరమాత్మ అనుకూలు డండి

**వే**డుకున్న జాలి చూపు వెన్నుడీత డండి
వేంకటేశుడే ఇలలో పరంధాముడండి
వాంఛితాలు నెరవేర్చే కలియుగ దైవం
జీవితాలు సుఖప్రదం చేసే దైవం

**జా**లినిండు జలపాతం ఈతడండి
జలజాక్షుడు జగమేలే జగన్నాథుడండి
అమృతాంతరంగుడు అఖిలాండ నాయకుడు
అందుకే అందరినీ ఆదుకొనే దేవుడు



**పా**వనం శుభం పతిత పావనం శుభం
పరమాత్ముడే వెలసిన వేంకటాద్రిపై సర్వం

**త**రువులన్ని లతలన్ని పావనం శుభం
పరిమళాల విరులన్ని పత్రాలు పావనం
శిలల తలల జలధారలు శిలలన్నీ పావనం
గాలి ధూళి అణువణువు ఏవైన పావనం

**గి**రుల పైని మెట్లన్నీ ప్రతి ఒక్కటి పావనం
మనకోసం దారిలో మండపాలు పావనం
మెట్లదారి పావనం దీపాలే పావనం
అనునిత్యం వినిపించే హరినామం పావనం

**దే**వాలయ ప్రాకారం పుష్కరిణి పావనం
ఆలయాన అడుగడుగున అన్నియును పావనం
దేవళాన దీపాలు పూజలన్ని పావనం
తీర్థ ప్రసాదాలు శ్రీదేవుడు పావనం

**శ్రీ**గిరి పునీతం క్షేత్రం పునీతం
శ్రీనాథుడే ఉన్న గిరులే పునీతం
దరి దాపులను ప్రతి ప్రాంతం పునీతం
దర్శించు భక్తుల జన్మే పునీతం

**కో**వెల పునీతం కోనేరు సైతం
దైవం పునీతం సన్నిధి పునీతం
దీపం పునీతం ధూపం పునీతం
గంటలు పునీతం నాదం పునీతం

**పూ**జే పునీతం మంత్రం పవిత్రం
హారతి పునీతం పళ్ళెరము సైతం
పత్రం పునీతం పూలన్ని సైతం
మకుటం పునీతం నామం పునీతం

**హా**రం పునీతం దారం పునీతం
హారాన్ని చేసిన హస్తం పునీతం
మనసే పునీతం మమతే పునీతం
మనిషే పునీతం భక్తే పునీతం



**తి**రుమలకే రండి భక్తులార
తిన్నగ చేరండి -
తీరు తెన్ను చూడకండి
తిండి నిద్ర అనకండి -

**అం**డపిండ బ్రహ్మాండం అంతటికీ పాలకుడు
అలనాటి కోదండ పాణియె ఈ దేముడు
ఒకనాటి వేణుగానలోలుడె ఈ దేముడు
ఆతడే ఈనాటి శ్రీ వేంకటేశుడు

**ద**ర్శనమే కావాలని తపన పడండి
ఆశ పడండి మీరు అలమటించండి
మమకారం పెంచుకొనగ శ్రీకారం చుట్టండి
అతని నామస్మరణం సకల పాపహరణం

**ప**రబ్రహ్మమే గుడిలో వెలసినాడు
పరమాత్ముడు ఆతడే సన్నిధి కోరండి
అతనిలోని దైవశక్తి అనూహ్యం అనంతం
కొల్చినచో కోర్కె దీరి చేకూరును ఆనందం

**లె**స్స లెస్స లెస్స నీ సర్వం లెస్స
శ్రీనివాస లెస్స నీ విలాసమే లెస్స

**ఏ**డు గిరులు లెస్స ఏదైనా అట లెస్స
గిరులపైన శిలలు సెలలు ఎన్నున్నా లెస్స
తరులు విరులు లతలన్నీ తగురీతిగ లెస్స

**వేం**కటాద్రి లెస్స ఆలయం లెస్స
బంగారు గోపురం భగవంతుడు లెస్స
అపురూప శిల్పాలు అన్నియునూ లెస్స

**ము**ఖద్వార విలాసం జయ విజయుల దర్శనం
గర్భాలయమే లెస్స గోవిందుడు లెస్స
ఇహపరాల వారధిగా చరణాలే లెస్స



**నా**రాయణ మంత్ర స్వరూపా - మా నరులను
తరించే దైవ స్వరూపా

**నీ** పద పద్మాల నీడ చల్లందనం
నిరతం నా కామితం నిత్య పవిత్రా
ఆ నీడల నా మేడలు అఖిలేశ్వరా
ఆ మేడల నా ఆశలు అమరాధిపా

**నీ** కర కమలాలే నా కభయాలు
నాకింక లేవందు ఏ భయాలు
అమ్మ ఒడిని పాపలా నా జీవితం
నిశ్చింతగ సాగిపోవు నిగమసారా

**నీ** వాకిట అడుగిడగనె పోవును ఖేదం
నీ దేవళ ప్రాంగణం మంత్ర పవిత్రం
అంతరాన అనుక్షణం అంతా ప్రశాంతం
ఆ భావం చాలదా ఆనందకరం

-

**ఎ**ంతకాలమైన సరే చూడాలని ఉంది
ఎన్నిసార్లైనా గుడికి రావాలని ఉంది
ఓ శ్రీనివాసా......... ఓ చిద్విలాసా

**చూ**సినంత సేపు ఏదో చెప్పలేని తన్మయం
నిల్చినంత సేపు ఏదో నవలోకవాసం
చూడగనే నీ రూపులో ఏదో మాధుర్యం
ఎడదలోన తెలుపలేని హరివిల్లుల విన్యాసం

**నీ** అభయ ముద్రలో ఆనందం అనంతం
నీ పెదవుల చిరునగవుల నటనాలయం
ఎదలోన చెప్పలేని దేదో ప్రశాంతం
చాలు చాలు ఈ జన్మకు సంతస శిఖరం

**నీ** సముఖంలో ఏమా వింతవింత అనుభవం
నీ గుడిలో ఏదో ఒక వింతైన ప్రభావం
మాటలకే శక్తి వచ్చి నిను గూర్చి చాటాలి
భావాలకు రెక్కలొచ్చి నీ చుట్టూ తిరగాలి



**తె**ల తెల్లవారింది తొలికోడి కూసింది
చల్లని శ్రీనాథ మేలుకోరా
చక్కని శ్రీరమణ కను విప్పరా

**చ**లిగాలి వీచింది తెలిమంచు చెదరింది
కలరవము లెన్నెన్నో మిన్నంటెరా

**నీ** పాద సేవలకు నిఖిలేశ వేళాయె
తోయమ్ముతో పదము మము కడగనీ పుణ్య
తీర్థమ్ము తలదాల్చి తరియింపనీ

**త**రులన్నీ పులకించె విరులన్ని విరిసేయి
పూలనే పూజలో పులకింపనీ
నీ పాద సన్నిధిని నిదురింపనీ

**భ**క్తులెందరో వేచె భవరోగములు పోవ
పరమాత్మునే తాము దర్శింపగా
దర్శించి పుణ్యాల పురి విప్పగా

**సు**ప్రభాతం నీకు సుప్రభాతం
సుకుమారి అలమేలు మంగమ్మ మాయమ్మ

**జ**ననీ శ్రీనాథు సతి జగదేక పావని
భావనలో అద్వితీయ భాగ్యోపేత
అందాల సుందరి అపురూప రూపిణి
ధరనున్న దయామయి లోకైకహిత

**సు**మకోమలి శుభదాయిని సుగుణరాశి
సుందర సురనందనవని సుమమాలాశోభిని
అనుపమాన అమృతవర్షిణి యశో విశాలిని
అద్వితీయ కృపామయి అవనీ జనసేవిత

**అ**సామాన్య ప్రేమమయి అమరలోక పావని
లలిత లలిత లలనామణి ఓ లతాంగి
భావాంబర చంద్రద్యుతి ప్రభాభాసిని
మణిమయ మాలాధారిణి వరదాయిని



**అ**మ్మ లేవమ్మ మంగమ్మ చూడమ్మ
భువనాలేలే దేవేరి
ప్రేమ ప్రవాహపు కావేరి -

**మె**ల్లగ మేల్కొని భక్తుల గనవమ్మా - నీ
చల్లని చూపుల మము పాలించమ్మా
నీ వీక్షణలో పులకిస్తాం
నీ అభయాన్నే ఆశిస్తాం

**నీ** వాకిలిలో వేచే దీనులం
దర్శనమునకై తపించు పాపులం
జాలిగ చూడుము జనయిత్రి
శుభముల నొసగే శుభగాత్రి

**నిం**డగు ప్రేమే నీలో కాపురం
మెండగు భక్తుల భక్తే గోపురం
నీవే నిత్యం శాశ్వతం
నీకే బ్రతుకులు అంకితం

**ఉ**త్తిష్ఠ ఓ శ్రీనివాసా
ఉత్తిష్ఠ ఓంకార నిలయా
ఉత్తిష్ఠ ఇందిరా హృదయేశ్వరా
ఉత్తిష్ఠ సప్తగిరి మందిరా

**మో**గన్ను చిరుమువ్వలా తోచగా
చూపున ప్రేమంత ప్రవహింపగా
దర్శించు భక్తులు తరియింపగా
దివిజేశ కనువిప్పి కరుణించరా

**త**పియించు భక్తుల మనసెరుగుమా
చిరునవ్వుతో మమ్ము దీవింపగా
నిలువెల్ల కనులై నిను చూడగా
నీ భక్తకోటికి సంతృప్తి కలుగ

**నీ** చూపులో నిండు మా శాంతసరసి
నీ గుండెలో నిండు ప్రేమెంత వెలసె
నీ తపులో ఎదను కల్యాణశ్రీలు
నీ ఉనికి నిజశాంతికే ఆనవాలు



**ని**దుర నాపి కనులు తెరువవా
నిఖిలేశ్వరి అలమేల్మంగా
జాలినొలుకు చూపులతో మము చూడుమా
జగములేలు జగదీశ్వరి పాలించుమా

**నీ** పతి శ్రీరమణుడు శ్రీవేంకటపతిని
నిదుర లేపి మాకోసం శుభము పలుకరే
మీ భక్తుల కదే వరం ఆనందం
మిము నమ్మిన వారలపై కృపాశరం

**మీ** దర్శన భాగ్యం సదా వాంఛితం
అదే మాకు నిరతం అమృతప్రాయం
మీ సన్నిధి పెన్నిధి భూతల స్వర్గం
మీ చూపులలో పడుటే మా సుకృతం

**మీ** రూపం నా గుండెను ఉండిపోవాలి
మీ పై నా భక్తెపుడును వృద్ధి చెందాలి
ఎన్ని జన్మ లెత్తినా మీరే నాదైవాలు
ఎన్నున్నా లేకున్నా మీరే నాభాగ్యాలు

**ఓ** సప్త శైలేశ  ఒకసారి కనువిప్పవా
ఓయీ పరంధామ ఒకసారి మము కానవా

**ని**న్నే చూడాలని నీ కరుణే పొందాలని
నీ చూపుల వానలో నిత్యం తడియాలని
నీ సన్నిధి భాగ్యంతో బ్రతుకులు నిండాలని
ఎదురు తెన్నులు చూసే నిర్భాగ్యులం

**నీ** దర్శన భాగ్యంతో ధన్యులం కావాలని
నీకే మా గుండెల్లో దేవళాలు కట్టాలని
ఆశతో తపించేమయా
నీవే మా సర్వస్వమయా

**ఇ**లవేల్పుగా నిన్నే కలనైనా తలచేను
తలలో నీ భావాలే అలలై కదలేను
అల వైకుంఠము వీడి ఇలపై వెలసేవు
ఈ దీనుల పాలించే ఈశ్వర సర్వేశ్వరా



**తె**ల తెల్లవారింది
చలిగాలి వీచింది
మంచుపొర దోమతెర మాయమౌతోంది
ముద్దైన నగుమోము కననీయవా
ముందుగా మా మనవి వినగోరవా

**అ**ల్లదే తూరుపున అరుణోదయం
ఆకాశ దీపమై అభివందనం
అంజనాద్రీశా నీ మేలుకో
అందరి భక్తులను నీ వేలుకో -

**ప**క్షులన్నీ ఎగిరి పాడె నీ పాటలు
పరమాత్మ నీకవే మేల్కొలుపులు
అందరిని పాలించు అఖిలాత్మకా
ఆనంద గగనాలు అందించుమా

**వ**రమిచ్చు తండ్రికై పలుపూలు పూచేయి
పాదపద్మాలకై ఆశపడుతున్నాయి
పూజలందగ నీవు నిదుర లేవోయి
పుణ్యాల పంటలె పండనీ వోయి

**తె**లవారె నోయి ప్రియమైన తిరుమలేశ
ఎల్లవారు నిన్నే దర్శింప వేచినారు

**సృ**ష్టిలోన సకలం ప్రతి అణువు అణువుసైతం
తపియించుచున్నదోయి తరియించనున్నదోయి
మేలుకో మేలుకో మేటి దైవరాయా

**ప్ర**కృతి పులకించెను ప్రభంజనం వీచెను
దిక్పాలకు లెల్లరును దివిజు లెల్ల వేచెను
మేలుకో మేలుకో మేటి దైవరాయా

**వె**న్నెలలో నీ చూపుల జల్లుకురియగా
భక్తులెల్ల నీ వాకిట ముక్తి కోరగా
శ్రీశ చూడవోయి శాంతినీయవోయి
మేలుకో మేలుకో మేటి దైవరాయా

**క**న్నులలో నీ రూపం కదలాడెనోయి
వెన్ను తట్టి నీ ధ్యాసయె వెన్నాడె నోయి
దర్శనమే ఈయవా దయాసాగరా
మేలుకో మేలుకో మేటి దైవరాయా



**తి**రుమలేశ లేవోయి తిలకింపవా
లేలే నీ నిదుర నాపి లేచి చూడవా
ఘన దైవమ మేలుకో
జననాథా మేలుకో

**నీ**వే మా ఎడదలలో వెలిగే దీపానివి
నీవేగా మాలోన నిండే రూపానివి
నీవె కదా మా బ్రతుకులు నడిపే దైవానివి
నీవింక నిదుర నాపి నీ వారిని చూడవా

**నీ**వె కదా బ్రహ్మాండం సృజియించావు
నీవె సూర్యచంద్రులలో నిండు కాంతివి
నీవె మా అసువులను కాపాడె దిక్కువి
నీ నిదురను ఆపవా నీ వారిని చూడవా

**ఆ**రాధన చేస్తూ నిను ఆర్తితో పిలచేము
సంకీర్తన చేయుచూ సాగిల పడినాము
ప్రార్థనలే చేస్తున్నాం ప్రణామాలు చేస్తున్నాం
పరంజ్యోతి పరబ్రహ్మా పరమాత్మా లేవయా

**మే**లుకో వృషభాద్రి వాసా
మేలుకొని లోకాల నేలుకో శ్రీశా

**సా**మాన్యుడవు కావు సకల పాలకుడవు
సాగునా పాలన నిదురించు దేవా
పరిపాలనే మరచి పవళించకోయి
పాపులను కాచేది వేరెవ్వరోయి

**జ**న నాయకుడవు కద జగదీశ్వరా
సిరి దొరా లోలోన చిరు ఆశ పెంచి
పాదాల చెంతనే పడి ఉన్న దీనులం
పరమాత్మ లేవోయి పాలించుకోవోయి

**క**నుమూసి నిదురలో కదలకున్నావంటె
వినువారు మా సొదలు ఇంకెవ్వరోయి
కనువిప్పి మము చూచి కనికరము చూపి
కాపాడ లేవయ్య కల్యాణ గుణధామ



**చా**లింక నీ నిదుర చాలించవోయి
కళలతో నిండిన కనువిప్పవోయి

**నీ** చూపులో మాకు నిగమాలయాలు
చిరునవ్వు మోములో చిన్మయానందం
చూపులే చాలోయి తొలగు మా చింతలు
నగవు మోమున విరియు పుణ్యాల పూలు

**సి**రిమువ్వలా విచ్చు నీదు కనురెప్పలు
సింగార మొలికించు సిరిమల్లె సిరులు
మందహాసములోన మణిమరకతాలు
మందాకినీ వీచి సుఖ స్పర్శలు

**ప**రమాత్ము నయనాలు పద్మాలయాలు
పద్మాలయాలలో పరలోక సౌఖ్యాలు
నీ వాకిటను మాకు నిబ్బరము చాల
నీ అభయమున మాకు నిశ్చింత చాల

**మే**లుకో మేలుకో శ్రీ వల్లభా
మేలుకో మమ్మేలు కరిరక్షకా

**క**లశాన తీర్థమిదె నీ పాదములు కడుగ
పూలివిగో ఎన్నెన్నో నీ పాద పూజకై
పూమాల లివె చాల నీ కంఠ మలరింప
పులకింప జేజేలు వేచిరి నినుజూడ

**క**ర్పూరమిదె కనుమ నీరాజనమునకై
చందన సుగంధాలు నీ కోస మివిగో
పన్నీరు చామరాలు నీకై సంసిద్ధం
పరమాత్మా దయదలచి కనుదోయి విప్పు

**నీ** కన్నుల జాలువారు నీ దృక్కులు చాలు
నిఖిలేశా నిరంతరం నీవిచ్చిన సిరులు
నీ చూపులు కరుణకే నిత్యాశ్రయం
ఇకనైన మేలుకో ఈయగ ఆనందం



**ని**దుర లెమ్మందుమే నిఖిలేశ్వరా
మేలుకొమ్మందు మే వేంకటాద్రీశా

నీవునూ నిదురింతువా - రమణా
నీకసలు నిదురుండునా

**స**ర్వ వేళలయందు మము గాచు దేవా
నిను నిదురలేపుటే మాకు వశమౌనా
నిదురించినావంటె నీవె లేవాలి
నిదురపోయే దెపుడో నీకె తెలియాలి

**స**మ్మోహనాకార వైకుంఠవాసా
సామాన్యుడవుకావు సర్వాధిపా
పదునాల్గు లోకాల పాలకా ఈశా
పవళింతు వనుకొనుట మాకు భ్రమకాదా

**న**రులుగా నినుగొల్చి తరియించు పాపులం
నారాయణాద్రీశ నిన్ను విసిగింతుము
సుప్రభాతమ్ముతో మా వలెనె లేతువని
శుభము పల్కుటలో తృప్తున్న దోయి

**నే**నెంత నీవింత లెరుగ - శ్రీశ
నేనెంత నీ వింత లెరుగ
ఎంతెంత వారలు ఎరుగ లేకున్నారు -

**ఆ**కాశసీమను ఆ కొండ కోనను
కొలువైతివే కోమలాంగ - మాకు
విలువైతివే ఓ శుభాంగ

**అ**టు నారదుని మహతి నాదం
ఇటు తుంబురుని శ్రావ్యగానం
సురలెల్ల నీ ముందు సంకీర్తనం
గోవింద గోవింద ఓహో ముకుంద -

**నీ** చరణ కమలాల నీడ
కరుణామృతపు జల్లు జాడ
కలనైన కనుపించు వాడ
తపియించు నన్నేలు వాడ -

**ప**రచింతకే దారి తిరునామము
దరిజేర పిలిచే కరం
నిరతమ్ము నీ నామ జపము
వరమిచ్చు ఫలితం - అదె నిరతము

జగదీశ!
గిరివాస!
లీలా విలాస!



**భా**సమాన తేజంతో పరంజ్యోతి నీవె
ప్రణవంలో నినదించే పరమవాణి నీవే

**ప్రే**మతో నిండియున్న పరదైవం నీవే
ప్రకృతి నీ ప్రతిబింబము పరమశాంతి నీవే
సకలమునకు ఆధారం సాక్షివి నీవే
సర్వేశా శ్రీనివాస సర్వాధారా

**ర**విచంద్రులలో నిండిన వెలుగువు నీవే
ఆకాశపు నీలమంత నిన్నే తలపించును
అమరాధిప అనంతా అంతానీవే,
అంతులేని ఆనంద సంద్రం నీవే

**జ**గత్కర్త జగద్భర్త జగదీశ్వరా
సర్వమునకు సాక్షి నీవు సామజవరగమనా
సాటిలేని మేటి దైవరాయా
శక్తియుతా భక్తనుతా గరుడ తురంగా

-

**నీ** గుణ గానమె నా జపము
నీ పద ధ్యానమె నా తపము

దయాసాగరా దానవ భంజన
ప్రణవ పవిత్రా గరుడ వాహన

**న**రరూపంలో నారాయణా
నాకై వెలసిన విశ్వాత్మకా
నీ నామస్మరణమె నా ధ్యానం
ఆ - నామామృతమే నా పానం

**ని**ను దర్శించిన నీరౌ వెతలు
నీ రూపమె నా కన్నుల కాంతులు
నీ సంకీర్తన ప్రాణ సమానం
నీ సన్నిధానం వైకుంఠవాసం

**నీ**లో ఏదో నిర్మల తత్త్వం
నీ గుడి వాకిట వెతలే దూరం
నీ గిరి కాదా భూతల స్వర్గం
నీరజనాభా శాంతికి మూలం



**నీ** మోములో కందు నిండు వెలుగుల వాగు
నీ నగవులో చిందు నెలవంక జిలుగు

శ్రీ వేంకటేశా శ్రితపారిజాతా
ఓ వేదవేద్యా లోకైక హితా

**ని**ను తలచితే చాలు నింగిలో తేలు
నా డెంద మానంద లోకాల నేలు
ఇహమంత నే మరచి పూర్ణ బిందువునై
అహమంత అణగారి శూన్యమౌతాను

**నా**లోన సంతోష గగన తారకలు
నవనవోన్మేషమౌ వాసంత లతికలు
మందార మకరంద మాధుర్య నిధులు
కలసి వెలసిన తీరు కనువిందులు

**సె**లయేటి అల తలను చిరు నురుగులు
సెలయేటిలో నున్న చిన్న గలగలలు
సెలయేటిపై వీచు చిరుగాలి హాయి
కలబోసి కనుపించు కనువిందులోయి

**నీ**కే నా నిత్య పూజలు - ఓ వేంకటేశ
నీకే నా సంకీర్తనలు

నీకే నా శరణాగతి భక్తపాలకా
నీకే నా సన్నుతి భాగ్యవిధాతా

**నీ**కే నా ఆరాధన నీకే నా ప్రార్థన
నా జీవిత సర్వం ఇక నీకు నివేదన

నీవేగా భావ ప్రదాత
నీవేనా గీత రచయిత

**నీ** ఊహలలో ఏదో నూత్న ప్రశాంతం
నీ పదములె నా బ్రతుకున తరుణోపాయం
నీ తలపున నాకున్నది యోగం
నీవే నాకీయ గలవు పరమ పదం

**ని**న్ను వీడి ఆలోచన మారిపోదయా
కన్నులలో నీ రూపం కదలాడునయా

నీవేగా సకలాధారం - అందుకే
నీవే ఈ కవితాధారం



**మ**హాప్రభో! కలియుగేశ నీవే శరణం
మానవహిత మహితరూప నీకు ప్రణామం

**మా**కోసం ఇలవెలసిన వేంకటేశా
మా కామిత మీడేర్చే మాధవ రూపా
నీవేగా నిజదైవం నారాయణా
నీకే మా వినతులివె నిత్య శ్రీకరా

**క**ల్లోలిత సంద్రమాయె జనజీవనం
కానరాదు ఏ దారి నీదే భారం
అన్నిటిలో అణురూపా అంతర్యామి
ఎన్నదగిన దేవుడవే సర్వాంతర్యామి

**నీ**వె నాకు ఆధారం నిరుపమాన
నీవేగా ఆశ్రితప్రియ అంజనాద్రీశ
జనార్దన భుజగశయన జయ జగదీశా
జన పూజిత మృదుచరణా జయ లోకేశా

**నీ** గుడి వాకిట నిలబడితి
నీ దర్శనమే ఆశించితి

పరమాత్మా ఓ ప్రేమ సుధాంబుధి
శరణం శరణం శరణం ప్రపద్యే

**భ**క్త పరాధీన పరమాత్మా
భావాతీతా భగవద్రూపా
నీ వొక్కడవే దిక్కిక దిక్కిక
మ్రొక్కిన నీకే మోక్షప్రదాత -

**రా**గం నీవే రావం నీవే
భాగం నీవే పూర్ణం నీవే
ప్రకృతి నీవే ప్రణవం నీవే
ప్రణవంలో గల నాదం నీవే -

**ది**విలో నీవే దిక్కుల నీవే
కాలం నీవే మూలం నీవే
నీవే లేనిది నీవే కానిది
ఏదీ లేదిక ఏకైక శక్తివి



**నీ**వు కాక శ్రీనివాస ఎవరున్నారు
నీవు విన శ్రీరమణా మొర వినువారెవరు

కాచేదెవరు మమ్ము బ్రోచే దెవరు
నీవేగా పరమపురుష నిరుపమాన

**కొం**డలెక్కి కొలువైనావు - మాకు
కొండంత అండవు నీవే
గుండెలో పరదైవమై యున్నావు
వడిగా కోరికలన్నీ తీరుస్తావు

**అం**దరినీ గమనించే ఆదిదేవుడా
ఆర్తులకు ఆప్తుడవగు అనురాగమయా
ఆదరణే ఎంతోగల ఆనంద నిలయా
అందుకే భక్తులునిను కొలిచేరయా

**వి**నుతు లన్ని వింటావు విశ్వాకారా
వరములు వర్షిస్తావు వసుదేవసుతా
ప్రత్యక్ష దైవంగా పరమపురుషా
పూజలతో పులకించే పుణ్యాత్మా

**ఎ**ంతసేపు నిను చూసిన చూడాలనిపిస్తుంది
ఎన్ని పాడినా పాటలు పాడాలనిపిస్తుంది

శ్రీనివాస నీవేగా జీవిత సత్యం
శ్రితజనేశ నీవే నా కవితల సర్వం

**నీ** నామం చూస్తుంటే చెదరదు నా చూపు
నీ మకుటం చూస్తుంటే నిశ్చలం నా చూపు
నీ కరమున నాకున్నది నిరతం నా కభయం
నీ మాలలు హారాలు కనుటే నా పుణ్యం

**అ**భయహస్తమును చూడగ ఆశల హరివిల్లు
సుదర్శనం మాకెపుడును రక్షాకవచం
శంఖం దర్శించగనే శాశ్వతానందం
హారతి వెలుగులలో అద్వితీయ రూపం

**ప**ద పంకజ ద్వయం సదా పవిత్రం కదా
పద పూజా సుమాలతో కలగదోచు కదా
పాదాలను తిలకించిన జన్మే చరితార్థం
పరమాత్మా నిను చూచుటె జన్మల పూజాఫలం



**శ్రీ**నివాస శ్రితజనేశ పాహిమాం పాహిమాం
సర్వేశా సనాతనా రక్షమాం రక్షమాం

**ప**రమాత్మా పరంధామ పాహిమాం పాహిమాం
పరమపురుష పరాత్పరా రక్షమాం రక్షమాం
దోషహరణ దయాభరణ పాహిమాం పాహిమాం
సిరివల్లభ కరిరక్షక రక్షమాం రక్షమాం

**అ**రిభంజన అభయప్రద పాహిమాం పాహిమాం
అమృతరూప అమలాంగా రక్షమాం రక్షమాం
భక్తబంధు దయాసింధు పాహిమాం పాహిమాం
ప్రణవరూప పరాత్పరా రక్షమాం రక్షమాం

**గు**ణరహితా గుణభూషణ పాహిమాం పాహిమాం
సాకారా నిరాకార రక్షమాం రక్షమాం
నిరంజన నిర్వికార పాహిమాం పాహిమాం
రమానాథ రఘుకులేశ రక్షమాం రక్షమాం

**శ్రీ**నివాసు రూపమే చింతనామృతం
శ్రీశుని పదపంకజం కర్మ నాశకం

**ని**రత మతనికే శరణం నిత్యం స్మరణం
పదములకే ప్రణామం జీవితం అంకితం
అదే శోకహరణం సుఖ సంతోషం
అతని సన్నిధానం ఇల వైకుంఠం

**ప్రా**ర్థించిన మోక్షసుఖం
అభివందనలో వినయం
అర్చించిన అమరసుఖం
వినుతించిన విజయం
నారాయణు నామజపం
బంధవిముక్తికి మార్గం
సాధనలో సంకీర్తనం
భక్తికే తార్కాణం

**గు**ణగానం గణనీయం పదధ్యానం పవిత్రం
హృదయంలో ఆ రూపం ఆరని పెనుదీపం
నిజ జీవన మకరందం నింగిని ఆనంద ధ్వజం
ఊహల్లో సర్వం ఊరించే స్వర్గం



**స**ర్వకర్మనాశకా శ్రీనివాసా
సర్వజీవ రక్షకా సర్వేశ్వరా

పరమపురుష పాహిమాం
పరంధామ రక్షమాం

**స**కల భువన నాయకా సకల కాల పాలకా
కౌస్తుభమణి భూషణా కరుణకే కారణా

నీకే శరణం నీకు ప్రణామం
నీ దర్శన భాగ్యం మా జన్మల సుకృతం

**మ**నసంతా కలంచే మా వేదన నాశకా
మానవహిత మహితమూర్తి మధుర మధుర గుణకీర్తి

నీకే శరణం నీకు ప్రణామం
నీ సముఖం ప్రాణం నిత్యం పవిత్రం

**పూ**ర్ణరూప పూజనీయ పుణ్యచరిత పురుషోత్తమ
బంధరహిత భక్తవినుత బాధాయుత జనహిత

నీకే శరణం నీకు ప్రణామం
నీ లీలలు విచిత్రం నీ దయే వాంఛితం

**శ్రీ** వేంకటేశా నారాయణా
శ్రీ శ్రీనివాసా దీనావనా

నారాయణా ఆది నారాయణా
నారాయణా హరి నారాయణా

**అ**లమేలు సతి ప్రియ నారాయణా
అగణిత గుణధామ దీనావనా
అమృతాం తరంగా నారాయణా
అనంత శయనా దీనావనా

**పు**ణ్యాలవాల నారాయణా
పూజిత చరణా దీనావనా
పరమ పవిత్రా నారాయణా
పరమాత్మ సన్నుత దీనావనా

**శ్రి**తభక్తపాలా నారాయణా
శ్రీరంగ రంగా దీనావనా
గరుడ తురంగా నారాయణా
గాన విలోలా దీనావనా

**వై**కుంఠనాథా నారాయణా
వైదేహి ప్రియవర దీనావనా
త్రిలోక పూజిత నారాయణా
త్రిగుణాతీతా దీనావనా



**భ**వహర సిరి వర వృషాద్రి వాసా
శ్రీకర శుభకర శ్రీ శ్రీనివాసా

**వ**రదాన శీలా వృషాద్రి వాసా
సుర సంసేవిత శ్రీ శ్రీనివాసా
శాంతి కారకా వృషాద్రి వాసా
శాంతాకారా శ్రీ శ్రీనివాసా

**గు**ణదోష హరణా వృషాద్రి వాసా
రణరంగ వీరా శ్రీ శ్రీనివాసా
భ్రాంతి వినాశక వృషాద్రి వాసా
కాంతి కారకా శ్రీ శ్రీనివాసా

**ప్ర**విమల తేజా వృషాద్రి వాసా
ప్రణవ స్వరూపా శ్రీ శ్రీనివాసా
జగాల నేతా వృషాద్రి వాసా
జయ జయ శ్రీశా శ్రీ శ్రీనివాసా

**క**ల్యాణ దాయక వృషాద్రి వాసా
కమల దళాక్ష శ్రీ శ్రీనివాసా
గోపీ మనోహర వృషాద్రి వాసా
గోవర్ధనోద్ధారి శ్రీ శ్రీనివాసా

**క**ల్యాణ దాయక కరుణాకరా
కమలేశ కమలాక్ష కంసాంతకా

కనకున్న మనలేను గరుడాచలేశా-
కడదాక పదపూజ కైవల్యము

**నా**లోన నీవుండి నా కనుల నిండి
నా బండ బ్రతుకున నా ఊపిరై ఉండి
ప్రతిరోజు గడిపింపవా - నాలోన
ప్రణవమై నినదింపనా

**నా**దమే ఎరుగని వీణను నేను
తీగలు సవరించనా తీరుగ మ్రోగించవా
పాటలు పలుకని మూగ మురళిని
గానముతో నింపవా - సుధా
పానముగా చేయవా -

**వె**న్నెల కరవగు రాతిరి నేను
పున్నమిగా పూయనా - లోలో వెలుగీయవా
విరిని పరిమళ వనములో మెరుగని
పరిమళమే నింపవా - ప్రసన్నమే కావా -
పరిమళ మెరుగని విరినివనములో



**నీవే** కదా నా చైతన్యదాత
నీవే కదానా కవితా విజేత

నీవే కదా ఓ శ్రీ గిరివాసా
నీవే నీవే వెంకటేశా

**ఇ**హలోక స్మృతి సంతా ఇట్టే మరపించి
ఇక నాకు లోకాన నీవె సకల మనిపించి
అహమంతా కరగించి కోరిక తొలగించి
కన్నులలో నిండిపోవు వెన్నెలవై నావు -

**ప**రిసరాలు మరపించి పరమార్థం తెలిపి
నేనెరుగని నీ లహరిని నను పూర్తిగ ముంచి
కాలమాగిపోయినట్లు స్థితినే కలిగించి
కవనం చెప్పిస్తావు గీతం వ్రాయిస్తావు -

**ని**రతము నను పాలించే నిఖిల నాయకా
ఏ జన్మ పుణ్యమో ఏనాటి బంధమో
నీ వైపే నునులాగి నీ చరణం చూపేవు
నీవే నా సర్వమై నన్నేలే నారాయణా -

**నా** చేతిని నీవుండి నా రచనలు చేయించి
నా పాటల మాటలన్ని నా నోటను పలికి
రవము స్వరము నీవైనావు రాగం నీవై నావు
శ్రీనివాసా శ్రితకమలేశా -

**శ్రీ**శా నీవే నా ఆలోచన - నిశ్చయం
నాలో వెలిగే కవితాదీపం - నిశ్చలం

**అ**ంతా నీ సంకల్పం కాదంటావా
ఆ వెనుకను నీ ప్రేరణ లేదంటావా
ఏ గీతం వ్రాసినా అది ఎలా నడచినా
ఏ గతిలో సాగినా ఏ రీతిగ పాడినా

సర్వం నీ ప్రేరణతో సాగిస్తావు
నా చేయి నీ చేయిగ వ్రాయిస్తావు
ఆనందం నాదైనా ఆలోచన నీదంటా
పల్లవిలో పలుకుతావు పదపదమును నడపుతావు

**సా**గింతువు గీతాన్ని ఓ సనాతనా
సంగీతం సమకూర్తువు వేంకటేశా
చరణాలు నమ్మితినని చరణం వ్రాయిస్తావు
భక్తితో నింపుతావు భావం పూరిస్తావు



**హ**రి ఓం హరి ఓం హరి ఓం తత్సత్
శ్రీశం సురేశం శ్రీ శ్రీనివాసం

**స**త్య స్వరూపం సర్వేశ్వరం
సర్వసుర సేవితం సత్యలోకేశం
కాలాతీతం కాంతి ప్రపూర్ణం
శుభాంగం సుందరం సుగుణాభిరామం

**ఆ**నందకారకం అమృతాంతరంగం
వైకుంఠవాసం వైదేహినాథం
నరలోక వంద్యం నారాయణం
శ్రీకరం శుభకరం శ్రిత భక్తపాలం

**కా**రుణ్యధామం కల్యాణ నిలయం
ఆర్తజన రక్షకం అసురేశ భంజనం
వేదాంతసారం వేదస్వరూపం
ముకుందం మురహారం మురళీధరం

**అ**న్యథా శరణం నాస్తి
హరి భక్తే నా స్థిరాస్తి
అచ్యుతా శరణం మమ
అనంతా శరణం మమ

**నా** హృదిలో నీవు నిండియున్న చాలు
అది నాకు ఆనంద గగనాల పాలు
నారాయణాద్రీశుడే లోన జాబిల్లి
ఆ భావనే నాకు తెలిబొండు మల్లె

**ప్రే**మాంతరంగా శ్రీరంగ రంగా
ప్రణవ స్వరూపా ప్రమోద శృంగా
నా తనువు నా మనువు నీ కంకితం
నా కవనం నా గీతం నీ కల్పితం

**నీ** నామజపమే నే చేయు తపము
నీ ధ్యాసయే నాకు నిధి వోలె ఆశ
నీ దివ్య చరితమే కర్ణామృతం
నీ సన్నిధిని గాలి జీవామృతం

-



**త్రి**భువన మోహన త్రివిక్రమా
త్రిలోక నాయక పరమాత్మా
నీవే వేదం నీవే నాదం
నిదే నీదే నిరుపమ రూపం

**బ్ర**హ్మరూపుడవు నీవేగా - పర
బ్రహ్మ, మహోన్నత సకలాత్మ
దశ దిశలందున నీవే నీవే

**శ్రీ**నివాసా శ్రీగిరీశా
తిరుమల మందిర లోకేశా

**పి**పీలికంలో నీవున్నావు
పెను గజేంద్రమున నీవున్నావు
ప్రకృతి సర్వం నీ ప్రతి బింబం
ప్రతి అందంలో నీ ఉనికే-
నీవు లేనిది లేదోయి
నింగి నేల నీ దోయి
**జ**గతిని నడిపేది నీవు
జాగృతి చేతన కద నీవు
జనగణ మనముల నీదయ్యా
జగతి ప్రగతికిక నీవయ్యా
మోక్ష ప్రదాత నీవే

**జ**గత్కర్త జగద్రక్ష శ్రీనివాసా
జనమంతా నీవారలం
జగమంతా నీ అధీనం

**జ**నన మరణములు రెండును నీ నాటకం
జీవకోటిపాలన నీకు వినోదం
జననంతో సంతోషం మరణంతో సంతాపం
ఏదైనా నీ దయే ఏమైనా నీ లీలే

**బా**ధలతో కంటనీరు తెప్పిస్తావు
సుఖాలతో నవ్వులలో తేలుస్తావు
ఆరోగ్యం ఈదినం రోగంతో మరుదినం
ఏదైనా నీదయే ఏమైనా నీవే

**ఒ**క నిముషం శాంతి అనే మహౌషధం
మరు నిముషం సంక్షోభం మహా అగాధం
ఒక్క క్షణం మానసాన నిశ్చలదీపం
మరుక్షణం ఆరిపోవూఇక నీదే భారం



**న**న్ను విడువకు నారాయణా
నిన్ను వదలను నిరంజనా

ఎక్కడనున్నా ఏ స్థితినున్నా
ఈ జన్మకిక నీవే నా దైవం

**ఆ**దమరచి నే నిదురను మునిగిన
కలలేవో నే కంటున్నా -
కలలో నీవే కనుపించాలి
కాదన కోయి, కమలాసనా -

**నే**నేది తినిన నీ ప్రసాదమే
నేనేది పాడిన నీ గీతమే
నేనేది రాసినా నీ సంకీర్తన
ఏ పూజ చేసిన నీ పూజగా -
**కా**వాలి కల్యాణ ధామ
నిండాలి నా హృదయ సీమ

**మ**రణించు సమయాన నిను తలవాలి
మరువనీయకు నన్ను నీ పేరు పలకాలి
**అ**ంతర్యామిగ నీవుండాలి
ఆనందమే లోన విరియాలి

**ని**త్య పూజనీయాలు నీ చరణాలు
నిత్య వందనీయాలు నీ చరణాలు
నీ చరణం శ్రీనివాస వేదసమానం
నీ చరణం నిఖిలేశ నిత్య ధర్శనీయం

**చిం**త నామృతం సదా నీ చరణాలు
పరమ పవిత్రం సదా నీ చరణాలు
కోటి కోటి పుణ్యనదుల స్నాన సమానం
దర్శనం ధన ధాన్య దాన పుణ్యఫలం

**త**లచిన వెనువెంటనే ఆనంద భాగ్యం
నమ్మిన భక్తుల కెల్ల మోక్ష సమానం
పాపాల బాధనుండి కాపాడే సాధనం
శాపాలు ఫలియించని శక్తిపూరితం

**ని**త్య స్మరణీయాలు నీ చరణాలు
నిత్యాశ్రయ నీయాలు నీ చరణాలు
చిత్తకాంతి ప్రదాతలు నీ చరణాలు
అతిపవిత్ర క్షేత్రాలు నీ చరణాలు



**వేం**కటేశ వందనం విశ్వరూప వందనం
అభివందన హరిచందనం -

**వి**శ్వంభర నీ సృజన విశ్వమంత నీ దయ
విశ్వంలో వారలం పడిలేచే పాపులం
నీ మాయకు నీ లీలకు సుడులు తిరుగు పడవలం
నీ యోచన సంద్రంలో లేచి పడే తరగలం

**నీ** ఆనకు చలనం ఈ భువనం భ్రమణం
కనుసన్నల కదలునుగా లోకాలు సమస్తం
చరాచరము లన్నియు నీ సంకల్పం
జనన మరణ రహస్యం నీలో నిక్షిప్తం

**కా**లచక్ర గమనం నీ లీలా వినోదం
కారు మేఘ చలనం నీకే అధీనం
వాయు చలన వేగం నీ విలాసం
వాన కురియు వైనం నీకే విదితం

**వే**డెద నోయి వేంకట రమణా
వినతులు నీకే వినుమో స్వామీ

**హృ**దయపు కోవెల తలుపులు తెరచితి
శుభములు పలుకుచు నిన్నే పిలచితి
కృపాసుధాకర పూర్ణబింబ మా
అపార ప్రేమకు పూర్ణ కలశమా
రావా రావా లోనికి రావా
దిగిరా దిగిరా గిరి దిగిరా

**ప**రమాత్ముడ వని భక్తిని పెంచితి
దేవ దేవుడని తను వర్పించితి
కిన్నర వీణా నాద వినోదా
మంజుల మురళీ గాన విలోలా
రావా రావా రాధారమణా
దిగిరా దిగిరా గిరిధారీ

**ని**న్నే నిత్యము తలచి పిలచితి
నీ రూపములో ఊపిరి నిల్పితి
కన్నుల వెన్నెల కాచే శిశివై
మిన్నుల వెలిగే మీన శరీరా
రావా రావా రాఘవ రూపా
దిగిరా దిగిరా దివ్య స్వభావా



**వేం**కటాద్రీశుడండి శ్రీనివాసుడు
వైకుంఠ నాథుడండి శ్రీదేవుడు

**వే**డుకున్న చాలండి వెన్నలా కరుగునండి
అందరికీ అభయమిచ్చు ఆదిదేవుడు-

**చిం**తనంత తొలగించు చిద్విలాసి చింతామణి
స్వాంతంతో శాంతి నింపి మనుగడలో హాయి నిచ్చు

**పా**పాలను పరిహరించి పాపచింత తొలగించు
అహం మాపి పరం చూపు తొలగించే దేముడు

**హ**రి హరియని మనసారా అతని చింతనామృతం
అంతా శుభమే ఇచ్చును అనుమానం వదలండి

**శ్రీ**నివాస చిద్విలాస కరుణాసింధు
కనికరించి కావరావ భక్తబంధు

**అ**భయ మీయరావా ఆశ్రిత జననాథా
అణువణువున అఖిలలోక మందున్నావు
అని నమ్మితి నా నమ్మిక వమ్ము చేయకు
అఖిలాత్మకా సప్తగిరీశా -

**స**ర్వవేళలందు నను కాచే సర్వేశా
వేరెవ్వరు నాకులేరు వేద వేద్యా
చేసేది సర్వం నీ చిద్విలాసం
చేసేది ఏముంది నీ అధీనం

**పా**పాలతో పండెను నా జీవితం
పడగొట్టి నా కీయవా కొత్త జీవితం
నిఖిలేశా! నీ తలపే నా సుఖలోకం - నీ
నామ సుధా పానమే నాకికలోకం

**కా**ఠిన్యత ఎరుగని ఓ కరుణామూర్తీ
శరణాగతి నీకే నిక శాంతికారకా
నీవు వినా నాకెవ్వరు రక్షకులు
లేవు నాకు లోకాన ఏ ఆశలు



**క**నికరమే చూపవా కారుణ్య నిలయా
కమలేశ కలియుగేశ దయ చాలయా

నీ గీతాగానమే నిజ భాగ్యము
నీ గీత రచనయే నిజ భోగము

**నీ** మ్రోల నిలచి పాపాల దలచి
నీ జాలి కరవై నిలువెల్ల నీరై
మదినెంచి నీ శరణు నే కోరితి
మనసార నీ చరణం నే బట్టితి

**ది**వి వీడి గుడిలోన వెలసేవుగా
దీనాపరాధీన దామోదరా
వేరెవరు గలరింక మొర వినుటకు
వనమాలి నాపాలి వసుధేశ్వరా

**క్ర**తువుగా పూజగా కమనీయమైన
బ్రతుకంత హాయిగా సాగిపోనీ
నీ గీతులెన్నో నను వ్రాయనీ
ఆ పాటలే పాడి స్తుతియింపనీ

**శ్రీ**గిరి మందిర సుందరా
శ్రితజన రక్షక ఈశా నమో
శ్రీనాథ కరివరద నారాయణా
శ్రీకర భవహర దీనావనా

**మా**నవ జీవిత మహారణ్యమున
మనిషికి జీవిత మధురత తెలియక
నీ కల్పన యగు వింత సృష్టిలో
నిలకడ లేదే నీదే భారం -

**కా**మిత మీడేర్చు కమలాసంగ
ఏమని వినుతింతు శ్రీరంగ
కలిలో నలిగి నశించే జనులకు
నీవే కాదా వినతులు వినుటకు -

**స**కలమునకును సాక్షివి నీవే
సత్యం నీవే ధర్మం నీవే
మానస దేవళ మంటపమందున
మరి మరి నిల్పితి వినతులు వినుమా



**పా**లయమాం పాలయమాం
పరమాత్మ హరి పాలయమాం

**ము**రహరి నరహరి పాలయమాం
ముకుంద మాధవ పాలయమాం
దశముఖ మర్దన పాలయమాం
దశరథ నందన పాలయమాం

**ము**నిజనవందిత పాలయమాం
సురజన పూజిత పాలయమాం
రఘువర భవహర పాలయమాం
రాధారమణ పాలయమాం

**సా**మజ రక్షక పాలయమాం
సన్నుత సురేశ పాలయమాం
ప్రహ్లాద వందిత పాలయమాం
ప్రసన్న వదనా పాలయమాం

**గో**వర్ధనధర పాలయమాం
గోకుల రక్షక పాలయమాం
గోపాల బాల పాలయమాం
గానవిలోలా పాలయమాం

**నా**రాయణాద్రీశ నా సర్వపోషకా
నను కరుణ జూడయ్య నగరాజ నిలయా
నా ఎదను కొలువైన స్వామి
నా సొదలు వినవోయి స్వామి

**పా**తకము తొలగించు పంచధారలు గల్గు
పుణ్యప్రదంబైన పూర్ణ క్షేత్రంబైన
సప్తగిరి శిఖరాన స్థిరపడిన దేవా
సర్వ జీవాధార పాలించ రావా

**గు**డివాకిటను నిల్చి నిను వేడితే చాలు
కరుణనీలో పొంగి కదలి వస్తావని
నీ కొరకు తపియించి నిన్నె కలలో కంటి
నీవె కాదని విడువకోయి
నీవె ఔనని పలుకవోయి

**ని**న్నెటుల మరతును ఎటుల నిను విడుతును
నీవె నాలో నిండి ఉండిపోయావు
ఔనన్న కాదన్న నీవె నా దైవం
ఎన్నాళ్ళు నేనున్న నీకే ప్రణామం



**క**లియుగేశ వేంకటేశ కరుణాలయ
కళలు చిందు కళాత్మక కల్యాణమయ

**ఆ**శ్రిత జన వత్సలా అభయ ప్రదా
అఖిలలోక నిలయా అంతర్యామి
నా నమ్మిక వమ్ము చేయకు
నారాయణ గిరి నివాస

**పా**ప పంకిలము కాదా నరజీవితం
పరితపించు నా ఎడదకు కోరితి శాంతం
వినుతింతును నిరంతరం
అంతా నీ అనుగ్రహం

**క**రుణాంతరంగుడవు కలియుగేశ
శరణంటిని దిక్కు నీవె శాంతాకారా
శరణాగతి నీకే నోయి
శేష శయన నీవే నోయి

**వే**ంకటేశా వేడుకొంటిని
వెంట నిరతం ఉండమంటిని
ఆలసింపక ఆదరించవ
అసుర భంజన అనంతా

**త**నువు నీ దయ మనువు నీ దయ
మనసు నీ దయ మాధవా -
మదిని మెదిలే భక్తిభావన
కాద నీ దయ కావవా -

**భ**క్తి వనిలో మాలి నేను
వనము పెంచే దాత నీవు
పూవులెన్నో పూయనీవా
పూలు సర్వం నీవెగా -

**ఆ**శలెన్నో అల్లుకొన్నవి ఆదిపురుషా లతలుగా
పాదపద్మము ఊతగా -
జారనీయక ఎదగ నీవా జోరుగా
మొగ్గతొడిగే భాగ్యమీవా తీరుగా



**క్ష**ణ క్షణం ప్రతీక్షణం
నీ గుణ సంకీర్తనం శ్రీనివాసా
అనుక్షణం ప్రతీక్షణం
నీ దయకై నిరీక్షణం శ్రీధరా

**ప**దం పదం ప్రతీ పదం నీ గీతికి భావం
ప్రతిభావం కుసుమించే ప్రమోదానరావం
భావాలే భవబాధకు దూరం
రవమంతా సుస్వరాల తీరం

**స్వ**రం స్వరం ప్రతీ స్వరం రాగంలో భాగం
ప్రతిరాగం నా శక్తికి నీ భక్తికి దాహం
రాగాలే ఎదఎదలో సొదలు
రాజిల్లే రసరమ్య రొదలు

**స్వ**రరాగం సర్వహితం పరమార్థ గీతం
ప్రతి గీతం సంగీతం సుధాసింధు సంకేతం
సంగీతం సప్తస్వర సమ్మేళనం
ఓంకార నాదంలో అంతర్లీనం

**నా** జీవితం నీకంకితం
నా మానసం నీ ఆలయం - దేవాలయం

చేసేను శ్రీ గిరీశా - నీ కోసం
వేచి ఉంటి వేంకటేశా

**నీ** భావనే సంగీతము
నీ నామమే నా గీతము

నీ లీలలో తేలి నీఊహలో తూలి
నా మనసు గ్రోలింది పీయూషము

**నీ** పాదమే నా సర్వము
నీ చేతిలో ఆహ్వానము

ఇంకేల కోర్కెలు జంకేల నా కిల
నా కింక బ్రతుకంత వైభోగము

**నీ** చూపులో ప్రేమామృతం
నీ రూపులో సౌజన్యము

ఆ రెండు నా గుండెలో నిండినాయి
ధ్రువతారగా బ్రతుకు నడిపించెలే



**నా**మాలు ఎన్నున్న నా దేముడొకడే
నర రూపమున వెలసె నారాయణాద్రీశుడై

**శ్రీ**హరి రూపాలు ఎన్నున్న గాని
రూపానికొక పేరు మనకున్న గాని
ఒకటే కదా మూలం ఒకటే స్వరూపం
మునిజన మానస మందారం

**ర**విచంద్రులే గాని నక్షత్రములుగాని
రాజిల్లు నది ఒక్క వెలుగే కదా
తరులతలు ఎన్నైన విరులొక్కటే
పూలన్ని ఎన్నున్న పూజొక్కటే

**న**దులన్ని ఎన్నున్న నీరొక్కటే
సుడిగాలి చిరుగాలి ఏదైన గాలే
జీవులు ఎన్నైన జీవాత్మ ఒకటే
నరజాతు లెన్నున్న నరుడొక్కడే

**న**మో నమో  శ్రీ వేంకటేశా
నమో నమో కైవల్యదాతా

కాంతిం స్వరూపా  నమో నమో
కల్యాణ మూర్తీ నమో నమో
కామిత ఫల ప్రదాయకా
కారణ కారణ కరుణాకరా

**కృ**పార్ణవా నమో నమో
కృష్ణావతారా నమో నమో
త్రికాల వేద్యా నమో నమో
త్రిలోక పూజితా నమో నమో

**అ**నంత శయనా నమో నమో
అనంత మోహన నమో నమో
అభయదాయకా నమో నమో
అపూర్వరూపా నమో నమో

**వి**శాల నేత్రా నమో నమో
విశ్వవిధాతా నమో నమో
వైకుంఠవాసా నమో నమో
వరాల దేవా నమో నమో

**న**మో పరమ పురుషా
నమో పరమ తేజా
నమో పరంధామా
నమో నమో నమో నమో



**గ**రుడాద్రివాసా గోవిందా
కలియుగ రక్షక గోవిందా

భక్తుల పాలిట భగవంతుడవు
బాధలు బాపే పరమాత్ముడవు

**నీ** దయ లేనిదె నీడయు కదలదు
నీల గగన ఘన శ్యామా -
జనన మరణముల జాతక కర్తవు
జగముల నేలే జనార్దనుడవు

**నీ**వు సరంటే నిలచును భువనం
నీవనుకుంటే రేగును ప్రళయం
నీ కనుసన్నల కదలును సర్వం
నీ యోచనగా సాగును సకలం

**శో**కము  నార్పే శక్తిమయుడవు
యోగము మార్చే యుగపురుషుడవు
నీ ఆనకు కద మిన్నులు నిలుచును
నీవే నీవే అజేయ శక్తివి -

**ది**క్కులేని వారికి దేవుడే దిక్కు
ఆ దేవుడు నీవేగా శ్రీశా మా దిక్కు
కొండలపై కొలువైతివి కోమలాంగా
కొండలా అండమాకు కోసలేంద్రా

**భో**గ భాగ్య మొందలేని వారు కొందరు
రోగ బాధ కోర్వలేక ఎందరో ఎందరో
రోగాలే పోనివారు ఎందరో కొందరు

వేదనే ఆరిపోదా - ఇక
వెలుగే కానరాదా

**బ్ర**తుకంతా చిక్కులతో బిక్కుమనే వారు
ఉన్నదంత పోయి పోయి ఉసురుమనే వారు
బంధాలే బాగులేక బాధపడే వారు

దుఃఖానికి అంతేలేదా - ఇక
ఆనందమే రాదా

**సు**ఖమన్నది జగతిలో అసలు నిలువదేల
బాధలే బ్రతుకులలో భాగమౌట దేల
అపుడే నిను తెలియుదురని నీదు లీల

ఎన్నాళ్ళీ జగన్నాటకం
ఎపుడివి ఇక పరిసమాప్తం



**న**గుమోము కననీయవా - సిరిదొర
నన్నేలు పరదైవమా

కనినంత ఆనంద బృందావనం
ఎనలేని రమణీయ సురనందనం

**నీ** నవ్వులో మాకు నిత్యం శుభాలు
ఊహకే అందని గగనాల శోభలు
సంతోష సారంగ సరిపరుగులు
చందమామను నిండు చల్లందనాలు

**నీ** నవ్వులో మాకు వీణా వినోదాలు
యమునమ్మ ఎదమీద అలల మిలమిలలు
మురళీధరుని వేణు గీతా స్వరాలు
వినగనే మైమరచు రాధమ్మ భావాలు

**నీ** నవ్వులో మాకు చంద్రోదయం
హృదయాన సరసున ప్రఫుల్ల పద్మం
ఎందుకోయి స్వామి ఊరింతలు
అందీయవా వింత పులకింతలు

ఏడుకొండలవాడ వేంకటేశా - స్వామి
ఆపద మొక్కుల వాడ ఆదుకోవేమి

కొండెక్కి నీ అండ కోరేమయ్యా
కోటిదండాలు నీకు పెట్టేమయ్యా
నిన్నే మా గుండె నుంచి నీ భజనలే చేసి
దినదినము వేడేమె దీనపాలకా

కలియుగాన మాకోసం కొండెక్కేవు
కలకాలం ఆడనుండి కరుణ జూడు
అరచేత అభయమ్ము చూపినావు
అందరికీ ఆనందం పంచినావు -

కంటనీరు రాకుండ కలియుగేశ
ఇంటిలో బతుకనిమ్ము వెంకటేశ
మొక్కులన్ని తీర్చేము చిక్కులన్ని మాయం
ఎక్కడైన ఎప్పుడైన చేయనీకు ఏ పాపం



అలమేలుమంగమ్మ మాయమ్మ
అపరంజి బొమ్మ అందాల పూరెమ్మ

రావమ్మ.......రావమ్మ........ రావమ్మ
కొలువుండ రావమ్మ కోరితిమమ్మా

కోనేటిరాయని దేవేరివి
ఈ నాటికినీ మా ఇలవేల్పువి
అలనాటి సీతమ్మవే కావవే
ఇలలోన ప్రియభక్తులను బ్రోవవే

మా బండ బ్రతుకులు నీ కరుణతో నిండ
నీ గుండె కరగి మాకుండి పోవమ్మ
చిరునవ్వు చిందిస్తు దీవించవే
ప్రేమంత ఒలికించి పాలించవే

శ్రీదేవిగా మాకు సిరులీయవే
అభయాల నీడల నిలువ నీవే
నీ మ్రోల మా స్వర్గము
వేరేది ఇక కోరము

**ము**జ్జగాల మురిపించే ముద్దుగుమ్మా
ముల్లోకముల వెలుగుల వెన్నెలబొమ్మ
అలమేలు మంగమ్మా
జగమేలు జననివమ్మా

**నీ**వే నిజమంటిని నిత్యము నీవంటిని
నిర్మల భక్తిని నిన్ను నే కొల్చెద
నాలో ప్రతి అణువులో నిండిపోవా
నన్ను సదా నీవే పాలించవమ్మా

**సు**గుణాల శోభిని శుభవరదాయిని
సుమసుకుమారివి సురసంసేవిని
అకళంకమై నీవు అప్సరో భామినివి
ఆనంద తరంగిణి అపురూప రూపిణి

**నీ** సన్నిధిలో నిలచి నిన్నే మదిలో తలచి
నిను సందర్శించిన దిక్కు నీవుగా నమ్మి
నీ కరుణే పారదా సుధనిండే ఏరులా
నీ ప్రేమ పంచవా పెన్నిధిలా మాకు



**అ**మృతాంత తరంగిణి
అనుపమాన రూపిణి
అలమేలు భామిని
అందాల రాగిణి

**నీ** మేని కాంతిలో నింగిలోని కౌముది
నీ చల్లని వీక్షణలో నిర్మల హిమ శీతలం
నీ చేతి అభయంలో నిత్యామృత వర్షం
నీ సన్నిధి మా పెన్నిధి నే విన్నధి నిజం

**నీ** హృదయం నిర్మల మానసరోవరం
నీ ప్రేమే మా వైపు ఎగురు మరాళం
నీ వదనం నిండుగా విరిసిన సరసీరుహం
నీ నీలవేణిలో నింగి నీలి మేఘం

**నీ** అభినవ రూపంలో వినువీధి అందాలు
నీ భావన మా యోగం వాత్సల్యం సుకృతం
నీ ఉనికే శుభయోగం నీ తలపున భవితవ్యం
నీ కీర్తన సంకీర్తన నీ దయకై తపనం

**స**రిగమపదని సప్తస్వరముల
సంకీర్తనే పాడనా సంగీతమే వినిపించనా

అలమేలుమంగని ఆలాపన చేయనా
అమృతవర్షిణి వినిపించనా

**మ**ందరమ్ములో మదిలో తలచి
మధ్యమమ్ములో మహిమలు చాటి
పంచమమ్ములో పాటలు కూర్చి
షడ్జమమ్ములో సన్నుతించనా -

**స**రిగమకముల రీతులు మార్చి
గతులను శ్రుతులను నుతులు పాడనా
మృదు మధురముగా పదబంధముల
దయా తరంగిణి - నిరంజనీ

**న**యనాలు మూసి మది నిన్ను తలచి
సామ వేదముగ సంగీతముతో
ఆనందమయి ఆత్మార్పణ ఇదె
ప్రేమ సుధామయి ప్రస్తుతించనా



**కో**టిదీప కాంతులతో అలరుమేల్మంగ
కొలువైతివే గుడిని - కోరి ఏలుకోవా

**ఆ**నందం నీవంటే డెందము ఉప్పొంగులే
ఆనందం నీ వదనం చిరునవ్వున వెన్నెలే-
అకారణపు కన్నీరు ఆగకనే వస్తుంది
అంతరాన ఏమౌతుందో
ఆంతర్యం ఏమనాలో

**కొ**త్త కొత్త అనుభూతులు కోరకనే కలుగును
కొండంత సంతోషం కోరి వెన్ను తట్టునే
పాపాత్ములందరికీ వరమిచ్చే దేవతవు
పరమపావనీ మాకు వరమీయవా

**ది**విలోని దేవతలకు రారాణివి
భువిపైన మానవులకు భవహారివి
దీనజనుల పాలిట ఆ కల్పతరువువి
దివ్యత్వం నీలోన దిగి వచ్చును మాకై

**క**న్నులు మూసిన నీ రూపం కందునోయమ్మ
కన్నులు తెరచిన మాముందు కందునోయమ్మ

అమ్మా మంగమ్మా
అందాల విందమ్మా

**క**లలోనైనా కమ్మని రూపం
ఇలలో మదిలో శాంతికి దీపం
చీకటి బాపే చిన్మయివి
చిందే వెలుగుల వారాసివి

**స**ర్వత్రా నీ సత్య స్వరూపం
సాక్షాత్కారం సర్వేశ్వరీ
దిక్కు దిక్కునా దివిలో భువిలో
దివ్యాతి దివ్యవు వరదాయినీ

**బం**గరుబొమ్మా భాగ్యమయీ
భావాంబరమున శుభతారా
కన్నుల నిండిన కాంతిమయీ
కాదనకమ్మా కరుణామయి



**అ**లమేలుమంగమ్మ అలినీలవేణి
రంగారు బంగారు లలనామణి
రావమ్మా కలహంసలా
రావమ్మా కల్యాణిలా

**నా**రీ శిరోమణి రావమ్మా
లేరు నీ సరిసాటి దయచేయవమ్మా
మా బోటి నరులకు మహిలోన దైవం
మాకిక ఇలవేల్పు నీవే దైవం

**కా**లు మోపిన చోట కల్యాణదాయకం
కనుల చూపే చాలు కారుణ్య పూర్ణం
నీ దీవెనే చాలు నిగమాల నిలయం
నీ పాలనే చాలు నిత్య సౌభాగ్యం

**నీ** నవ్వులో మాకు నవనందనం
నీ సన్నిధే మాకు సురకల్పకం
నిను జేరుటే జన్మ పరమావధి
నీ గుండె కాదా దయాజలధి

**ద**యగల మంగమ్మ దంతపు బొమ్మ
తలపుల మెరపుల అపరంజి గుమ్మ

**హ**రివిల్లు సొగసుల ఆనందిని
అపురూప సంపదల వరదాయిని
అభయాల ఆనంద గగనాల చంద్రిక
అంతన్నదే లేని అనురాగ దీపిక

**ద**ర్శించితే చాలు ధనధాన్య నిధులు
దయ కలిగితే చాలు ఎదలోన సుధలు
కన్నీటి వర్షాలకంతం
శ్రీదేవి దయ ఉన్న సొంతం
అది చాలదా ఎన్నో జన్మలకు అంతం

**ఆ**మె గుడి వాకిటను తలచుకుంటే చాలు
గుడి చుట్టూనూ తిరిగి నిలుచున్న చాలు
దివ్యమహిమలు చాల కలగుటే తథ్యం
లోలోని భక్తికది తార్కాణం



**అ**నాథులం అభాగ్యులం అశలేని వారలం
అలమేలు దేవి నీవె మాకాధారం

**వ్యా**ధులతో బాధలతో వేదనే నిండితే
వేరెవ్వరు కానరాక వేసారితే
నిన్ను దలచి మొరలిడితే ఆదుకోవా
నీవే మా ఇలవేల్పుగ చేదుకోవా

**క**న్నీటితో నిండి కనికరింతువని నమ్మి
కలిబాధ బలినుండి కాపాడుతావని
వరదాన శీల వని వందనాలు అర్పించి
వదలమింక నీ పాదాలు
చూపు దయా దాక్షిణ్యాలు

**నీ** జాలి చూపుకే నీ రౌను మా వెతలు
మల్లెపూల నవ్వులే మాలోన నిధులు
'నీ' 'నా' విభేదాలతో వాదులాడు వారలం
నీవే మా ఆలంబన
కావాలి శుభకామన

**ప**రమపవిత్రం అలమేలు వేలుపు
పాపవినాశిని అలమేలు వేలుపు
నిత్యం సత్యం నీలవేణి
నిరుపమ రూపం నవలామణి

**వ**రాల తల్లి వందిత చరణా
వరదాయినిగా చూపును కరుణ
మానవ జాతికి ఆశాజ్యోతి
బాధలు బాపుట కాదా ప్రీతి

**భ**క్త జనవాళి బంధ విమోచని
పరమ దయానిధి శాంతి ప్రదాయిని
సకల చరాచర సృజనకారిణి
మానస సంతస సుధా తరంగిణి -

**అ**మృతవర్షిణి అమోఘ రూపిణి
అనుపమ శక్తి స్వరూపిణి
హృదయ గగనమున సౌదామిని
శిశిరపు బ్రతుకున వసంత వాణి



**అ**మ్మా మంగమ్మ దయామయి
ఆశ్రిత రక్షకి హరిప్రియ

నీవే శరణం
నీ నామ స్మరణం
నాకిక నిరతం భవభయ హరణం

**నీ** అభయంతో తొలగు భయాలు
నీ ఆశీస్సుల కలుగు జయాలు
నీ వలిగితివా ప్రళయం ప్రళయం
నీ కరుణకు కద సుఖం శుభం

**నీ** ఉనికే మాకు నిగమాలయం
నీ సన్నిధియే శాంతికి మంత్రం
నీ పూజలలో పరమపదం
నీ పదస్పర్శయే నిర్మలయోగం

**మం**చికి నీవే మానవరూపం
నీలో క్షమకి లేదిక అంతం
నిన్నే నమ్మిన నీ భక్తులకి
నిరంతం ప్రేమను వర్షించు నాయకి

**వ**రాలనవ్వుల అలమేలు
వరాలీయవమ్మా - భక్తుల
పరిపాలించవమ్మా! -

**మొ**రాలకించి చిరాకు పడక
కరాల దీవెన లందించే దేవి
జాలి చూపుల జనయిత్రి
ఆదరించుమా శుభనేత్రి -

**అ**కళంకమ్మగు అమ్మ ప్రేమతో
కుసుమకోమలీ కువలయ నయనీ
నిరాశ నిండిన నిత్య జీవనము
ఆనందంతో సాగించవమ్మ -

**ధ**గ ధగ మెరిసే దంతపు బొమ్మా
సందర్శనమే సంతోషం -
ఓయని పిలచి ఒకింత వేచిన
ఓయని కోరిక తీర్చే దేవీ -



**అ**మ్మవందనం అలమేలు వందనం
నీ చల్లని చూపులో మా జీవనయానం

**ద**యాపూర్ణ తరంగం సౌహార్ద్ర సౌధం
కాదా నీ నిర్మల హృదయం
నీ క్షమాగుణ గానం మా సంగీతం
నీవే మా సర్వమంటె పొంగు మానసం

**నీ** దయనే ఆశించి నిన్నే ఎదలో నుంచి
నిన్నే కీర్తించితిమా చాలు వరం బలం
మా జన్మలు పావనమగు ఆశాభావం
సత్కర్మల భాగ్యం సకలం సఫలం

**నీ** సన్నిధిలో నిలచిన నిలువెల్ల పులకలు
నీ పై మా ధ్యాసుంటే తన్మయం నిశ్చయం
మాకదే పదివేలు
మా జీవితాలేలు

**అ**మ్మా అలమేల్మంగ ఆదరింపవా
అభిమానం ప్రసరింపవా
తొలగింపవా మా సంతాపం
కనికరించితే మాకది హాసం

**ఈ** ఇలలో నీకు సాటిలేరు సమానం
మా కలలో నీవెపుడును మానస దీపం
నిరుపమగుణ సుస్వరవాణి
నిజనాథుని హృదయరాణి

**జ**గమంతా నీ రాజ్యం జనమంతా నీవారం
జగదేక సురుచిర వనితాలలామ
శుభగాత్రి శుభనేత్రి సుందర సుకుమారి
ఆదరించు మానసి అందరి వరదాయిని

**నీ** చల్లని చూపులలో నిరంతరం శాంతి
నీ పవిత్ర చరణాల తలపులలో తన్మయం
మా మానస వీధులలో మసలే దివిజేశ్వరి
మా భావన లహరిలో డోలలూగు శుభంకరి



**ద**యామయి మనోన్మణి అలమేలాత్మ
దనుజ వైరి ప్రియ సఖి జగన్మాత

**అ**భయ ప్రదాయిని అందాల రాగిణి
జన మానస వీధులలో అమృతవర్షిణి
మరువలేము నీ సుందర వదనారవిందం
మరచిపోము నీ అనంత మోహన రూపం

**ప**ద్మాలయ పద్మజ పద్మదళాక్షి
పావనసిరి, శ్రీహరి చిద్రూపిణి
మరువలేము ముఖచంద్రిక సందర్శనం
ప్రవిమల శుభచరణా పాపవినాశిని

**శ్రీ**దేవుని హృదయంలో స్థిరనివాస భాగ్యం
అనుదినమున నిను తలచిన అది మాకు శుభం
నీ దయకై తపియించే వారలం
నీ మదిలో స్థానానికి తపనం.

**జో**హారు అలమేలుమంగ
జోహారు జోహారు ఓహో శుభాంగి

జోహారు అందాల రాణి
జోహారు అలినీల వేణి

**జో**హారు జోహారు అభయ ప్రదాయిని
జోహారు ప్రియపూర్ణ శుభదాయిని
జోహారు జోహారు ఓ మధుర గాత్రి
జోహారు జోహారు సుఖజీవ ధాత్రి

**జో**హారు అపురూప సుగుణాల రాశి
జోహారు అరవింద అందాల వారాసి
జోహారు జోహారు శుభకల్పవల్లి
జోహారు జోహారు సిరుల మా తల్లి

**జో**హారు పరిపూర్ణ ఆనంద భామిని
జోహారు ఆత్మీయ లావణ్య శోభిని
జోహారు జోహారు నవనవోన్మేషిణి
జోహారు జోహారు మృదుభాషిణి



**న**మస్సులమ్మా నమస్సులమ్మా
అమ్మా అలమేల్మంగ అందాల దేవివనంగ

**అ**మ్మలలో మాయమ్మ
అమృత మొలికే వోయమ్మ
అంచులులేని ఆనందానికి
ఆశ్రయమే నీవమ్మా - ఆశవు నీవమ్మా

**ని**ండు ప్రేమ కద నీ హృదయం
నీ భక్తుల కది నిత్యాంకితం
నీలో చూతుము నిర్మల తేజం
నిరతము కొల్తుము నీ రూపం
నీవే మాలో దీపం -

**అ**నురాగ పూర్ణవు మాయమ్మా
అమ్మా అంటే ఓయందువమ్మా
అన్నిటికీ నిను నమ్మితి మమ్మా
వరాల మాయమ్మా - నమ్మిక
వమ్ము చేయకమ్మా

**భు**వనమోహిని - దేవి
వేంకటపతి సతి సర్వము నీవే -

**అ**న్నుల మిన్న అకళంక రూపిణి
సురనుత కల్యాణి సుందర రూపిణి
విలసత్ ఛాయల విశ్వంభరివి
వికాస విలాస వినోదిని -

**త**మో వినాశిని తామస హారిణీ
అభయకారిణీ ఆనందదాయిని
అమోఘ మహిమల అలరు శిఖామణి
అపురూప రూపిణి అలినీలవేణి

**స**ప్త స్వరముల సంగీత లక్ష్మివి
సరసరాగముల సౌజన్యమూర్తివి
కవుల కల్పనలు సాగించు శక్తివి
నాట్య భంగిమల భావన రక్తివి



**హ**రిలో రంగహరి - మంగకు
చేయండి భజన మరి

హరిలొ రంగహరి హరిలొ రంగహరి
హరిలొ రంగహరి హరిలొ రంగహరి

**అ**లమేలమ్మకు వేంకటేశుని
అభేద భావం మదిలో మెదలగ
అంతరంగమున ఆనందముతో
వర్షించును ఇక వరాలనేకం -

**అ**లమేలంటే ఓయని పలుకును
ఆర్తిని వేడిన ఆదరించును
వేడుకున్నచో వెన్నైపోవును
వినతులు నుతులకు వింతలు చూపును

**ఆ**లన పాలన అలమేల్మంగే
అంతా భక్తిని ఆమెకు వదలుము
ప్రేమ సుధానిధి పేరే తనది
అమ్మ ప్రేమతో ఆశలు తీర్చును

**మ**ంగమ్మ మాయమ్మ
మహా మనోహరి మాయమ్మ

శాంతికి నీరధి మాయమ్మ
భ్రాంతికి వారధి మాయమ్మ

**మ**దిలో మెదలే సుందర నందన హాసం
ఊహల విరిసే ఇంద్ర చాపముల వర్ణవిలాసం
అమ్మని తలచిన రమ్మని పిలచిన
కమ్మని రూపం కలనైన -

**త**లపుల సరసున సరసీరుహముల లావణ్య ఖేల
అణువణువున మన తలపుల దేలే చిదానంద హేల
పదములె గతియని పదములు పాడగ
పావని దయకై పాత్రుల మౌదుముగా -

**అ**పార ప్రేమకు అమ్మ ప్రవాహం
కృపాలవాలం అమ్మ మానసం
అనంత మహిమలు అమ్మకు స్వంతం
అనాథ భక్తుల బాధల కంతం -



**అ**లమేలుమంగమ్మ అభివందనం
అపురూప సౌందర్య సమ్మోహనాంగీ

**రా**జీవనేత్రి రసరమ్య గాత్రి
రాకేందు వదన రమణీ లలామ
అనురాగ వల్లీ ఆనంద సమ్మోహినీ
అసమాన పరిపూర్ణ గుణదాయినీ

**సౌ**జన్యమూర్తీ సౌహార్ద్ర కీర్తీ
కరుణా స్వరూపిణి శుభదాయిని
సాహిత్య సంగీత సంధాయిని
రాగాల గారాల రసరాగిణి

**అ**ందాలరాశి అనురాగ కలశి
అకళంక రూపిణి అమరేశ్వరి
అఖిలాండ నాయకి వరదాయిని
అపురూప తేజస్విని - అలమేలు
ఆనంద సంధాయిని

**అ**మ్మా అలమేలుమంగా
ప్రస్తుతింతు ఆనందంగా
నీవే అనురాగవల్లి
నిర్మలమౌ ఓ నవమల్లీ

**నీ** పాటలు గానం చేస్తాం
నీ భజనలు నిత్యం చేస్తాం
లయతోనే నాట్యం చేస్తాం
నీ దయకై ఎదురే చూస్తాం

**ని**ను నిరతం భావిస్తుంటాం
అనవరతం పూజిస్తుంటాం
నీ నామం స్మరియిస్తుంటాం
నిను ప్రార్థిస్తూనే ఉంటాం

**నీ** పైనే నమ్మకముంచాం
నీ రక్షణ కోరుచు ఉంటాం
ఔనంటే మా కానందం
కాదంటే కఠోర నరకం

**నీ** నవ్వులు వెన్నెల జల్లు
ఆశీస్సుల చల్లదనాలు
అమ్మా అందీయవమ్మా
అది చాలిక సత్యం సుమ్మా



**గు**ండె గుడిని జేగంట మ్రోగింది
గుట్టుగా అలరుమేలు మంగకి మ్రోగింది
నీ వక్కడ కొలువని నిను సేవిస్తానని
ఆనందం ఆహ్లాదం ఆకాశం తట్టునట్లు

**గ**ణ గణ గణ గణ గణ మని
శుభనాదం సుడిగాలిగ రేగింది
వేగంగా వ్యాపిస్తూ వేదంలా ఘోషిస్తూ
నాలో నిండిన నీకై మ్రోగింది మ్రోగింది

**స**ంగీత సారమై సామవేద శ్రావ్యమై
కుండలిని మేల్కొలిపే కుదురైన యోగమై
జగం మరచి అహం విడచి సమ్మోహనాస్త్రమై
జయమంగళ గీతికయై జనయిత్రీ మ్రోగింది

**స**రిగమలే నీ దేవళ సోపానాలై
లయగతులతో సాగిపోవు నాద వినోదం
గంటారవమ్ములలో ఓంకారం మిళితమై

**తు**లసీ దళముల పూజింతు
తుంబురు వీణై ఆలపింతు
శ్రీసతి నిన్నే ప్రార్థింతు
తీరుగ నమ్మిక నేనుంతు

**అం**దాల విందుగ ఎదనుంతు
అనుదినమున నిను వినుతింతు
సర్వము నీవుగ భావింతు సంకీర్తనతో సేవింతు

**ప**దపీఠముపై తలనుంతు
పావని దయకై తపియింతు
నీ సన్నిధియే నా కందు నీ కెడబాటే వలదందు

**నీ**వే దిక్కై నన్నుంచు
నా రోజుల నటు గడిపించు
కడదాకా నను కరుణించు
మరుజన్మన్నది మరపించు



**నీ** భావనం నా జీవనం
నీ పరమే ఇక నా మానసం
ఇలలో సకలం అలమేల్ నీవే
నాలో నిండిన నారాయణి

**క**నులు మూసినా కన్నుల నీవే
కలలోనైనా నీ చరణాలే
మరి మరి చూడగ నే కోరెదమ్మ
మమతా మోహము మరపించవమ్మ

**శ**రణాగతినే నను కోరనీ
మరి మరి దీవెన నను వేడనీ
శరదిందు వదనా శాంతి ప్రసాదించి
చిరునవ్వుతో బ్రతుకు నడిపించవమ్మా

**మా**నస సీమల మసలే దైవం
మధురానుభూతులు నీ ప్రసాదం
ఆశామోహము అసలిక వలదు
అంతా నీ దయ అను ఆశ వదలదు

**అ**మ్మా! చరణములే నాకు శరణం
అలమేల్ చరణములే నాకు శరణం
పద పంకజములె నా పరమపదం
నిరతం నీకే ఆరాధనం

**ఆ**లన నీవే పాలన నీవే
భువిలో నీవే దివిలో నీవే
అంతట నీవే అన్నీ నీవే అమరం నీ దర్శనం

**స**త్యము నీవే శివము నీవే
సుందరమును నీవె -
శబ్దం నీవే శాశ్వత మీవె - నీకే సంకీర్తనం

**నీ** సన్నిధిలో నిజ భోగాలు
నీ చూపులలో నిజ భాగ్యాలు
నీవే నా జీవనం - నీవే నా భావనం



**అ**ందానికి అందం నీవే
ఆనంద మరందం నీవే
అమ్మా అలమేల్మంగ
అపురూప రూపమనంగ

**నీ** వదనం నిండు ప్రశాంతం
నీ హృదయం ప్రేమ తరంగం
నీ కన్నుల జాలి ప్రవాహం
నీ అధరం నిండగు ప్రణవం

**నీ** లోగిలి భక్తికి మూలం
నీ సముఖం నిత్య ప్రశాంతం
నీ నామం హృదయ వికాసం
నీ కరమున ఆశీర్వాదం

**నీ** చూపులు నిండు శుభాలు
నీ ఘనతే నిండు నభాలు
నీ సర్వంలో దివ్యత్వం
నీ భక్తుల ముక్తికి మూలం

**మ**హిమ గల ఆలమేలు ఓ కల్పవల్లీ
మనసార దీవించు సిరుల సిరిమల్లీ

**నీ**వున్న తావులే నిత్య బృందావనం
నీ సముఖమే కదా ఆనందనిలయం
నీవు పలికిన మాకు నిగమాలసారం
నీ సర్వమున మాకు నిత్య వైభోగం

**నీ** దీవెనలు మాకు నిల్పు సౌభాగ్యం
నీ పాదసీమయే మా స్వర్గధామం
నీ కుంకుమున కందు నా సూర్యబింబం
నీ ప్రాంగణము మాకు శుభగం పవిత్రం

**నీ** కాలి అందియలు నిత్య ప్రకాశం
నీ చేతి కంకణము కాంతి ప్రపూర్ణం
నీ నాసికను మెరయు నీలంపు మణులు
నీ మకుటమున గలవు నవనిధుల సిరులు



**నీ** దయే నా బలం
నీ ప్రేమే నా ధనం

అమ్మా అలమేలుమంగ
నా సర్వం నీ వనంగ

**నీ** కృపా వీక్షణం నింగినందు ఆనందం
నీ ప్రేమ సరస్సులో నిశ్చింత జీవితం

అతులిత సుగుణాంబుధీ
అనుపమ సరసీరుహానన -

**హృ**దయంలో పరితాపం నీ మ్రోలమాయం
శారద హేమంత హేల వదనంలో వ్యక్తం

నీ సముఖం నిరంతరం
సంతత శాంత తరంగం

**స**రసీరుహలోచని
సదానంద వాహిని
అతి పవిత్ర నిర్మలాంగి అమృతాంతరంగిణీ
అణువణువున అంతరాన అప్రమేయ భాసిని

**మా**నస వీణలు మ్రోగేయి
మాధురలేవో మూగేయి
అలమేలు భావనలో అమేయ భాగ్యములు

**మొ**గమున నగవుల నాట్యాలు
నయనాల ఎన్నెన్నో దీపాలు
మకుటపు మిలమిల మెరపులలో
కోటి భాస్కరుల కిరణాలు

**మ**లయోర్మికల సుఖస్పర్శలు
అలమేల్సన్నిధి గాలులలో
వెన్నెలలోని వెల్లువలు
ఆయమ్మ పదముల కమలాలు

**ఉ**దయభాస్కరుని సొగసు
అలమేల్నొసటను కుంకుమలో
ఆమె కంఠమున పూమాలలు
పూచిన పుణ్యాల సుగంధ దళములు!



**అ**లమేలంటే క్షమాగుణం
అలమేలంటే దయాధనం
అలమేలే ప్రేమ మయం
ఆయమ్మేగా అద్వితీయం

**అ**లమేలంటే పరమ పవిత్రం
ఆమె మానసం అమృతమయం
అలమేలు కరుణే నా కామితం
ఆయమ్మ ఇక నా జీవిత సర్వం

**అ**లమేలంటే సుగుణమణి
ఆయమ్మేగా జేజేల రాణి
ఆమె పలికితే మధురవాణి
ఆమెయె శుభాల తరంగిణి

**అ**లమేలంటే మల్లెల నవ్వులు
ఆమెయే కదా తరగని సిరులు
అలమేలంటే ఆశాజ్యోతులు
అమరలోకమున సుఖశాంతులు

**జ**లజ నయన చంద్రవదన అలమేల్మంగ
అమృత హృదయ అమరతేజ అలమేల్మంగ
సత్యం శివ సుందరాలు కలసిన బంగరు బొమ్మ
నిత్యం నా కనుల ఎదుట నింగికి వెలుగుల గుమ్మ

**హ**ంసగమన కిరణపూర్ణ అలమేల్మంగ
తరుణ హంసి రాకాశశి అలమేల్మంగ
తరళ అరుణ కిరణనిధి అలమేల్మంగ
అతి పవిత్ర దివ్యచరణ అలమేల్మంగ

**చూ**పులతో పాపమార్చు అలమేల్మంగ
కన్నులలో కరుణధుని అలమేల్మంగ
కనులు చెదరు చంచలకద అలమేల్మంగ
నగు మొగాన మనల జూచు అలమేల్మంగ

**గు**డిలో అడుగిడినంతనె అలమేల్మంగ
మది నలజడి తొలగించే అలమేల్మంగ
ధరపై గల శశిబింబం అలమేల్మంగ
భువన మోహినియె కదా అలమేల్మంగ



**నీ** చరణం నాకు ప్రియం
నీ ఉనికే నా యోగం

**సి**రుల సరుల అలమేలు మంగ
సింగారంతో వెలసిన దేవతనంగ

**నీ** పూజలు దివ్యవరం నీ భజనలు పరం
నీ భావన నా జీవన విరివనికే వాసంతం
సందర్శన సద్భాగ్యం - జన్మలలో సుకృతం

**నీ** భక్తే నా భుక్తి నీ తలపులే నా శక్తి
నీవేగా నా ప్రాణం నీవె కదా నా ధనం
నీవేగా నా ధ్యానం - నా కవనం నా గీతం

**నీ** ఉనికే ధరకు రక్ష నీ అభయం నా దీక్ష
నీ కరుణకు నీ ప్రేమకు నేను సదా దాసోహం
నీ సముఖం నాకు హితం - నీ గానం నా మతం

**నీ** రూపురేఖా విలాసం
నిండునుగా నా చేతనం
నీవేగా నా మానస దేవళ దైవం
నీ గీతం సంగీతం నా జీవన రసమంత్రం

**శ**రణం భగవతి మంగమ్మ
శరణం జనయిత్రి మాయమ్మ
శరణం శరణం అలమేల్మంగ
శరణం నీవే జీవనగంగ

**అ**ణురేణువులను నీ చైతన్యం
అడుగడుగునను పరమ శ్రీకరం
జగదోద్ధారణ శుభసంకల్పం
జగన్మోహిని సుధావాహిని

**నా** మదిలో నీ దివ్య స్వరూపం
నరునిగ నాకిది మహాసుకృతం
నింగిని నేలను దిక్కుల నీవె
నిరుపమ సంతససారం నీవె

**సు**రనుత సుందర శుభాంగి నీవె
శాంతాకారుని మదిలో నీవె
కమలామనోహరి కల్యాణి నీవె
కన్నుల పున్నమి జాబిలి నీవె



**మా**యమ్మ మంగమ్మ మాణిక్యవీణ
మనసులో నాదాల మోదాల వీణ

**చ**ందమామను మించు అందాల వదనం
కలువ దళముల బోలు కను దోయి చందం
వైకుంఠ విలువలకు ఆ చూపు నిలయం
ఆయమ్మ ఆలయం అందరికి స్వాగతం

**పా**లసంద్రపు తనయ పలుకు తేనెల తల్లి
గారాల సిరి మల్లి గగనాన జాబిల్లి
సిరులెన్నొ కురిపించు శ్రీదేవి నా తల్లి
దర్శించితే చాలు పుణ్యాల హరివిల్లు

**ను**దుట కుంకుమబొట్టులో ఉదయకిరణం
ఎదుట నిలచిన చాలు ఎనలేని హాసం
పరిసరములన్నియును పావనం పావనం
విరిసరుల దేవేరి పరదేవతే నిజం

**ది**క్కంటే దీవిస్తుంది - మంగమ్మ
మొక్కితే మోక్షమిస్తుంది
భక్తులకు కల్పతరువు
భావనలో ధేనువు
నవ్వులో సిరిమల్లి గౌరీమణి నా తల్లి

**నా**మాన్ని జపియిస్తే నరకం తప్పిస్తుంది
నమస్సులు నీకంటే నాకం కలిగిస్తుంది
సన్నిధినే నిలబడితే సౌఖ్యాల పరంపర
నమ్మికతో ప్రార్థిస్తే నా పాలిట శుభంకరి

**క**ళ్ళలోకి చూస్తుంటే కనికరపు ప్రవాహం
అడిగినదే తడవుగా అందించు అభయం
నగుమొగాన ఒలకబోయి నవ్యమైన అనుభవాలు
నిగనిగమను నగలలో నిత్యశోభలు

**చ**రణాలు చూస్తుంటే చరితార్థం సంభవం
చేతుల్లో అభయానికి చెప్పలేను సంతోషం
మనసులో మనకోసం మాయనిదా తపనం
గుడిలో తా వెలయుటే గుట్టుగ మనకోసం



**వే**లవేల మెరపులతో వెలిగే బొమ్మ
వేలవేల భక్తులందరికి దేవివి నీవమ్మా

అమ్మా మంగమ్మా
ఆనందం విందమ్మా

**ఇ**ందుగలవు అందులేదను సందేహమెందుకమ్మ
ఎందెందు చూసినగాని అందందె ఉందువమ్మ
ఓయమ్మ మంగమ్మ ఒయ్యారి ముద్దుగుమ్మ

**క**ళ్ళు మూసుకొని నిదురిస్తే కలలోకొస్తావు
కలత నిద్దురై కళ్ళు విప్పితే కన్నుల నీవమ్మా
అలమేలు మంగమ్మా అందాలు నీవమ్మా

**నీ** ముంగిటనే నిల్చుంటే నిజమైన తన్మయం
నీ మీదే చూపు నిల్పితే నింగినున్న అదృష్టం
అందాల అలమేలు మంగమ్మ మాయమ్మ

**ని**న్ను తలిస్తే నా కన్నులలో నీళ్ళు కారేను
ఒళ్ళే తెలియని ఏదో మైకం నాలో నిండేను
ప్రేమమూర్తివి నీవమ్మా
నీ దయకంతం లేదమ్మా

**సౌ**ందర్యలహరివి సౌభాగ్య సిరివి
మాయమ్మ మంగమ్మా - మదిలోని వెన్నెలవమ్మా

**నీ** నామమె కద ప్రణవ నినాదం
నీ తలపులే కద నిత్య ప్రశాంతం
మాయమ్మ మందారమాల
ఓయమ్మ సుగుణాలవాల

**నీ** చూపులో చాల హేమంత హేల
నీ రూపులో ఉంది నిల్చున్న జలజ
మాయమ్మ మందారమాల
మాయమ్మ సుగుణాల బాల

**నీ** లోగిలే కద సురభోగ సీమ
పుణ్యాల గిరినీవె రమణీ లలామ
మంగమ్మ కరుణాలవాల
మాయమ్మ మరుమల్లె మాల



**న**వ్వులు నవ్వులు నవ్వులు
శ్రీసతి అలమేలు నవ్వులు

వసంత వాకిట రాగాలు
వాడని కుసుమ సరాగాలు

**ఇ**ంద్రలోకమున ఇంపగు తీరులు
చంద్రలోకమున చలువల తెరలు
అందని ఆనందాలకు రూపం
ఆకాశంలో ఇంద్రచాపం

**సు**రలోకానికి సోపానాలు
సురుచిర తారల సుఖలోకాలు
ప్రేమ సరసులో పెరిగే కలువలు
కుబేర నవనిధి కుందన విలువలు

**అ**మృతవాహినిని అలల మెరపులు
ఆనందానికి అంతస్తులవే
దయాధనంలో దాగిన సిరులు
మనసున శాంతికి పూచిన విరులు

**వి**డువను విడువన నీ పదకమలం
వేంకటపతి సతి నేనే సమయం

**మ**రువను మదిలో నామస్మరణం
మరువను నీలో ప్రేమమరందం
మరువను నీలో నాపై జాలి
మరువను తలపున పదములవాలి

**మ**రువను నీ దయ మహాప్రసాదం
మరువను నా కది మహదానందం
మరువను నీవే దైవస్వరూపం
మరువను నే నీ సుందర వదనం

**మ**రువను మరువను నీ మందహాసం
మరువను నేనీ అభయం భాగ్యం
ఆగదు నాలో నీకై తపనం
అమ్మా విడువకు నా జీవితాంతం



**ఇ**ది నా హృదయం ఇది దేవళం
శ్రీపతికి శ్రీసతి పదముల నిలయం

**ధ**రపై వెలసిన దైవాలు
నాకై వచ్చిన నరరూపాలు
ఇది వారికి ఇక నిత్యనివాసం
ఇది వారికి ఇక అంకితం

**నా**లో నవ్వెను నవభక్తి భావం
నాలో నిండెను వారికి గీతం
లోలో చీకటి తొలగిన వైనం
లోలో వెలిగెను ఆశాకిరణం

**ఊ**హాతీతం ఆ శుభయోగం
ఉర్వికి దిగిన గంగా ప్రవాహం
ఆనందానికి ఆవలి తీరం
ఆహా సర్వం వైకుంఠ ద్వారం

**దం**డాలు దండాలు
దండాలు దండాలు
దేవదేవునికి దండాలు
దివిజ నాథునికి దండాలు

**వేం**కటగిరిపై వెలసిన హరికి వేలవేల దండాలు
సప్తగిరీశుడు సర్వేశ్వరునికి సన్నుతి చేసే దండాలు

**క**లియుగ జనులను కావగ వెలసిన కేశవస్వామికి దండాలు
హృదయం నిండుగ కరుణే ఉండిన హృషీకేశునికి దండాలు

**న**మ్మిన వారికి నారాయణుడౌ నాదేవునికే దండాలు
కరుణకు నెలవై కరగే స్వామికి కటాక్షింపుమని దండాలు

**త**లచినంతటనె తలలో మెదిలే దనుజవైరికే దండాలు
పిలిచినంతటనె ప్రీతిగ చూసే పీతాంబరునికి దండాలు

**క**ఠినత చూపక పాపులెల్లరిని కాచే స్వామికి దండాలు
సదమల హృదయుడు క్షమాచిత్తుడు శాంతిప్రదాతకు దండాలు



**నీ**వెవరో నేనెవరొ తెలుసుకో జీవా
నీ నా విభేదాలు తెల్సుకో జీవా

**మూ**డురోజుల బ్రతుకు ముచ్చటగ తీరదు
ముళ్ళదారే కదా జీవా -
కష్టాలు నష్టాలు కాకులై పొడిచేను
కాదందువా నీవు జీవా -

**అ**మ్మైనా నాన్నైనా ఆత్మీయులందరును
ఒడ్డుదాకే కదా జీవా
ఒడ్డు వదలి నీవు ఓడలో పడ్డాక
ఓడెచటికేగునో ఎరుగవో జీవా

**త**నువు శాశ్వతమని మనువు కలకాలమని
మమత పాలౌతావు జీవా
కాదేది నీదైన నీదనే భ్రమిసేవు
కమలేశుడే అంత జీవా

**అ**వనిలో స్థిరమేది కాదు అని నీవెరిగి
వేంకటేశుని నమ్ము జీవా
కలియుగపునాథుడు కంజాక్షునే తలచి
కాపాడుమని వేడు జీవా
అతడొక్కడే దిక్కు - జీవా

**మ**ల్లేలో మల్లేలు - మల్లేలో మల్లేలు
వేంకటగిరిపై వెలసేడండీ మల్లేలో మల్లేలు
వేంకటేశుడై శ్రీపతి మనకై మల్లేలో మల్లేలు

**ప**దములె గతియని సాగిలబడదాం మల్లేలో మల్లేలు
పాపాలన్నీ పటాపంచలగు మల్లేలో మల్లేలు

**తి**రుమల చేరి శ్రీగిరినాథుని మల్లేలో మల్లేలు
దయ చూపుమని దర్శిద్దాం మల్లేలో మల్లేలు

**కొ**మ్మకొమ్మను పూవులు కోసి మల్లేలో మల్లేలు
మాలలు అల్లి దేవునికిద్దాం మల్లేలో మల్లేలు

**దే**వుడు మెచ్చి కోరిక తీర్చును మల్లేలో మల్లేలు
దేనికి మనకిక చింతలు వంతలు మల్లేలో మల్లేలు

**అ**భయమునిచ్చి హాయిని కూర్చను మల్లేలో మల్లేలు
అన్నియు నీవని ఆశ్రయిద్దాం మల్లేలో మల్లేలు

**ఆ**లవైకుంఠపు ఆదిదేవుడు మల్లేలో మల్లేలు
అందరి రక్షణ ఆతని ధర్మం మల్లేలో మల్లేలు



**ఎ**న్నాళ్ళు గూటిలో చిలకుండునో
ఏ రీతి ఆ చిలుక బ్రతికుండునో

**గూ**టిలోని చిలక మాయమేనాడో
గూడువదలి చిలక ఎగురుటేనాడో
ఆనాడు గూడంత చిన్నబోవునుగా
గూడు కళకళ లాడి గుడ్డిదయ్యేను

**ఎ**గిరిపోయిన చిలక ఏ వనము కేగునో
ఎంతకాలము ఎగిరి ఏ కొమ్మకొనో
పాతగూడే కూలి కొత్త దొచ్చేనా
పాతగూటిని మరచుటే దైవలీల

**ఎ**గిరిపోవుట నిజము చిలుక ఏదైన
వేంకటేశుని లీల ఏదైన కూడ
రాకపోకలు తెలియు నాతనొక్కనికే
ఆ దేవునే నమ్మి బ్రతుకుటే మేలు

**సృ**ష్టిలో ఏదైన చిత్రమే చిలుకా
సర్వకాలాలలో ఓ రామచిలుకా

**ఉ**దయాద్రి శిఖరాన ఉదయించు రవిలో
దేవదేవుని లీల చూడాలి చిలుకా
గగనాన వినిపించు కలఘోషలో వినుము
శేషశయనుని పలుకు చిలుకా -

**మ**లయ మారుతమందు మాయలా హాయంత
శ్రీశు నిశ్వాసమది చిలుకా
విరులన్ని వింతగా విరిసి తలలూపితే
శ్రీశు నవ్వది రామచిలుకా

**మె**ల మెల్ల వాగులే ప్రవహించి సాగితే
శ్రీశు నడకది నమ్మి చిలుకా
నీటిపై అలలన్ని నీ వైపు కదిలితే
శ్రీశు కరుణది రామచిలుకా



**నీ**వేది చేసినా మాకోసం మాకోసం
నీవేది పలికినా అది సత్యం అది నిత్యం
ఓ వేంకటనాయకా ఓ శ్రీహరిరూపా

**రా**మునిగా నీవర్తన ఆ ధర్మం చేశావు
కృష్ణునిగా సంభవించి ధర్మం స్థాపించేవు
బుద్ధునిగా విశ్వశాంతికై నీవు వచ్చావు
అన్నీ మాకోసమే అవతార స్వరూపం

**వేం**కటాద్రి పై నీవు వెలసినావు
కలియుగాన మా కోసం కదలి వచ్చావు
పాపాలు హరియించి కడగండ్లు తొలగించి
మము కావగ వచ్చావు
నీ పదములె చూపేవు

**నీ** లీలలు మా కన్నులు తెరిపించుటకే
నీ మహిమలు నీ శక్తిని ఎరిగించుటకే
సద్వర్తన కలిగించే సన్నుతాంగా
మా భక్తిని పెంచే మా మాధవా

**స**ంసారం సాగరయానం
సర్వేశా శ్రీనివాసా
సంరక్షణ నీ స్వాధీనం
సకలం లీలా వినోదం

**పో**నీ నా నావని ఒడుదుడుకులు ఆగనీ
అలాగే సదా సాగనీ నా యాతనమాయం కానీ
ఆ తీరున అలలు సాగనీ
కలగా అది కరగిపోనీ

**క**ష్టాలే కెరటాలై ఎగిరి ఎగిరి బెదిరిస్తే
కన్నీరు మున్నీరుగ నాకేడుపు రానీకు
ఆదుకో అఖిలేశ్వరా - ఓ దేవా
చేదుకో చిద్విలాసా

**గ**ండాల తిమింగలం మింగాలని చూస్తుంటే
గడ ఎత్తి కొట్టలేను గంతేయక ఉండలేను
గరుడతురంగా నీదే భారం
గరుడాద్రి వాసా నీవే సకలం

**అ**నారోగ్య గాలివాన ఆగకనే భాదిస్తే
పేదరికం రాలిపడిన పిడుగుల్లా పీడిస్తే
దిక్కు నీవె దివ్యప్రభావా
మొక్కు తాను మోక్షప్రదాతా



**జీ**వితాలు ప్రయాణం
కామితాలు విడ్డూరం
జీవితానికర్థమేమి శ్రీనివాసా
కామితాల కంత మెపుడు కలియుగేశా

**ప్ర**తి జన్మకు జీవితం ప్రసాదించు దాతా
జన్మల కెపుడంతం జగద్విధాతా
జన్మలోని కర్మకెపుడు కలుగును అంతం
కర్మననుసరించి కదా మరుజన్మ సంభవం

**ఆ**ది అంతముల మధ్యను అంతా నీ నాటకం
ఎవరి పాత్ర ఏమిటో ఎన్నాళ్ళను కోవటం
ఆలోచన సాగదే అంతర్యామి
పదే పదే వేధించును సర్వాంతర్యామి

**జ**న్మకర్మ వలయంలో చిక్కినదెపుడు
మొట్టమొదటి జన్మకు కర్మ ఎక్కడ
కర్మలేక నన్నెందుకు పుట్టించావు
తెలుపలేవ తెల్లముగా తిరుమలేశ

**ఎ**న్ని జన్మలెత్తినా పూజలెన్ని చేసినా
ఏనాటికి నీ అనురక్తి ఎప్పటికో బంధవిముక్తి
ఓ కొండలరాయా
శ్రీ వేంకటేశా

**జ**ననంతో రోదన జననం ఆవేదన
జీవితాన అడుగడుగున అంతులేని యాతన
కోపాలు తాపాలు పాపాలు శాపాలు
ఎన్నటికో పరిసమాప్తి
ఎప్పటికో బంధవిముక్తి

**రో**గాలు తనువునే తినివేస్తుంటే
రోషాలు పగలతో నలుగుతు ఉంటే
అహం చావదా ఇక ఇహం మారదా
లోలోన చీకటిలోనే ఉండాలా
నీ వెలుగుల నింగినే చూడలేమా

**మృ**తి యంటే భయం భయం
మృతి ముంగిట జర భయం
మృతి కావల తమోమయం
ఆ యోచన అయోమయం
ఏ నాటికో నీ లాలన
కృపతో ఇక నీ పాలన



**శ్రీ**నివాస శ్రీనివాస అనరండీ - ఆ
నామస్మరణం నరుల ముక్తికి త్రోవండి

**వే**ంకటేశుడు గరుడ గమనుడు
వెలసిందే కద మనకోసం
పదములు గతియని నమ్మండి
నామస్మరణం చేయండి - చేసి తరించండి

**ది**క్కిక మాకు నీవంటూ దివిజ పాలకుని వేడండి
మొక్కెదమంటూ మోక్షమిమ్మని ఆ మురారినే వేడండి
సాధన ఒకటే వేదనకంతం - తెలియండి
సర్వేశ్వరుడే సంకట హరణుడు - నమ్మండి

**కొ**ండల దేవుని నిత్యం శ్రద్ధగ కొలువండి
కోటి శుభాలిక కొలువౌట నిజం
కోమల హృదయుని వేడిన చాలండి
కోర్కెలు దీర్చె కొండంత దైవం కోరి తరించండి

**అ**ందరి లోపల అంతర్యామి
అణువణువున గల అనంత స్వామి
నీవే శరణం నీకే శరణం
నిఖిలేశ్వరా సర్వేశ్వరా

**లో**కపు చీకటి కావల వెలిగే
లోపలి చీకటి లోపల మెరిసే
లోకేశా లోకాలేలే శ్రీశా
ఓ శ్రీనివాసా నారాయాణాద్రీశా

**ప్ర**ణవ నాదమున శబ్దం నీవే
ప్రకృతిలో గల ప్రేమ స్వరూపా
సకల చరాచర సృజన కారకా
సర్వము నీవే సర్వాధినేతా

**మ**ంత్రము నీవే మహిమయు నీవే
మా జీవితాలను మార్గము నీవే
కాల చక్రమున భ్రమణం నీవే
కారణములకు కారణమీవే



**ని**రుపమ సుగుణాల వాల
నీ గిరిని చేరితి నినుజూడ వచ్చితి
శ్రీరమణా నారాయణాద్రీశా

**నీ**వే స్థిరమని నీవు సర్వమని
మానసమందున భావము బలమై
మరిమరి వేడెద మహిమల రేడా
సిరిదొర భవహర శ్రీగిరీశా

**నీ** పదధూళే హరిచందనము
నీ చూపులలో నీలినీడలు -
నీవే కాదా నిగమాల సారం
నిండు మనసుతో నను నడిపించు

**భ**క్తికి ముక్తికి భావం నీవే
బ్రతుకులు నడిపే భారం నీదే
నీలో శక్తికి నీ బానిసను
నీ దయకోసం నీ యాచకుడను

**ఆ**రని దోయి అంతర్వేదన
తీయని దోయి నీ మృదు భావన
ప్రేమమయా ఓ శ్రీగిరి నిలయా
పరమాత్మా ఓ శ్రీనివాసా -

**నీ**వే నీవే నిఖిల దైవము
నీ వాకిటిలో నిజమగు హాయి
నీ ఊహలలో తలపులకందని
ఉల్లాసమదే ఊయలలూగు

**న**ను బ్రోచుటకు నాకెవరు లేరు
వినుమా నాగోడు విసుగు చెందకు
నిన్నే నమ్మిన నీ భక్తుడను
అన్నియు నీవని ఆశలు పెంచితి

**నా**దస్వరూపా నారాయణా
ఏదో సొదయని విడనాడకుమా
వేదన బాపే వేద వేద్యుడవు
మోదము కూర్చే మోహనరూపా



**ఏ**ది జరిగినా నీ దయరా
ఏమందువో ఓ వేంకటేశా
ఏది కలిగినా నీ కృపరా
ఏమైనా సరే నీ లీల రా

**కం**జదళాక్షా కరుణాకరా
విశాల హృదయ విశ్వకారా
కదల దేదియును కమలేశా
నీకు తెలియకనె నిఖిలేశా

**గా**లి వీచితే నీ దయ కాదా
గంగ పారితే నీ దయ కాదా
పూలు విరిసినను పున్నమి నవ్విన
ప్రేమమయా అది నీ దయ కాదా

**ప**గలురేయి సూర్యగమనము
పరిభ్రమించే నవగ్రహాలు
దినములు నెలలు యుగాలు సైతం
జనన మరణములు నీ దయే సకలం

**ఈ** దీనుని ఆవేదన ఇదే వేంకటరమణా
ఈ జీవునిలో వేదన ఇదే భవహరణా
ఔనంటావో కాదంటావో
అంతా ఇక నీ ఇష్టం ఏమంటావో

**ఏ** పూజలు చేశానో ఏ వ్రతాలు జరిపేనో
ఈ జన్మకు నిన్నెరిగితి శరణన్నాను
బంధాలకు దూరమై బ్రతు కంతా రోసితి
సుస్థిరంగ నీ దరినే నిలుపుకో శ్రీశ

**క**ష్టాలకు లేదంతం - సౌఖ్యాలకు లేదుమితం
కోరికలకు కడలేదు ఆశలకే తుదిలేదు
భవబంధ విమోచనం కలిగించవా
పరమాత్మా పరంధామ ప్రసన్నంకావా

**నీ** పదములె గుండె నింపి పాలించవా
నీ నామం నా నోటను నిత్యం వినిపించాలి
నీ పూజలు చేసి చేసి తరియించాలి
నీ భావన కడ దాకా నన్నేలాలి



**ని**రతం నా తలపులలో నీ సుందరరూపం
నిరతం నా లోన సాగు నీ గీతా గానం
దేవ దేవ దివ్య ప్రభావా
దిగి వచ్చిన సిరివల్లభా

**ని**దురనైన మెలకువైన నీకే నా మానసం
నీ కోసం తపనం నీకే శరణం
నా ఊపిరి నీవై నిండినావు
ఉచ్ఛ్వాసం నిశ్వాసం నీకోసం సాగాలి

**నా**లోన నీ కరుణే జీవనాడి కావాలి
నా బ్రతుకున నీ మహిమలు నిత్యం కావాలి
శుభప్రదం బ్రతుకు కావాలి
అభయంలో సాగిపోవాలి

**మ**ణిమకుటం కాంతులే మదిలో మురిపింపు
మహాప్రభో నీ నామం కన్నులలో ఇంపు
నా హృదయం స్పందిస్తూ నారాయణ అనాలి
నీ కరాల మృదుస్పర్శను అనుభూతిగ పొందాలి

**నా**కేల నాకేల
లోకంతో పని నాకేల
శోకం నాలో ఇంకేల

**లో**కం ఆశల భవనం
లోకం మోసాల నిలయం
నిత్యం నిరాశ ఖేదం
నిండిన ఓ చదరంగం
అందుకే అది నాకేల
గిరిపై దేవుడు రక్షిస్తుంటే

**క**లియుగ దైవం కమలేశుడు
కన్నుల ఎదుటనె ఉన్నాడు
కలలోనైన కలుగదు దుఃఖం
కాదా బ్రతుకిక వైకుంఠం
జీవనయానం చలన చకోరం
జీవితమంతా అతడే దైవం



**ఎ**ంత పాపులం జనమంతా
ఎంత నీచమో ఎదలో నంత

దురాలోచనలు దుర్మార్గం
పరాలోచనలు పాపకరం

**అ**యినా మొక్కులు గైకొంటావు
ఆహా వినతులు వింటావు
అడిగినవన్నీ ఇస్తావు
ఆనందం కలిగిస్తావు

**పా**పం చూడవు లోపం ఎంచవు
కోపం చూపవు ఏదీ తలంచవు
కొండకు చేరి ప్రార్థిస్తే చాలు
కొంగున ధనమై కరుణిస్తావు

ఏమని పొగడాలి
ఏమని కొనియాడాలి

**ఆ**త్మస్తుతి చేస్తాము
అధికులమనుకుంటాము
పరనింద పరమావధిగా చేసే వారలం
మా లోపం గమనించం -
అయినా మా చేతులెత్తి మొక్కితే చాలు
నీవేవీ చూడవు మాకు మంచి చేస్తావు

**అ**తడే ఇతడు అంతరాత్ముడు
అఖిల జీవులకు పరిపాలకుడు
వేంకట గిరిపై వెలసిన దేవుడు
వేయేండ్లకును సంరక్షకుడు

**ఆ**దిదేవుడు అనంతుడితడు
అణువణువునను అమరిన దేవుడు
అల వైకుంఠము ఇలలో వెలయగ
అందరి పూజలు నందే దేవుడు

**అ**సురుల జంపి సురలను కాచిన
నారాయణుడు నరహరి మురహరి
వెన్నమన్ను తిన్న వెన్నుడు
అన్నుల మిన్నుల మానస చోరుడు

**కా**రణములకే కారణమతడు
సద్గుణ నిర్గుణ సర్వేశ్వరుడు
కలియుగ జనులకు కాచే వరదుడు
అలమేల్మతికే వల్లభుడు



**నీ**వే కదా నా ఆరాధ్యమూర్తి
నీవే కదా నా కవితా స్ఫూర్తి
వేంకట రమణా - సంకట హరణా
నీవే కదా - నీవే కదా

**మ**దిలోన నీ ఆలోచన మధురంగా మెదలగ
ఇహమంతా మాయమై ఇంపైన వేళలో
తెలియనెదొ కొత్త స్థితిని తేలించి పాలించి
వింత వింత భావాల లహరిలో నను ముంచే

**ప**రమయోగ సమాధిలా పరిసరాలు మరపించి
నను కొత్త అనుభూతికి గురిచేసి పెంచి
కాలగమనమే మరచే కల్యాణ గడియలో
నీ మూర్తి నీ కీర్తి నీ సన్నిధినే చూపే -

**నీ**వె సకల భువనాలను నిండినట్లు-
నీవె ప్రతి అణువులో ఒదిగినట్లు
నను శూన్యముగ చేసి నాలో నీ వుండి
మనసంతటా నిండి పాలించు స్వామి

**జ**పమాల నాకెందుకు
జపములు తపములు నాకెందుకు

నా శ్రీనివాసుని కరుణున్న చాలు
అలమేలు శ్రీదేవి దయ ఉన్న చాలు

**నా** వేంకటేశుని చల్లని చూపులు
మంగమ్మ వీక్షణలో చలువలు -

అవి చాలు పాపాలు పతనం
అవి చాలు లోప వినాశనం

**అ**లమేలుమంగమ్మ అభయం
ఆ వేంకటేశుని దీవెన భాగ్యం

అది చాలు కోరేది వేరేది లేదు
అది చాలు భయమేది లేదు

**శ్రీ**వారి సన్నిధిలో నున్న చాలు
శ్రీదేవి మొగసాల నిలచిన చాలు

అది నాకు అలవైకుంఠం
అది చాలు ఆనంద బృందావనం



**ఎ**డద పల్లకిని గోవిందునితో
ఎల్లరు ముందుకు సాగండి

ఒడుదుడకులలో ఓడిపోకనే
''ఒహోం ఒహోం'' అని నడవండి -
ఒహోం ఒహోం ఓం ఒహోం ఒహోం
ఒహోం ఒహోం ఓం ఒహోం ఒహోం

**గ**తుకు దారుల బ్రతుకు సాగితే
గంతులు వేయక నడవండి
నునుపు తీరుగా మార్గం ఉంటే
నడువుడు అడుగులు తడబడక -

**బ**ండలు నిండిన దారుల ఉండిన
బలముగ అడుగులు వేయండి
కొండ మార్గమున పోవాలంటే
కొలదిగ ప్రయాస కోర్వండి -

**వా**గులు వంకలు దాటాలంటే
వరదను బురదను చూడండి
ఎదురుగాలిలో ఏగాలంటే
ఏకదీక్షతో సాగండి -

దేవుడు నీవు జీవుడు నేను
ఈ బంధం వేంకటేశ ఎన్నాళ్ళని
నీకు నాకు సంబంధం ఎన్నేళ్ళది

నా జన్మకు కారణుడవు నీవు కాదా
జన్మనిచ్చి కర్మలకే గురి చేసేవు
కర్మ ముగిసేదెపుడు
జన్మలాగే దెపుడు -

ఎన్ని యుగాలేగేయో ఎన్ని జన్మలెత్తేనో
నీతో నా బంధ మెపుడు ప్రారంభం
ఆ - అనుబంధానికి నీలోనే ఉన్నది మూలం

నందకమే అన్నమయ్యగా జన్మిస్తే - దాని
ధూళిలోన రేణువుగా నన్నుంచావా - అతని
పూజలలో పూవుగా పుట్టించావా -
పురుషోత్తమ ఈ పాటలు నాచే వ్రాయించేవా

జన్మ కర్మ కారణం నీ మాయ కాదా
కడదాకా నా రక్షణ నీది కాదా
జన్మలాపి మోక్ష మీయవా
ఈ జన్మే తుది కానీవా



కొనియాడెదనే వేంకటరమణా
కోమల హృదయా దయామయా

నీ నామమె కద నిక్కపు మంత్రం
నీ సన్నిధి కద నిత్య పవిత్రం
వేంకటాద్రిపై వెలసిన దైవం
ఇందరి జనులకు నీవాధారం

భక్తుల మొర విని పరిపాలించే
భగవంతుడవు భారము నీదే
అన్నిట నీవని అంతయు నీవని
ఆలోచనలో భక్తి పొంగగా

నీ చరణములు నిగమ సమానం
నీ కరములె కద కుసుమ కోమలం
నీ కనుచూపుల చల్లని నీడలు
ఆత్మశాంతికి అలరు ఛత్రములు

**ని**న్నే భజింతును నిన్నే స్మరింతును
నీన్నే పూజింతును వేంకటేశా
నీకే నా జీవితం శ్రీనివాసా

**నీ**కే నా జోతలు - నీకే నా వినతులు
నీకేగా ప్రణతులు వేంకటేశా
నీవే నా సర్వం శ్రీనివాసా

**ని**ను గూర్చి మాటలు - నీపై నా పాటలు
నీ వైపే బాటలు వేంకటేశా
నీకై నా ఆటలు శ్రీనివాసా

**నీ**వే నా భావం నీవే నా రావం
నీవే నా గీతం వేంకటేశా
నీవే నా సంగీతం శ్రీనివాసా

**నీ**వే పరమాత్మ నీవే విశ్వాత్మ
నీదేగ సృజన వేంకటేశా
నీవే పరమపదము శ్రీనివాసా



**నీ**వేది చేసినా నాకోసం నాకోసం
నీవేది తలచినా నా యోగం నాకోసం

తిరుమలేశ నీ హృదయం నవనీతం
శ్రీనివాస నీ తలపున నా హితం నా హితం

**నీ** భావన లేని ఘడియ కానేరదు జీవితం
నీ తలపే లేని క్షణం రానేరదు పుణ్యం
నీ భజనం లోలోన నిరంతరం ఆనందం
నీ గీతాలాపనం నాకెపుడును తపనం

**నీ**లోని దయామృతం వర్షించును నిరతం
నీలోని ప్రేమెపుడును ప్రసరించే ప్రభంజనం
నీలోన నా భక్తికి ఈయవోయి స్థానం
నీ ప్రేమ డోలలో తేలాలి అనుక్షణం

**జీ**వితాన నీ తోడు నిరత వాంఛితం
అడుగులు తడబడకుండా సాగాలి నా గమనం
జీవితాన నీవేగా జీవాధారం
కనుమూసినా కోరెద నీ సన్నిధానం

**చా**లు చాలు ఈ జీవితం
లేదు లేదు ఏ కామితం

వేరేది కోరనోయి వేదవేద్యా
వేద నింక వలదోయి వేంకటేశా

**కో**రికలకు బానిసగా నేనయ్యాను
కడ ఎక్కడ కానరాదు - ఆపలేను
ఏ కోరికలైన కూడ సుఖమే మూలం
ఏనాడీ కోరికలకు కలుగును అంతం

**ప్ర**తి కోరిక లోలోపల పెంచును కద అహం
ప్రతి కోరిక అద్దంలా చూపును స్వార్థం
తీరిన ప్రతి కోరిక లేపునొకటి నవ్యం
జీవితం మహార్ణవం ప్రతి కోరిక తరంగం

**న**ను దూరం చేయకోయి నిన్ను మరువ నీకు
నా కోరికలిక ఆపు స్వార్థం రూపుమాపు
నీ రూపం నాలోన నిండి ఉండనీ -
నీ స్మరణం నిరంతరం సాగనీ లోకేశా



**వేం**కటేశుడే శ్రీహరి రూపం
వేంకటాద్రిపై వెలసిన దైవం

ధరలో అతడే నా దైవం
నాకిక అతడే ఇహం పరం

**ఇం**టను బయటను ఎట నేనున్నా
కంటను కందును ఆతని రూపం
ఒంటరి నేనిక కానే కాదు
వెంటను అతడే ఉంటాడెపుడును

**లో**క రక్షణము చేసేవాడు
ఏకైక దేవుడు అతడంటాను
ముప్పులు తిప్పలు తప్పిస్తాడు
చెప్పక ప్రేమను ఒలికిస్తాడు

**ము**ని గణ వినుతుడు ముకుందుడు
మురహరి నరహరి మాధవుడు
మనః క్లేశమున కతడే మందు
మన ప్రార్థనలు అతనికె చెందు

ఏది మూలం ఏది జ్ఞానం ఏది పరమార్థం
ఏది సత్యం ఏది నిత్యం ఏది శాశ్వతం

ఏది పరమార్థం -
ఏది శాశ్వతం

ఏది పూర్వం ఏది ప్రస్తుత మేది భవితవ్యం
ఏది కాలం ఏదనంతం ఏది అజ్ఞాతం
ఏది జననం ఏది మరణం ఏది ఆ భ్రమణం
ఏది కర్త ఏది కృత్యం ఏది ఆ ఫలితం

ఏది తిమిరం ఏది కిరణం ఏది ఆద్యంతం
ఏది దుర్గుణ మేది సద్గుణ మేది గుణరహితం
ఏది భాగం ఏది పూర్ణం ఏది సర్వస్వం
ఏది సృజనం ఏది విలయం ఏది కారణం

ఏది ప్రణవం ఏది నాదం ఏది నిశ్శబ్దం
ఏది జడము ఏది చలనం ఏది చైతన్యం
ఏది దృశ్యం ఏది వీక్షణ మేది ఆ జ్ఞానం
ఏది కార్యం ఏది కర్త ఎవరిదా ఫలితం

సకలమును హరి చిద్విలాసం
శ్రీనివాసుడు ఆ హరి రూపం
అతని నెరుగుట పరమజ్ఞానం
అతడె జీవిత పరమార్థం



ఎవరికి అందవు నీ దర్శనమున అందని ఆనందాలు
ఎవరికి కలుగదు భక్తి మైకమిక నీ సన్నిధిలో గుడిలో

ఆనంద నిలయా అంజనాద్రీశా
శ్రీగిరి నిలయా శ్రీనివాసం

ఎవరికి కలుగదు పదములు కనగా ఏదో శరణాగతి
ఎవరికి రాదిక నామంగాంచిన పరలోక అనుభూతి
మహిమల దేవా మాధవ కేశా
మాకై వెలసిన లోకేశా

ఎవరికి తొలగదు అభయ హస్తమును చూడగనే భయం
ఎవరికి కలుగదు శంఖు చక్రములు కానగనే జయం
దుష్టశిక్షకా శిష్టరక్షకా
దుర్గతి బాపే లోకేశా

నీ కిరీటమున మణిమయ కాంతుల నిర్మలమౌ కద హృదయం
కంఠహారములు కన్నుల వెల్గులు కలిగింపవా శుభయోగం
నీవే కాదా నిర్మల రూపా మా కాలంబన
నీ తలపులలో కాలం పోనీ దీన జనావన

ఎవరికి కలుగదు నీ సేవలగన ఏదో అదృష్టం
ఎవరికి రాదిక నిను పూజించిన భాగ్యం సౌభాగ్యం
గోవిందా హరి గోవిందా
గోవిందా శ్రీ ముకుందా

**జ**గత్కారణుడు జగదోద్ధారుడు
జగన్నియామకు డితడండీ

శరణాగతులకు చరణము చూపే
శాశ్వతుడే కద ఇతడండీ

**స**దానందుడు సత్తు స్వరూపుడు
సర్వేశ్వరుడే ఇతడండీ -
సత్యదేవుడు సమ్మోహనుడు
సాకారుడు కద ఇతడండీ -

**గు**ణదోష రహితుడు గరుడ గమనుడు
గగన సద్రుశుడు శుభాంగుడు
కమలనాభుడు కమలనాథుడు
కలిగించును కద పరమపదం -

**ప**రంధాముడు పరమ పురుషుడు
ప్రసన్న వదనుడు ప్రేమ సముద్రుడు
నమ్మిన వారికి నారాయణుడు
నరులకు కలియుగ దైవరాయుడు



**భా**నూదయ వేళలో తూరుపు సింధూరం
భావాంబర వీథిలో భగవానుడు బంగారం

తలపులలో తనువు పులకలు -
తన్మయాన తారల తెరలు

**ఆ**నందం తాండవించు ప్రకృతి వైనం
అపురూపంగా తోచెను అంతర్లోకం
కలఘోషం మింటిలోన కమ్మని సంగీతం
అద్భుతం అనిపించెను ఆ శ్రీశుని సృజనం

**చీ**కటులను పారద్రోలు చక్కని ఉదయం
చిందుల సందోహంతో చిదానంద హృదయం
భక్తితో పొంగుచున్న భగవద్భావం
భగవంతుడు ప్రకృతిలో సాక్షాత్కారం

**ని**రుపమాన దైవ ప్రేమతో నిండెను సర్వం
నెమ్మదిగా మానసాన ఊహాలోకం
నా దైవం ప్రసాదించు నమ్మలేని సత్యం
అనుభూతికి అంతరాన అమృత వర్షం

**జ**యహో జయహో జగన్నాయక
సృజన కారకా సురవర నాయకా

ప్రణవ పవిత్రా ప్రసన్న వదనా
ప్రమోదాంత రంగా - రంగా

**జ**గత్కారణా జనార్దనా
జానకీపతీ జయహో ప్రభో
చందన చర్చిత చారు శరీరా
చక్రధారి విభో జయహో జయహో

**క**రుణామూర్తీ కాలాతీతా
కనక కిరీటా జయహో జయహో
జ్ఞాన సముద్రా జ్ఞాన ప్రదాతా
జ్ఞాన ప్రకాశా జయహో జయహో

**కి**న్నర వీణానాద విలోలా
కిరీటి సన్నుత జయహో జయహో
శ్రీకర భవహర శ్రీసతి నాథా
శ్రీశా వేంకట నాయక జయహో



**అ**భినవ రూపుడు ఆది విష్ణువే
అంజనాద్రిపై అలరిన దేవుడు

ఆదిపురుషుడు అవతారుడు
ఆత్మారాముడు అకళంకుడు

**మ**హిమలు చూపే మానవరూపుడు
మకుటధారి మన మాధవుడు-
ప్రార్థన చేసిన ప్రేమావతారుడు
భక్తికి లొంగే భగవంతుడు -

**పా**పజనులకు పరమ రక్షకుడు
పావన చరణుడు పరమాత్ముడు
నరులను బ్రోచే నారాయణుడు
నారాయణాద్రిని నలువ జనకుడు

**భ**వబాధహరుడు భాగ్యప్రదాత
భావనకందని భగవద్రూపుడు
దీవెన లిచ్చెడి దివ్య ప్రభావుడు
దీనుల నేలగ దివి దిగినాడు

**క్ష**తిలేదు నా భక్తికి
గతి రాదు నా భక్తికి

నీ దయ ఉంటే నీరదశ్యామా
నిత్య నిర్మలా నారాయణా

**నా**రద గీతుల నాద వినోదా
తుంబుర గీతుల ప్రస్తుతి మూలా
అవతారాలకు ఆది విష్ణువు
యుగ దైవంగా గోవింద శ్రీహరి

**గి**రిపై వెలసిన శ్రీ గిరి నిలయా
గోవర్ధనోద్ధారి గోపాలా -
భక్తుల నేలే భావా తీతా
భక్తికి లొంగే భాగ్య విధాతా

**భ**గవంతుడవని భారము నీదని
భక్తి ప్రపత్తిని భక్తులు కొల్చిరి -
భవదీయునిగా బంధము పెంచితి
ప్రేమ నొసంగవ ప్రసన్నవదనా



**ని**ర్వికల్ప నిశ్చలస్థితి
నాకీయలేవా నారాయణా

**ని**న్నే నే వేడుకొందు నీలగగన శ్యామా
నీవే నాలో నిండి నిఖిలావని మరపించి
నీవు విన నా కెవ్వరు లేరనే భావనలో -

**న**ను నేను మరచిపోవు నవ్యానుభూతి
నేను క్రుంగిపోవాలి నే కరగిపోవాలి
నిన్ను కాక నీ సృష్టిని వేరెవరిని చూడలేని -

**క**నుమూసిన కను విప్పిన కలనైనా నీవే
అనిపించాలి మతి నిండాలి
విశ్వమంత నీవు నిండ నరునిగనే కనలేని -

**చై**తన్యం మృగ్యమై చలన మనేది లేని
రాయిలా పడి ఉన్న రామాయణ రమణిలా
హృదయంలో స్పందిస్తూ ఊపిరంత నీవుగా -

**ఏ**మిటి బంధం ఏమి సంబంధం
నీకు నాకు వేంకటేశ ఏనాటిది

ఎపుడు దాని ప్రారంభం
ఏమి కారణం -

**సో**మకునే ద్రుంచినపుడు సంద్రంలో ఉన్నానా
బలిదాన మిచ్చినపుడు భటునిగ చూశానా
రామునిగా పుట్టినపుడు వానరమై ఉన్నానా
గోపాలుడవైన నాడు గోవుగ ఉన్నానా -

**క**ర్మలేక జన్మరాదు జన్మ లేక కర్మ రాదు
ఎన్ని జన్మలైనాయి తొలుత నేనెక్కడున్నా
నీతో నా బంధానికి ఆదనేది ఉందా
ఏ నాటికి ముగింపు ఏమి నీ తలంపు -

**నా** జన్మల కారకుడవు నీవే కాదా
నా బ్రతుకుల ప్రతిసారి నీవే నడిపేవుగా
జన్మ జన్మకును నమ్మి దగ్గరైతినా
జన్మలింక చాలునోయి జాలి చూపుమా -



**జీ**వుడు నేను దేవుడు నీవు
నిన్ను వీడలేనయ్యా నీరద శ్యామా
నను దూరం చేయకోయి నారాయణా

**జా**నకీమాతతో వనమునకే ఏగినపుడు
జనంలో ఉన్నానా జాలిగా ఏడ్చానా
గోకులాన్ని వీడి నీవు రాజుగా ఏగినపుడు
ఎడబాటు భరించలేక ఏడ్చానా అందరిలా

**గా**లిగనో ధూళిగనో నేనున్న సమయంలో
తొలిసారి జన్మెందుకు నీవిచ్చావు
నీవంటే తగని భక్తి ఎందుకు కలిగించావు
అంతా నీ నాటకం - నీ లీలావినోదం

**క**ర్మలన్ని నా చేత చేయించావు
జన్మకర్మ చక్రంలో బంధించావు
నాకెందుకు ఈ భావన
అంతమెపుడు దీనావన

**పూ**లు లేని పూల తీగను - నేను
నేలరాలు వాడు పూవును

వేంకటేశు ప్రేమ లేనినాడు
అతడే నను చూడనినాడు

**తీ**గ తెగిన వీణ మ్రోతను - నేను
మూగదైన మురళి గాలిని
గాయపడిన మృదంగాన్ని నేను
గళము రాని గాయకుండను

**కూ**లి పడిన గాలి గోపురం - నేను
నేలబడిన బాల రసాలం
నూలు తెగిన గాలిపటం నేను
కాలు లేని వనమయూరిని

**ఊ**డి పడిన కాలి మువ్వను - నేను
అడుగుపడని బడుగు ముసలిని
రెక్క తెగిన పాలపిట్టను - నేను
చిక్కుకున్న వలలో మీనం



**నీ** కరుణ నాపై ప్రవహింపనీ
నీ...... చరణాలపై నన్ను ఒరిగిపోనీ

**భ**వ బంధములకు నే బందీని నేడు
బ్రతుకులో ఓడితిని నాకెవరు తోడు

చాలింక ఈ జీవితం
శమించనీ మానసం

**నా**రాయణాద్రీశా నారాయణా
నా గోడు వినవోయి దీనావనా
పాప వినాశకా భద్రాత్మకా
పరమాత్మ నన్నింక దరిజేర్చవా

**నీ**తోటి బంధం ఎంతో బలం
నీ మదిని నాకింత చోటీయవా
నీ కృపే నాకింక నిజ వైభవం
నీ చరణ సన్నిధిని సురనందనం

**ఉ**న్నాడున్నాడున్నాడు వేంకటనాథుడు
ఉల్లము లోపల చల్లగా కొలువై యున్నాడు
అతడే అతడే నా సర్వం
అతడే హితుడు నా దైవం

**ది**వ్వెను దాగిన కిరణంలా
గంటను దాగిన నాదంలా
గోపురమందున ఉన్నతిలా
గుడి విగ్రహమున దైవత్వంలా
గుట్టుగ నందుచు ఆరాధనం
గుండెల గుడిలో నిండగు దైవం -

**గీ**తంలో సంగీతంలా
గీతను గల సందేశంలా
ఏటి నీటిలో కెరటంలా
మాటల దాగిన భావంలా
గుట్టుగ తన దయ చూపుచు
గుండెల గుడిలో నిండుగా -

**ది**విలో చంద్రుని వెన్నెలలా
దీవెనలో గల శుభాలలా
బంగారంలో మేలిమిలా
బంగరు గోపుర ఆకర్షణలా
మానస మందిర సుందరుడు
మరువనీయడు మాయం కాడు



**తి**రుమలపై కొలువయ్యెను జాబిలి జాబిలి
తీరుగ ఈ నేలంతా వెన్నెల వెన్నెల
అది - అందరికీ పరమపవిత్రం
అది - అందరికీ పరదైవపురం

**అ**జ్ఞానంలో మునిగిన జనులందరికి
పాపాల ఊబిలో పడినందరికి
అహంకార సంజనిత అంధత్వంలో
దారిచూపు వెలుగు తోరణం
అతడే కద ఆశాకిరణం

**ప**రలోక సీమలలో పదములున్న అనుభవం
ఆధ్యాత్మిక వీథిలో స్వేచ్ఛాయుత పరిధిలో
కమ్మని కలలాగున కనుపించేది
మందాకిని వీచికలా మరపించేది

**కా**ఠిన్యత కరగించి కల్యాణ ప్రదంబై
కన్నుల వైకుంఠంలా కరుణాలయ ప్రాంగణమై
ప్రపంచాన ప్రేమ నింపి ప్రసరిస్తూ భక్తిని
మానసాన మలయ మారుతం
మార్చి వేయు మన జీవితం

**చీ**కటి పటలాలను చీల్చలేనయా
మాయా తిమిరాలను మార్చలేనయా
ఓ శ్రీసతి ప్రాణనాథా
ఓ తిరుమల వేంకటేశా

**నీ**వే దిగి రావాలి
నీవే దయ చూపాలి
నీ కరుణకు ఎపుడెపుడని నిలిచేనయా
నీ ప్రేమకు ఓపికతో కాచేనయా

**నీ** నామం జపియిస్తా
నీ కోసం పడి కాస్తా
ముని జనులను కాపాడే ముల్లోకేశా
ముముక్షువులు వీక్షించే పుల్లాబ్జాక్షా

**ర**క్షించిన శిక్షించిన రాకా శశివదనా నీవే
కుక్షిలోన క్షితినంతా ఉంచిన శ్రీశా
సర్వాంతర్యామి నీవెగా - సాకారా
ఏదైనా నీ వశమేగా



**తొ**లగిపోకు వెడలిపోకు తండ్రీ శ్రీశా
మరలిపోకు మళ్ళిపోకు మాధవా దేవా
తెలివిమాలి నా ఎడదకు తలుపుతీయకుంటే
మతి లేని వానిగా మరి చూడలేవా?

**మ**నసు పెంచి మన్నించి దయ చూపవా
అడుగు వేసి తలుపు తోసి లోనికి రావా
లోపాలు పాపాలు చూడకుమోయీ
నా శక్తి నా భక్తి మరువకుమోయీ

**మ**దిలో నీ నామమే మరచి పోయినా
ఐహిక బంధాలకే అంటి ఉండినా
నీ సృజనను నేను కానా
ఓపికతో సైచి నన్ను కావ లేవా

**తా**మసమున తనువు మరచి చూడకున్నా
తండ్రీ! ఆకర్షణలకు నేను లొంగినా
శిక్ష కాదు కక్ష కాదు రక్షణీయవా
లక్ష్యసిద్ధి దిశగా నను నడిపించవా

**క**లలోనికి నడచిరా కన్నులలో నిండవా
కలియుగ వరదా విభో కమలేశా కరుణాకర

**శ్రా**వణ మేఘంలా నెమ్మదిగా కదలిరా
శారద రాతిరిలా కౌముదితో నిండిరా
సుప్రశాంతి కెరటంలా పెనుకాంతి మకుటంలా
కదలిరా నడచిరా కల్యాణ గుణ నిలయా

**కు**రిసేటి జల్లులా మెల్లగా చల్లగా
విరిసిన మరుమల్లెలా నవ్వుల ముత్యాలతో
వానముందు గాలిలా వడిలేక సడిలేక
మందార మరందమై
మందంగా అందంగా -

**కి**న్నర కింపురుషుల విపంచీ వాదనలా
కన్నె గులాబీలలో వన్నెలన్నింటితో
నారద సంగీతంలా ఆ రాముని వారధిగా
రావోయి రాకా శశిలా
రాజిల్లే రతనాలలా



**చూ**డు చూడు శ్రీనివాసుని
చూడుము ఆ తిరుమలేశుని

చూసి తెలుసుకున్నదేదొ చూడు
తెలిసినంతనే మనసును చూడు

**చూ**డు చూడు చరణ చంపకాలను
చంపకాల నీడలలో నీ ఉనికిని చూడు
వాటిపైన తలవాల్చి రక్షణకై వేడు
శరణాగతినే పెంచి నీలోనికి చూడు

**చూ**డు ఆ కర కమలాలు
చూడుము ఆ అభయముద్రలు
ఆ వెనుకను ఆ దేవుని కరుణార్ణవం
ఆ పిమ్మట ఆతని నవనీత మానసం

**చూ**డుము ఆ కనుదోయిని
కన్నులలో అనుగ్రహాన్ని
చూడు చూడు శంఖచక్రాలు -
తొలగించే భయభ్రాంతులు

**చూ**డు చూడు తిరునామము
అందులో వైరాగ్య భావలాహిరి
నామ రేఖలే చూపే ఊర్ధ్వలోకము
నీవదే కోరుమనే నిజ సూచనము

**గి**రిని వెలసె పురుషోత్తముడు - వేంకట
గిరిని వెలసె శ్రీనివాసుడు

కలియుగాన జన శ్రేయం కోసం
కలి పీడిత ధర్మం కోసం

**పా**పమెంతో పెరిగిపోయె కొండంతగా
శాపంగా జనజీవన సరళికి దూరంగా
దిక్కులేని జనులకే తాను దిక్కని చూపగ -

**అ**లనాటి పుణ్య చింతనము లేనే లేదు
గత యుగాల ధర్మచింతనసలే లేదు
ఆర్తి చూపి అందరికీ రక్షకుడై కావగా -

**జా**తి కులం మతం గతం శత్రుత్వాలు
కామాది శత్రువులే చెలరేగేరు
కలిబాధలు తొలగించే కలియుగ దైవంగా -

"**భీ**తి ఏల నేనున్నా" నని కుడి చేయి
"పతనమైన ఉద్ధరింతు" నని చూపే ఎడమ చేయి
మౌనంగా మనకు తన రక్షనున్నదని తెల్పగ



**భ**యం భయం భయం - చాల
భయం భయం భయం

వేంకటేశుడే అభయం
అతని శరణు అతని రక్ష నయం నయం జయం

**ఆ**లుమగల మనుగడలో అపశ్రుతే పలికినా
ఐహిక ఆకర్షణలే అన్యాయం చేసినా
తనవారి ఆదరణే తక్కువగా కలిగినా
తలిదండ్రుల ప్రేమకే నోచుకోలేక పోయినా -

**మ**నశ్శాంతి అంతరించి బ్రతుకు మాసినా
వ్యసనాలకు బానిసై వ్యాకులతే మిగిలినా
దీర్ఘరోగమే బ్రతుకున దిక్కులేక చేసినా
ఆర్థికముగా చితికిపోయి అణగారినా -

**ఆ**శబాసి బ్రతుకంతా అంధకారమైనా
అనాథులుగా ధరణిలో అంత శూన్యమైనా
బానిసలా బ్రతుకీడ్చుటే బాధే ఐనా
బ్రతుకలేక చావు రాక చస్తూ బ్రతికుండినా -

**కో**వెల ఏదైన గాని కొల్తును నిత్యం
దేవుడు ఎవరైన గుడిని వేంకటేశుడే దైవం

దేవతలెవరైన కూడ దేవుడాతడే
పరబ్రహ్మమాతడు పరమాత్ముడతడు

**ఏ** దేవుని పూజించిన ఆ రూపం నాదే
ఆ రూపంలోనే ఇక అనుగ్రహం అందును -
అని పలికినదెవ్వరు కృష్ణుడుగా ఆతడే
అందుకే నా పూజలు ఆ వేంకటేశునికే

**నా** ప్రార్థన నా వినతులు నా గీతులు కవితలు
నా దేవుని పరమైన ఆతనికే చేరును
నే మ్రొక్కిన దాతనికే నా చిక్కులు మాయం
భుక్తి భక్తి ముక్తైనా అతడిచ్చే అనుగ్రహం

**నీ**లో నాలో నింగిని విశ్వంలో సర్వత్రా
నిండి ఉన్న దేవదేవుడు కొండపైన వెలసినాడు
మనలోన మదిలోన మంచికి మార్గం
మనకై తను కోరేది గతం కాదు హితం



**ప**రంజ్యోతి ఇతడండి నమ్మండి నమ్మండి
పరమాత్మ ఇతడండి వేంకటాద్రి నిలయుడండి

**కే**శవుడే ఇతడండీ క్లేశము తొలగించును
నారాయణు డితడండీ నరకము తప్పించును
మాధువుడే ఇతడండీ మనశ్శాంతి కారకుడు
గోవిందుడు ఇతడండి గొంతెత్తి పిలవండి -

**ఆ**ది విష్ణు ఇతడండి అనాథులకు నాథుడు
మధుసూదను డితడండి మన ప్రార్థన వింటాడు -
వాసుదేవు డితడండి వరదాన శీలుడండి
శ్రీధరుడే ఇతడండి శ్రిత పారిజాతమండి -

**హృ**షీకేశు డితడండి హృదయాన దయామయుడు
పద్మనాభుడితడండి పరమకృపా సింధు
దామోదరుడితడండి ధరరక్షణే ధ్యేయం
సంకర్షణుడితండి సాగిలపడి మొక్కండి

**అ**నిరుద్ధుడు ఇతడండి అమృతం మనసంతా
అధోక్షజుడు ఈతడే అందరికీ రక్షకుడు
నారసింహుడితడండి నారద వందితుడు
జనార్దనుడు అచ్యుతుడు జగన్నాథుడితడు

**పా**ప జీవితపు పంకము కడిగి భక్తిని కలిగించు
లోపము లెంచక రమణా మాలో దీపము వెలిగించు
జ్ఞాన దీపము వెలిగించు

**జ**గతి జనకుడవు నీవను జ్ఞానం
జనులందరు నీ వారను జ్ఞానం
జగన్నాయకా జలజాననా
జనులకు కలిగించు - జగతిని నడిపించు

**జ**గమంతా నీ నాటక రంగం
జనమంతా నీ కీలుబొమ్మలం -
ఆడేది మేము - మమ్మాడించేది నీవేగా
ఈ అనుభూతిని కలిగించు
ఈ నమ్మికనే బలపరచు

**జ**గమే కాదా నీ ఆలయం
జనమంతా గుడిగంటల నాద తరంగాలు -
గంటల నెందుకు పేర్చేవు గంటల మ్రోతెందుకు
సర్వం నీకే తెలియాలి తెలియదు గూఢార్థం



**వి**రక్తి చెందనేల విముక్తి పొందవేల
విసుగ నేది ఏల విరామమసలదేల

సాధన సాగించవోయి
సమస్యనే విడువ వోయి -

**చే**సేది శ్రీశుడు చేతయును ఆతడు
చేయించే దాతడు చేత ఫలితమాతడు
ఆడించే దాతడు ఆడేది మనం జనం
అసలు కీలకమ్మిదియని తెలియాలి జనం

**వి**నయంతో మెలగాలి విశ్వాసం చూపాలి
నమ్మకమే పెంచాలి నమ్రతనే చూపాలి
నీడగా తోడుగా ఉండేది ఆతడే
నిను పూర్తిగ తనవైపు తిప్పుకొనేదాతడు

**నే**నన్నది మరచిపో నాదన్నది వదలుకో
సేవన్నది పెంచుకో దేవునిదని తెలుసుకో
సర్వమతడె చూసుకో సన్నిధినే కోరుకో
సర్వేశ్వరుడాతడు అతడె వేంకటేశుడు

**శ్రీ** వేంకటరమణా నా సందేహం నీవే తీర్చాలి
నిత్యం నాలో సంకోచం నాలో నిలువకపోవాలి

**నీ** పదములకే పూజ చేయుటకు
పూవైతేనేమి - కన్నుల నీరైతే నేమి
పూవును వేసిన హస్తంలో లేదా కామితం
పూవుగ రాలిన బాష్పం కాదా పూజా పుష్పం
మరి రాదా పూజా ఫలితం -

**పూ**వే పదముల బడితే పుణ్యం కలిగిస్తావా
కన్నీరొలికి కాళ్ళు కడిగితే
కరుణకు నేనోచనా - రాదా కైవల్యం

**ని**రాశ పూరిత నిట్టూరుపులే
నీ గుడిగంటలు కానేరవా
నీకై విడచిన కోరికలే కాదా నైవేద్యం
నీలో నాపై కరుణ కలిగితే
నీ ప్రసాద మది కాలేదా -



**ఏ** కాంత దర్శన మీయవా
శ్రీకాంతనాథా శ్రీ వేంకటేశా

నా ఆశకది అంతం
శ్రీ దేవుడే నా స్వంతం

**నా**లోని భక్తి ప్రఫుల్ల పద్మం
ఆ పద్మమే నీకు పూజా పుష్పం
పూవొక్కటైనా పులకింపనీ
నా మదిని కొలువైన నారాయణా

**ఒ**ళ్ళంత నీ రాకకై కళ్ళుగా చూతు
ఎడదకు తలుపులను తెరచి ఉంచాను
ఎపుడొత్తువో యని నా ఎదురు చూపులు
కంబళిని వాకిటను పరచేను నీకై

**ఎ**దలోన వెలుగువై కననీయవా
ఏ వేళనైనా రాజాలవా
ముందుగా సూచించి సంసిద్ధపరచి
విందుగా ఆనందమే అందుకొనగా

**నా** బ్రతుకులోనది చరమాంకమై
నా గుండె బరువుతో నను కూలనీ
పూజా సుమంగా పురుషోత్తమా
పదముల నన్నారనీ - పరమ పదమును నను చేరనీ

**నీ** నామ్మస్మరణం నీ ధ్యానయోగం
నిత్యం నాకీయవా - గోవింద
నీ ప్రేమ ప్రకటించవా -

**నా** పాపహరణం నయనాల బాష్పం
కడిగిన నీ మహిమ కాదందువా
శ్రీగిరి నిలయా శ్రీనివాసా

**నా**లోని క్రోధం లోలోని ద్వేషం
కడదాక తొలగించి కాపాడవా
కరుణించి నీ ప్రేమ నొలికించవా

**తొ**లగించు స్వార్థం - కలిగించు శాంతం
ఎరిగించు జీవిత పరమార్థం
పెరిగించు ఎనలేనీ సౌహార్ద్రం

**జ**గమేలు స్వామి - అనుమానమేమి
ఏదైన నీ దయ అనుకొందురా
సర్వేశ్వరునిగ నిన్ను నమ్మేను రా



**పా**డాలని ఉంది నాకు - ఆడాలని ఉంది
నీ రూపం తలచుకొని నీ భక్తికి బానిసనై

శ్రీనివాస శ్రితజనేశ
ప్రతీక్షణం పరవశాన -

**పా**డాలని గళమెత్తి ఆడాలని ఆదమరచి
అనుభవించి తీరాలని అంచుదాక ఆనందం
గోపాలుని సన్నిధిలో గోపికలా అనుభూతిని
కళ్ళు మూసి ఒళ్ళెరుగక గోవిందా అని అంటాను

**పా**పలా గంతుచూ చేపలా త్రుళ్ళుచూ
పురి విప్పిన బర్హిలా పులకించి ఆడుతూ
పికమూలా గళమెత్తి పంచమాన పాడుతూ
నీపైన నా ప్రేమ యమునలా ప్రవహింప -

**అ**ంబరాన్ని చుంబించే ఆశనై ఎగురుచూ
అణువణువున భక్తి నిండి అనుభూతికి లోనై
రాగాను గుణ్యంగా రవము మదిని మెదలగా
ఎదో నవ్యలోకాలకు కొనిపోయే భావమునై -

**వా**లనీ వాలనీ నా తలనే వాలనీ
కారనీ కారనీ కన్నీరే కారనీ
నీ చరణ కమలములపై
నిత్యం నీ దయకై -

**వే**లవేల నా జన్మల పాపాల పతంగాలు
కూలనీ కూలనీ చేరగ నీ చరణాలు
బంధాలు అనుబంధ సంబంధాలు
భాగాలై తెగిపోనీ తెగిపోనీ

**గ**త జీవిత బాధాయుత చీకటులను తొలగనీ
సుఖ జీవిత తొలివేకువ తెలిరేకులు విరియనీ
సుధా మధుర జీవిత రవికిరణాలే రేగనీ
అంతరాన కలవరమెదొ సాగనీ నను విననీ

**ఎ**దలో గల భారమంత తొలగనీ తొలగనీ
తూలికలా తేలికగా నా ఎదనే నిలువనీ
నిలచి నిలచి హాయిగా ఉండనీ ఉండనీ
ఉండి ఉండి నీ భవానలో రమణా తూలనీ



**న**డవనీ నా పడవ నడవనీ
నడకంతా నీ మహిమని - శ్రీశా

**చు**క్కాని పడుతుంటే చక్కంగ మళ్ళేను
నీవైపే నా నావ నువ్వే తిప్పేసుకో
నువ్వే నా గమ్యంగ నీవైపే తిప్పుకో

**తె**డ్లెట్టి కొడుతుంటే తెప్ప సాగేను
తేలికగా నా పడవ నిట్టే లాగేసుకో
నీ తీరమే నాకు వైకుంఠపురము -

**తె**రచాప రెపరెపలో పీతాంబరమే కదలె
కను నులిమి మరి చూస్తే కనుపించ లేదాయె
ఏమిటో నీ మాయ ఏమని చెప్పేదయ్య -

**కె**రటాల నా నావ తెలిపోతుంటేను
నువ్వుడుగున చెయ్యి పెట్టి లేపేస్తున్నట్టాయె
చాలయ్య నీ దయకు దండాలు
చాలయ్య నీ ప్రేమకు వందనాలు

**భ**క్తుల మొరవిని బాధలు బాపే
భగవంతుడవు కదా రమణా
భగవంతుడవు కదా -

**ది**క్కులు పదియని పలుకుదు రెల్లరు
దిక్కొకటేలే - నేనంటా
దిక్కువు నీవేలే - మా జీవ నిధానము నీవే

**చీ**కటి మూసిన అజ్ఞానంలో
జిలుగుల వెలుగుల జ్ఞాన దీప్తివి
ఆశలు క్రుంగిన అయోమయంలో
ఆనందలహరికి ఆధారమీవె ఆశ్రయ మీవె

**జీ**వన భీతుల జీమూత శ్రేణికి
ఝంఝానిలమై తరిమే శక్తివి
భావన కందని బహు దివ్య ద్యుతిలో
దీవెనలను బ్రోవు దివ్యాతి దివ్యా

**ఊ**హల కందని మహిత శక్తివి
ఉరమున నిల్చే సర్వాత్మకా
ధర్మము నిలిపే దయా స్వరూపా
మరిమరి నీవే సిరులిచ్చుమా దొర



**అ**దిగో తూరుపు తెలవారె
అపుడే నయనం విప్పారె

పక్షుల చలనం కలఘోషం
పరమాత్మునకే నాదు ప్రణామం

**ఎ**ల్లెడ నలరిన ప్రశాంత ఉదయం
ఎదలో నమరిన నిశ్చల భావం
కదిలీ కదలని సుప్తిని లోకం
కలియుగేశుడే కన్నుల లోకం

**కొ**ండను గుడిలో గంటల నాదం
దేవుని తలచిన గుండెను మోదం
మెల్లగ కదలెను వాయు తరంగం
ఉల్లములో ఉల్లాస విహంగం

**చ**ల్లని నదిలో సలిల ప్రవాహం
అంతరంగమున భగవద్భావం
అపుడే విరిసిన కుసుమ పరాగం
అంతట వినపడె సరాగ రాగం

**నీ** నామమే  నా పాటగా
నా నోట పలికింపవా - శ్రీశా
నా మానసం మధుమురళిగా
రవళింపవా రమారమణ -

**రా**గ మెరుగని బాలనోయి - నీ
అనురాగమె కోరెదోయి
నా జీవితం నీకు నీరాజనం -
అర్పింతునోయి అమరాధిపా

**ఉ**ద్రూత లూగించు ఆనంద మెగయ
ఉచ్ఛ్వాస నిశ్వాసములు రెండు మరువ
ప్రతిక్షణము నాలోన నవగీత మొలుక
బ్రతుకంత రసరాగ లోకాలు తేలగ -

**నీ** వియోగము నెపుడు భరియించలేను
కనుపించి నావంటె కను విప్పలేను
కను విప్పినా కూడ కనలేను నిన్ను
కన్నీరు కనులందు కాపురము చేయ -

**పెం**జీకటులు నన్ను పెనవేయనీకు
ప్రేమతో నన్నెపుడు విడనాడకోయి
అర్ధరాత్రిరి దాటే నా జీవితాన
నీ వెలుగులే నాకు ఇక వేకువే కాగ -



**నీ** పద ధ్యానమె నా వేణువుగా
నీ గుణగానమె నా గీతముగా

పాడనా నే పరమాత్మ
పాడనా నిను కొనియాడనా

**స**ర్వేశ్వరుడవు నీవే నీవని
సకల చరాచర సృజనకారుడని
సర్వం మరచి ఏకాగ్రతతో
సన్నుతింపనా సర్వాత్మకా

**న**డకల నదులే నీకై సాగగ
సంద్రమె నీకై తరగల లేవగ
గిరులు తరులు నిను సూచింపగ
ఉదయభానుడే నీ వెలుగు చిందగ

**ప్రా**తఃకాలపు ప్రశాంతి నిండగ
చిరు చలిగాలులు నీ కృప తెలుపగ
ప్రకృతి నిన్నే ప్రతిబింబించగ
ప్రాణ ప్రదాత నిను కీర్తింపగ -

**ధ**ర్మ చక్రము శ్రీహరి ధర్మ చక్రము
తిరుగుతోంది తిరుగుతోంది ఈ ధరనే ఏలుచూ

**తీ**రు తెన్ను లేని బ్రతుకు తీర్చిదిద్దుటే ధ్యేయం
తెరు వెరుగని తిమిరంలో తెరువు చూపు దీపం
బాధలలో పెన్నిధి సన్నిధిలో ఉన్నది
బాధ్యత వహియించినది భారము తొలగించునది

**ఆ**ర్తిలో దరిజేర్చే అద్భుత నౌక
ఆపదలో ఆదుకొనే భాగ్యమింక
అనుక్షణం మనకోసం రక్షాకవచం
అపురూపం అమోఘం అదొక సుదర్శనం

**ఎ**ంతటి పాపాత్ముడైన ఎదలో పరివర్తనం
మనసు మార్చి కలిగించును మనలోన మంచితనం
సమత మమత పెంచునట్టి సరికొత్త సుదర్శనం
అందరికీ హితం హితం - అదే దాని క్రొత్త మతం

**వె**నుకబడిన సనాతనత నుద్ధరించు ఉత్సాహం
దైవచింత అందరిలో కలిగించే దివ్యత్వం
భవబంధ వినాశనం భక్తులలో ఏకత్వం
విభేదాలు తొలగించు వసుధకు సంరక్షణం



**ద**యామయుడు వేంకటేశుడు
ధరణినేలు దామోదరుడు

"దిక్కు నీవె" అని వేడండి
చిక్కులన్ని తీర్చునండి

**జ**న్మ కర్మ కారకుడతడే - జర మరణ హేతువతడే
జగతి నడుపు సూత్రధారుడు జాగృతి మేధస్సు అతడే
సర్వకాల మందు ధరలో సాక్షిగ రక్షగ నుండే దతడే

**కా**మ క్రోధ లోభం మోహం
కడు దూరం చేసే దైవం
మదమైన మత్సరమైన
మట్టుపెట్టి కాచే దైవం
మమకార బంధాలన్నీ మాయం చేయగలిగే దతడే -

**మ**నసులోన శాంతి అతడే
మహాజ్ఞాన దీప్తి అతడే
వైరాగ్య మార్గం అతడే
వరములతో ఏలే దతడే
మనతో తానుండి మనకు మంచిచేయు మాధవుడతడే

**కో**టి గొంతు లెత్తరే
కోరి భజన చేయరే
పాపాలను పరిహరింప
పరమాత్మను వేడరే

**మ**నుజులలో దనుజబుద్ధి మార్చగల్గు దేముడు
మానవతా విలువలను మనకిచ్చే దేముడు
మనకోసం వేంకటాద్రిపై వెలసిన శ్రీదేవుడు
మానసాన సుఖశాంతులు మనకు నిల్పు శ్రీశుడు

**ప**రుల శ్రేయమే ఎంచి పరవశాన పాడరే
వరమిచ్చే దేవుడతడు పరబ్రహ్మ ఆతడే
ఉద్ధరించు చక్రధారి జనమానస విహారి
ప్రాణదాత ప్రత్యగాత్మ భవనాశక శ్రీహరి

**క**ళ్ళలోకి చూస్తుంటే కనుపించును కరుణంత
నరకలోక బాధలను నశియింప జేయును
భజనలతో ప్రార్థించిన బాధనార్చు దేవుడు
భక్తకోటి రక్షకుడు భగవంతుడు రమణుడు



**శ్రీ**హరీనమస్సులు మనసులో తపస్సులు స్మరణ తపన భావన
**శ్రీ**హరీ నమస్సులు మనసులో తపస్సులు స్మరణ తపన భావన

నీదు కరుణ లేని మనికి కారడవుల కౌముది
నీదు ప్రేమ లేని జన్మ నడి ఎడారి నడకగా నీరులేని నారుగా

**నీ**దు నయన వీక్షణలో నిల్చు మదిని శాంతం
నీవు నిలుచు వేంకటాద్రి కలియుగ వైకుంఠం
మహామధుర మాధవం

**నీ**వు నిలచు జగతి ప్రగతి జనతికి సుగతి
విగతజీవి పరయాత్రకు నీవే దారి కాంతి వారి కైవల్య లహరి

**ప**శువులైన శిశువులైన జననం నీ కైవశం
బ్రతుకులోన నిన్నె దెలసి ప్రార్థనలో పరవశం మాకుతొలగునైరాశ్యం

**వేం**కటచలపతి వేదవేద్యుడు
ప్రణవ పవిత్రుడు పరమాత్ముడు
భవ నీరధినే దాటించు వారధి
భగవంతుడే - కైవల్యసారధి

**మ**నకై వెలసిన మాధవుడు
మనలను బ్రోచే మధుసూదనుడు
యుగయుగమందున ధర్మము తరగిన
యుగ దైవంగా నిలచినవాడు -

**అ**ఖిలాండ తేజుడు అనంతుడు
అవనిని జనులకు రక్షకుడు
అవతార పురుషుడు ఆదిదేవుడు
శ్రీనివాసుడు శ్రితజన ప్రియుడు -

**క**లి బాధలనే కూలగ ద్రోసి
కలియుగ జనులకు ఆలంబనగా
నిఖిల జనులకై నింగి వీడిన
నీరజనాభుడు నిజ రక్షకుడు



**మ**ధురం మధురం మాధవుడు మధురం
స్మరణమె పులకల దేలించు నామం -

**రూ**పం మధురం హృదయం మధురం
గుడిలో నిలచిన తీరే మధురం
చేతులు మధురం చేతలు సైతం
చేతుల నిండిన అభయం మధురం

**క**న్నులు మధురం కాంతులు మధురం
కన్నుల చూపుల కరుణే మధురం
వదనం, అధరం కంఠం మధురం
వదనం నిండిన నామం మధురం

**లీ**లలు మధురం మహిమలు మధురం
మహిమలు చేసిన దైవం మధురం
శంఖు చక్రములు దీవెన మధురం
పదములు మధురం పవిత్రత మధురం

**అం**తయు మధురం తనువంత మధురం
తనువున మానవ తత్త్వమె మధురం
భజనలు మధురం భావం సైతం
భావనలో గల పరచింత సైతం -

**న**మ్మేనయా మన సమ్మేనయా
నాకేదో వరమిచ్చి నను బ్రోతువని వింటిని
రమణా నను బ్రోతువని వింటిని

**ఇ**లపైన వెలసిన ఇలవేల్పు వంటి
కలనైన పరమాత్మగా నిన్నె కంటి
వరమీయవా దేవరా
పరమీయవా ఏలరా -

**స**ర్వేశ్వరుడువని సాగిలితి మ్రోల
స్వర్గాధినేతా సత్య స్వరూపా
కఠినతనే చూపకు - వరదా
కరుణతో పాలించవా

**వై**కుంఠ మిమ్మంటినా - నీ
సప్తగిరిమ్మంటినా -
నా జీవితాంతం నాలోన ఉండి
నిన్నెపుడు వదలని బ్రతుకీయవా
నన్నెపుడు వదలక నడిపించవా
బ్రతుకంత క్రతువుగ సాగించవా



**శ**రణం శరణం శ్రీహరి చరణం
స్మరణం స్మరణం గోవింద నామం

నరులకు తరుణోపాయం ఖాయం
సురలుగ సుఖముగ మనుగడ ఖాయం

**జీ**వనగంగా ప్రవాహ మోదం
జీవిత గమ్యం సుగమం శుభగం
భావికి బంగరు మార్గం భాగ్యం
నిత్య వసంతం నిండిన లాస్యం

**ప్ర**త్యహ జీవన వనాంతరం
ప్రమోద ప్రపూర్ణ ఫలప్రదం
నిర్జన సీమల నిశ్శబ్దం
నింపే శారద వీణానాదం

**సం**తస సాగర తీర సమీరం
సురనుత ప్రియతమ అమృతపానం
నింగిని చంద్రుడు భువికి ప్రయాణం
నీలో నాలో వెలుగుల లోకం -

**హృ**దయాకాశం కౌముది పూరం
జీవితమంతా నందన వాసం
అంబర చుంబిత గంగా తరంగం
అనూహయ్య నూతన ఉదయ ప్రకాశం

**భ**క్తి ప్రేమల విలువ తులసీ దళమ్ముగా
బరువులో సరితూగె పరమాత్మ నీవె

భక్త సులభుడు హరి భక్త రక్షకుడు
భక్తపాలకుడతడు భగవంతుడు

**మ**నకేది జరిగినా శ్రీనివాసుని దయే
మనమేది కోరినా దేవదేవుని దయే
కోరికయు వినతియు కోర్కె సాఫల్యం
కోనేటి రాయునిదె మనమంత నిమిత్తం

**అం**బరీషుడు గాని ప్రహ్లాదుడే కాని
హరి భక్తులే కదా హరిదాసులేగా
ఆ సుధాముని గుండెలో నిండె శ్రీహరి
నరుడైన ఫల్గుణుని సంరక్షకుడు శ్రీహరి

**భ**క్తెంత బలమో భక్తంత ఘనము
భక్తెంతొ హితము భక్తి ఒక మతము
భక్తులెవ్వరుయైన సర్వమర్పించాలి
భక్త నుతుడైన హరి భక్తుల కధీనం



**ఏ**ది పూవు ఏది పూజ ఏది ప్రణామం
ఏది దీప మేది ధూప మేది నివేదనం

అది బాహ్యం కాదు
అది ఊహ్యం నిజం

**ఎ**ట్టఎదుట నున్నది బొమ్మగాని శిల్పం
ఉలకదు పలుకదు ఊసులాడదు
అభిషేకం అర్చన ఏదైన ఒకటే
క్రియ కంటె ముఖ్యం నీ భావన ప్రధానం

**సా**కారమైన వేల్పు ముందున్నది అనుకో
నీలాగే నిను చూస్తూ ఉన్నది అనుకో
చేసేది ఏదైనా అనుభూతిని పొందాలి
చిత్తశుద్ధి చిరుభక్తిని అంతర్లీనం

**స**కలమునకు కారకుడు శ్రీనివాసుడు
జరిగింది జరిగేది జరుగుచున్నది
సర్వం ఆ దైవమని ఊహలో ఉండిపో
సర్వ సాక్షి ఆతడని మరచిపోకు మనసులో

**క**ర్మ విమోచన కర్మ విమోచన కర్మ విమోచనం
కర్మ విమోచన కర్మ విమోచన కర్మ విమోచనం

మోక్షకాములై రండి - ఆ
శ్రీనివాసుని వేడండి -

**న**రుని కోరికల కంతం లేదు
సుఖాల కెన్నడు 'చాల'ని లేదు
కోర్కెలు సుఖాలు నిత్య ప్రవాహం

**ఆ**లోచనలకు అడ్డం పెట్టు -
సంఘర్షణలను సాక్షిగ చూడు
ఆకర్షణలను ఆవల ద్రోసి
అంతరాత్మ ఏమనునో చూడు -

**ద**యా ప్రేమలకు దాసుడు నీవై
ధన దాహానికి దూరం తొలగి
'నీ' - 'నా' భేదం లేదను భావం
నీ హృదయంలో నిండిన తరుణం -

**పం**చభూతములు ఏవీ లేనొక
శూన్య స్థితినే హరి నీకీయగ
నిర్మోహత్వం నిశ్చలతత్త్వం
నిర్మల భావం నీలో నిండగ -



**రో**దసిలో నినదించి గగనాల వ్యాపించి
అణువణువున ప్రకంపనం - అద్భుత ప్రణవం
ఆ - ప్రణవంలో నిండిన నీ రూపానికి ప్రణామం నా ప్రణామం

**శ**బ్దంగా జనియించి శబ్దంగా వ్యాపించి
అన్నిటినీ కల్పించి ఆత్మలనే సృజియించి
కణ కణమున కలసియున్న కమలనాభా
నిను నమ్మితి - నీకు సదా నా ప్రణామం

**జీ**వాత్మల కడదాకా జీవులలో బంధించే
జగతి నటన సూత్రధారి జగదాత్మకా
నిరాకార సాకారా నీకు ప్రణామం నా ప్రణామం

**స**త్యం నన్నెరుగ నీవు సర్వేశ్వరా
నిత్యం నేనజ్ఞానిని నిన్నెరుగనయా
ఈ మాయా తిమిరానికి ఆవల వెలిగే మూర్తీ నా ప్రణామం

**అం**డ పిండ బ్రహ్మాండం అన్నిటినీ ఆక్రమించి
వెలుగుల వారాసియైన విశ్వరూపధారి
కానరాని కరుణాకర నీకు ప్రణామం నా ప్రణామం

**శ్రీ**హరి వనుటే నా ధర్మం చింతలు బాపుట నీ ధర్మం
శరణను వారికి కరుణను చూపి
తరింప జేయుట నీ ధర్మం -

**రా**ముడు వనుటే నా ధర్మం - రాజస మణచు నీ ధర్మం
కృష్ణుడ వనుటే నా ధర్మం - కృప జూపుటయే నీ ధర్మం

**జ**న్మలు పొందుట నా ధర్మం - జన్మల నిచ్చుట నీ ధర్మం
కర్మలు చేయుట నా ధర్మం - మర్మము దెల్పుట నీ ధర్మం

**త**ప్పులు చేయుట నా ధర్మం - క్షమాపణిచ్చుట నీ ధర్మం
తపనము పొందుట నా ధర్మం- శమనము నిచ్చుట నీ ధర్మం

**దు**ఃఖము పొందుట నా ధర్మం-సుఖమును ఇచ్చుట నీ ధర్మం
పాదము బట్టుట నా ధర్మం - పాపము బాపుట నీ ధర్మం

**ప్రా**ర్థన చేయుట నా ధర్మం - ప్రేమ నొసంగుట నీ ధర్మం
నమ్మి భజించుట నా ధర్మం - నాకము జూపుట నీ ధర్మం



**ప**రమ పురుష సనాతనా పాప వినాశా
పరమాత్మా భక్తనుతా శ్రీగిరి నిలయా

**వి**ష్ణువుగా కొల్చినా శివుడని భావించినా
శివకేశవ విభేదం లేని దైవమా
వంతబాపి శాంతిగూర్చు వరద సన్నుతా

**రా**మునిగా పాడినా - కృష్ణుడువని వేడినా
రామ కృష్ణులెవరైనా నీవే కావా
రక్షించే నరకేసరి రమణా నీవే -

**ప**దము బట్టి ఏడ్చినా పాటలే కూర్చినా
ప్రసన్నుడవు నీవెగా వరదాన శీలా
పరమ పదము ప్రసాదింపవా - పరాత్పరా
పరదైవం నీవేనులే

**పు**ణ్యచరిత పురుష శ్రేష్ఠ వేంకటేశా
పూజ్య చరణ పూర్ణ తేజ వేంకటనాథా

పూర్ణ కృపా సాగరా
ప్రేమ సుధా నిలయా

**జ**గమంతా నీ దయ జనమంతా నీ వారం
ఖగవాహన నీ భక్తుల వినతులు వినవయ్య

జగదాధారా
జగన్నాయకా

**బా**ధలతో బ్రతుకీడ్చే బహు దీన జనులం
భరియించే శక్తిలేని వారలం అభాగ్యులం

భవరోగ నాశకా
భక్త పాలకా

**అ**నుగ్రహం ఆశించే ఆశలేని వారలం
అనుక్షణం ఆత్రంతో అర్థించే వారలం

అమరాధిపుడవు నీవేగా - అనంతా
అంజనాద్రీశుడవేగా



**ర**క్షమాం ఓ రమా వల్లభ రక్షమాం రక్షమాం
దివ్యపురుషా తిరుమలేశా రక్షమాం రక్షమాం

**భు**వన బంధు సుధాసింధు రక్షమాం రక్షమాం
పుణ్యపురుషా పురుష శ్రేష్ఠా రక్షమాం రక్షమాం

**ప**రమ పావన పాపహరణా రక్షమాం రక్షమాం
పరంజ్యోతి ప్రత్యగాత్మా రక్షమాం రక్షమాం

**జ**గత్కారణ జగద్రక్షా రక్షమాం రక్షమాం
జగజ్జ్యోతీ జగజ్జనకా రక్షమాం రక్షమాం

**భ**క్తపాలక బంధరహితా రక్షమాం రక్షమాం
భాగ్యదాతా అభయ దాయక రక్షమాం రక్షమాం

**శో**క నాశక లోక పూజిత రక్షమాం రక్షమాం
నరక ధ్వంసక నాక పాలక రక్షమాం రక్షమాం

**అ**ందరి లోపల అంతర్యామి
అణువణువున గల అనంతమూర్తి
నీవే శరణం నీవే స్మరణం
సర్వేశ్వరా ఓ పరాత్పరా -

**లో**కపు చీకటి కావల వెలిగే
లోపలి చీకటి లోపల మెరిసే
లోకేశ్వరా లోకాల నేలే శ్రీశా
ఓ శ్రీనివాసా నారాయణాద్రీశా -

**ప్ర**ణవ నాదమున మూలం నీవే
ప్రకృతి లోపల చేతన నీవే
సకల చరాచర సృజన కారకా
సర్వము నీవే సర్వాధినేతా -

**మ**ంత్రము నీవే మహిమయు నీవే
మానవ జీవన గమ్యం నీవే
జనన మరణముల చక్రం నీవే
జన్మ కర్మలకు జాతక కర్తవు
లోకేశ్వరా
లోకాతీతా



**శ్రీ**గిరి మందిర సుందరా
శ్రితజన పోషక శ్రీ రమణా
గిరిధర సురవర కరివరదా
నిర్గుణ సద్గుణ నిరంజనా -

**స**ర్వశ్రేష్ఠుడవు సర్వేశా - శ్రీనివాసుడవు శ్రీశా
మోదకారకా మహోన్నతా - ఖేద నాశకా కమలేశా

**అ**నాథ రక్షక అఖిలాత్మా - అమృతాంతరంగా అమరేశా
అనంత మోహన విశ్వాకారా - ఆది దేవుడవు అంతర్యామి

**జ**నగణ సేవిత జగదీశా - జగద్విధాతా జన ప్రియా
శాంతాకారా సిరివల్లభా - శాంతి ప్రదాతా అచలేశా

**నీ**వె నిత్యుడవు నిఖిలాత్మా - సత్య స్వరూపా సర్వేశా
ప్రణవ స్వరూపా పరమాత్మా - ప్రసన్న మానస శ్రీరంగా

**కా**రణ కారణ కంజాక్షా - కలి దోష హరణా కృష్ణా
నారాయణా హరి - నమో నమో -

బ్రహ్మ స్వరూపం పరబ్రహ్మ స్వరూపం
విష్ణు స్వరూపం వేంకటేశు రూపం
పుణ్యప్రదం - పూజనీయం

**మా**నవులకు మంచి చేయు మహితరూపం
దేవతలకు పూజనీయ దైవ స్వరూపం
మానవులకు జేజేలకు మహిత రూపం

**మ**నసులోన మరువలేని మానవ రూపం
నగవులు చిందించునట్టి నవ్యరూపం
సుఖముగ కలలందు నిల్చు సుందర రూపం -

**శం**ఖు చక్రములతో నది శాంత రూపం
**ఊ**ర్ధ్వపుండ్రముల మోముతో మోక్షదాయకం
**అ**భయ హస్త ముద్రతో అనంతు రూపం

**ధ**గధగమని మెరయు మకుటధారి స్వరూపం
కాసుల హారాలతో శ్రీశుని రూపం
తలపులతో తళ్ళుమనే ధర్మస్వరూపం

**క**న్నులలో నిండిపోవు కాంతి స్వరూపం
దీనులను బ్రోచుటకు దివ్య స్వరూపం
ఉద్ధరించుటకు సిద్ధం ఉన్నత రూపం

**శాం**తి మదిని నింపుటకు శాంతరూపం
నిఖిల జగతిలో వెలసిన నిర్మల రూపం
కడదాకా కాపాడే కరుణ స్వరూపం



**శ్రీ**కర భవహర శుభంకరా
శ్రిత జనరక్షక శ్రీశానమో

**క**ల్మషహరణా కరుణాభరణా
ఆశ్రిత శుభచరణా -
అమృత హృదయా అభయంకరా
ఆనందసారా నమో నమో

**అ**మోఘ మహిమల శక్తియుతా
అరవింద లోచన అనంతరూపా
సనకసనందన మునిజనవందిత
సద్గురు దైవమ సనాతనా -

**బం**ధ రహితుడవు ధర్మ నిరతుడవు
భాగ్య విధాతా నమో నమో
సద్గుణ నిర్గుణ సనాతనుడవు
నిరంజనా నమో నమో -

**లే**రు లేరు నా కెవ్వరు లేరు
ఉన్నది నీవొక్కడవే వేంకటనాధా

**అ**డుగడుగున కోరికలే అడ్డగోడలు
దిన దినము సుఖాలకే మనసు మొగ్గును
సుఖ మొక్కటియును నిలువదేలనో -
సుఖశాంతుల కెపుడైనా నీవే కదా

**మ**నసున నిలకడ పోయె స్థిరమే లేదు
కొమ్మలపై కోతిలా తెలియదు ఆ తీరు
వాలు వైపు వాగులా నీ వైపే తిప్పుకో
పాల వలె నిర్మలముగ పరమాత్మా ఉంచుకో

**ఆ**శలన్ని అంబరాన హంసవై విహారం
అదను తప్పి బ్రతుకంతా ఆశ్వంలా సాగు
అర్థం పరమార్థం నీవె ఇక సర్వం
అంతా నీ దయపైనే స్వామీ ఆధారం



**నీ**వే నీవే పరమాత్మ
నిన్నే నమ్మెను జీవాత్మ

**ద**యా సాగరా ప్రేమ స్వరూపా
దామోదరా శ్రీ వేంకటేశా
సందర్శనమే సుర భోగం
సన్నిధిలోనే శుభయోగం -

**నీ**వే నిత్యం నీవే సత్యం నీవే శాశ్వతం
నీవే సర్వం నీవే పర్వం నీవే నాదవినోదం
నీవే ప్రణవం నీవే శ్రేయం
నీవే నీవే నిర్మల తత్త్వం

**లే**దోయి నీకారంభం లేదు కదా అంతం
నీవే కాదా ఆశ్రయం నీవేగా అనంతం
నీకే మానస మందిరం నీకే ఆరాధనం -

**అ**ణువున దాగిన అనన్య శక్తివి
అంతట నిండిన విశ్వరూపివి
బాపుము తీరని నా ఆర్తి
నిలుపుము నీకున్న కీర్తి

**ప్ర**భో శ్రీనివాసా ప్రణామాలివే
ప్రసన్నము కావా దయాసాగరా

**ని**ను నమ్మి వేడేము నిజ దైవమా
నీ ప్రేమ కోరేము నిఖిలేశ్వరా
బ్రతుకీడ్వ లేమోయి భవనాశకా
భారమ్ము నీదింక భగవానుడా

**జ**న్మన్నదే మాకు దుఃఖానికా
మమకార బంధాలు కుమిలేందుకా
సుఖమన్నదే శాశ్వతము కానిదా
అది నీ విలాసమ్ము కాదందువా

**వ**లదింక వలదోయి ఈ జన్మలు
వలదోయి పాపాల వల చిక్కులు
మాకేల ఈ కర్మ మరుజన్మలు
మనిషిగా వెలసిన మహిమాన్విత

**ని**రతము నీ రూపమే తలచినా
నిత్యము నీ నామమే పలికినా
కనికరము రాదా తగనివారమా
వినిపించుకున్నావ విభో శ్రీహరీ



**వేం**కటనాథుడు నీవంటారు
విన్నాణముగా విన్నా స్వామీ

విశ్వ విధాతవు నీవంటారు
విష్ణువు జిష్ణువు భక్త సహిష్ణువు

**చ**రా చరముల సృజన కారకా
సకల జనాలకు జనకుడు నీవే
అణువు అణువులో ఒదిగిన నీవే
అనూహ్య అనంత మహిమల మణివే -

**జ**న్మలు కర్మలు నీ హస్తగతం
నర జీవితములు నీ స్వాధీనం
వసుధకు మము పంపినది నీవెగా
రమ్మని పిలచిన తిరుగు ప్రయాణం

**యో**చన నీదే యోగం మాది
అంతయు కాదా నీ చిద్విలాసం
ప్రతి కదలికలో కడదాకా
నీవే నీవే కాదనగలవా

నిను దెలియుట ఇక ఎవరి తరం
తెలుసనుకుంటే అది అజ్ఞానం

సర్వాంతర్యామి - నాలో అంతర్యామి
ఏదీ తెలియదు ఎన్నటికీ
ఎరిగింతువా ఏనాటికి

**మ**హిలో నీవే మహిమలు చూపే మాధవా
మాలో నమ్మిక పెంచేవు - మర్మం తెలుపక ఉంచేవు
ఇహమే మరపించు - అహమే తొలగించు

**మా**యను చీల్చే మహాశక్తివి
మార్గం చూపే మహావిష్ణువు
మౌనం వలదయ్యా - మాకిక వెలుగీయవా
పాప వినాశక కేశవ గోవిందా

**అ**గమ్య గోచర జీవితయానం
అంతం లేనిది సృష్టి విచిత్రం
అర్థం తెలుపుమయా - పర
మార్థం చూపవయా - మాధవ లోకేశా



**క**డలి తరంగ మృదంగం - సెల
యేరుల వీణా నాదం
శుక పిక గళాల గీతం - శ్రీని
వాసునికే సంగీతం -

సంగీతం - సంగీతం
ప్రకృతి సర్వం స్తుతి గీతం

**నిం**గి రంగమున నీలి మేఘముల యవనికలు
మెరపుల చంచల విద్యుద్దీపాలు
మయూర నర్తకి నాట్య వినోదం
వేంకటేశునికి వేడుకలు

**చీ**కటి పొరలే తొలగి వెలుగుల వేకువ కలిగి
ఉదయభానుడే ఎగసి చిరు చలిగాలులు కదలి
వేంకటేశునికి పలికె చక్కని సుప్రభాతం
శ్రీగిరి నిలయునికి చిరునవ్వుల సుప్రభాతం

**పూ**ల బాలలే లేచి పుప్పొడి దోసిట పోసె
సుమదళ పరిమళ విందులు
కొమ్మల ఊయల ఊతలు
తుమ్మెద సన్నాయి పాటలు
వేంకటేశునికి వాద్యాలు - తూర్య నినాదాలు

**అ**ందరి గుండెల బాధలు బాపే అమృత గోవిందా
అందరి బ్రతుకుల పండుగ నింపే అయ్యా గోవిందా

**క**లియుగ జనులకు కలతలు కూల్చే కేశవ గోవిందా
కరుణామృతమే కొల్లగ జల్లే కమలాక్ష గోవిందా
తామసమణచే తండ్రివి నీవే శ్రీహరి గోవిందా
శాంతము గూర్చే శాంతమూర్తివి శాశ్వత గోవిందా

**అ**భ్యాగ జీవుల ఆశవు నీవే అచ్యుత గోవిందా
కోర్కెల తీర్చే కోమల రూపా శ్రీకర గోవిందా
ఊహలకందని ఉల్లస మిచ్చే ఉపేంద్ర గోవిందా
శ్రీగిరి నిలయా చింతలు బాపుము శ్రీధర గోవిందా

**అ**హంకారమే అంతము చేసే అనిరుద్ధ గోవిందా
నేనను భావం నాశము చేసే నారాయణ గోవిందా
మా మమకారం మాయం చేసే మాధవ గోవిందా
ప్రేమను పంచే పెన్నిధివో ప్రద్యుమ్న గోవిందా

**అ**జ్ఞానంలో అంధులందరు అనంత గోవిందా
జ్ఞానము నిచ్చే గీతాచార్య జనార్ధన గోవిందా
ముక్తి మార్గమును చూపే దేవా ముకుంద గోవిందా
పరమపదింపగ దరిజేర్చే ఓ పరంధామ గోవిందా



**వే**లుపు ఎవరైనా పరమాత్ముడు ఒకరేలే
వేదవేద్యుడు వెన్నుడు వాసుదేవుడితడే

**ర**ఘుకుల తిలకుని ప్రార్థించిన
ద్వారక నిలయుని పూజించిన
ఇరువురు ఒకటే ఆ శ్రీహరి
అతడే వేంకటనాథుడు

**న**రహరి రూపుని కొల్చినా
వరాహరూపుని వేడినా -
ఇరువురు ఆ నారాయణుడు
అతడే వేంకటనాథుడు

**వా**మన రూపుని వేడినా
కూర్మ రూపునే ప్రస్తుతించినా
ఇరువురును వైకుంఠవాసుడే
అతడే వేంకటనాథుడు

అతడే శ్రీగిరినాథుడు
అతడే శ్రీనివాసుడు

**నా** హృదయం నవ కమలం - అది
నారాయణా నీ కంకితం

వాడనిది వాడి పోనిది
నీకై నీకై దాచినది

**నా** హృదయం నవాలయం
నీకై నిల్చిన దేవాలయం
పూజలతో సేవలతో
నిన్నలరించే దేవళం

**నా** హృదయం నవ్య ఫలం
నిత్యం నీకది నైవేద్యం
అది మధురం అపురూపం
నీ ఆనందం నిదర్శనం

**నా** హృదయం నవవాద్యం
మ్రోగిన పలుకును నీ నామం
రాగంతో లయగతితో
సాగే గీతం సంగీతం

**నా** హృదయం కర్పూరం
నిత్యం నీకే నీరాజనం
వెలుగులలో నీ వదనంలో
శాంతి ప్రేమలే దర్శనం



**నా** ఎద వాకిట నిలచిన భావన
నీవే నీవే నీరజ వదనా
లోనికి రావోయి రమణా
లోగిలి నీ దోయి లోకేశా

**స్వా**తి వానగా నీ రాకకు నే
అదను కాచితిని ఎదురు చూచితిని
నిండు పున్నమై నింగి చంద్రమై
రావా రావా రమా వల్లభా

**చీ**కటి నిండిన ఎద మందిరమున
నీ వున్నప్పుడే నిజమగు కాంతి
ఉదయ తేజమై ఊపిరి విలువై
రావా రావా రాజ లలామ

**ని**న్నెద నిల్పుట నీతో మనుట
నిజముగ నా జన్మ ధన్యం
మెరపు తీగలా మేని కాంతితో
రావా రావా రసరమ్య గుణధామా

**మా**నస మందిర సుందర రూపా
వరదా వందన మోయీ
మాధవ వందన మోయి

**నీ** విచ్చినదే నా ఈ దేహం
నీ కల్పనయే నా ఈ ప్రాణం
నిన్నే తలచి నిన్నే పిలచి
నిన్నే కొలిచితి నోయి -

**మం**దిర మందున మరువని రూపం
మా బ్రతుకులలో అమృతవర్షం
ఇహపర సాధన అహమును బాపగ
ఇల వేలుపుగా వీడకు మోయి

**స**కల రూపములు నీవే నీవే
అసలు దైవమును నీవే నీవే
మదిలో మెదలిన మాయని రూపం
మంగళ గీతిక నీకై గానం



**స**త్య స్వరూపుని కొలువండి
నిత్యం భజనలు చేయండి
వేంకట రమణుడు కలియుగ దైవం
సంకట హరణుని దయ పొందండి

**గో**విందా యన గొడవలు తొలగు
గోపాల యన కోర్కెలు తీరు
గోవిందునితో బంధము పెరుగు
కొలది కొలదిగా కర్మే తరుగు

**క**రుణామయుడే కమలాకాంతుడు
ప్రేమకు పెన్నిధి పురుషోత్తముడు
అతని రూపులో అదె దైవత్వం
నామం కాంచిన నరక వినాశం

**వే**డితిమంటే వెన్నగ కరగు
పాడితిమంటే పాపం తొలగు
మోకరిల్లితే మోక్ష సుఖాలు
మధుర మాధవం కావా బ్రతుకులు

**మ**ధురం మధురం మనవోహరం
మధురం వేంకటనాథుని సర్వం

**మ**ధురం గిరులు మధురం తరులు
మధురం శిలలు మధురం సెలలు
మధురం ధారలు మధురం దారులు
మధురం తలపులు మధురాతి మధురం

**ఎ**డనెడ తరులను విహగాలు మధురం
లతలే మధురం విరులే మధురం
ప్రశాంతి మధురం గాలులు మధురం
గాలికి కదలే పూరెమ్మ మధురం

**గి**రి పై సకలం మధురం మధురం
గుడి గోపురమే మధురం మధురం
గుడి ప్రాకారం మధురం మధురం
గుడిలో దైవం మధురాతి మధురం



**పా**డన శ్రీపతి పాడన స్వామి
పాటలు నీ పైన నే పాడనా

అగణి లీలల బొగడుచు లోలో
చాలను భావన రాకనె నాలో -

**సృ**ష్టి సర్వమున శక్తివి నీవే
కైమోడ్పు లివే ఓ కేశవా -
కారుణ్య సదనా కరివరదా విభో
వినతులు వినవోయి విశ్వాత్మకా -

**అ**నంత మహిమల అమృత మానస
ఆదిశక్తికే ఆధారముగా -
ఆత్మార్పణ ఇదే అనంగ జనకా
ఆత్మశాంతికే కారణ రూపా -

**క**లిలో ఇలలో ఇడుములు బాపే
తలలో ఇంపైన సర్వాత్మకా
తలచిన చాలును తగు మాత్రంగా
తగు అనుభూతుల- మల్లెలు కొల్లలు

**పా**హిమాం సర్వాత్మకా
పాహిమాం సర్వేశ్వరా
పాహిమాం పాహిమాం -

**సు**ధా కలశం నీదు డెందం
సుగుణ మణి మయ భూషితం
శాంతాకారా శాంతి కారక
క్షీరసాగర శేష శయనా -

**భు**వనమంతా నీ నివాసం
భవ విజయం నీ వినోదం
భావ భరితం నీ విలాసం
బంధురము నీ శక్తి సర్వం

**నీ**దు వీక్షణ క్షమాభరితం
చలత్ చంచల కాంతి పూరం
నీదు తలపే జనహితం
నీకు నిరతం స్వాగతం

**వి**శ్వ రచనకు నీవు మూలం
విశ్వమంతా నీదు రాజ్యం
విశ్వవ్యాపివి విశ్వధాతా
విశ్వ విదితం నీ యశం -



**భ**యము లేదు మనకు - శ్రీహరి
దయ ఉండే వరకు
వేంకటాద్రిపై వేంకటేశుడై
నారాయణుడే నరుల బ్రోవగా -

**అ**భయ ముద్రలో వామహస్తం
ఉద్ధరించుటకు దక్షణ హస్తం
దినదిన గండపు నిండు బ్రతుకులో
దిక్కై తానే చూచే దేవుడు -

**అ**మ్మగ ప్రేమను చూపే వాడు
అయ్యగ తన కృప పంచే దేవుడు
హితుడు స్నేహితుడు తానౌతాడు
సన్నిహితంగా తానుంటాడు -

**కు**లగోత్రాలతో పనియే లేదు
కుటిలత చూపిన వేరౌతాడు
సద్గుణ నిర్గుణ సర్వేశ్వరుడు
సకలము తానై ఉండేవాడు

**మ**హిమల నెన్నో చూపేవాడు
మన సమస్యలే తీర్చేవాడు
నిత్యానందము నిచ్చేవాడు
సత్యము తానని చూపేవాడు

**నీ** సృష్టి చిత్రం శ్రీశా విచిత్రం
చిత్రం విచిత్రం - చిత్రం పవిత్రం

**గ**గనం విశాలం ఘన విస్ఫోటం
గ్రహ సంచారం వినలేని రావం
చిత్రాతి చిత్రం - చిత్రం విచిత్రం

**భు**వనాల అందం భూమాత చందం
ఈ భువిని నీ రచన ఇంపౌను - మోదం
చిత్రాతి చిత్రం - చిత్రం విచిత్రం

**ఆ**కాశ నీలం శశికాంతి కిరణం
ఉదయాద్రి శిఖరం ఉదయించు బింబం
చిత్రాతి చిత్రం - చిత్రం విచిత్రం

**కా**లాల మూలం నీవందు సర్వం
శైలాగ్ర నిలయం లీలా వినోదం
చిత్రాతి చిత్రం - చిత్రంవిచిత్రం

**న**రజాతి నైచ్యం కలికాల ధర్మం
నర రూపమున నీవు గుడినున్న వైనం
చిత్రాతి చిత్రం - చిత్రంవిచిత్రం



**గ**గనాల పయనించి విహరించు నెవరో
భువనాలు సృష్టించి పాలించు నెవోరో-
ఇంకెవ్వరు వారింకెవ్వరు
వేంకటనాథుడే వేరెవ్వరు -

**భు**వి సర్వమున నిండి భువిలోన తానుండి
బంధాలు సరిజేసి భాగ్యాలు పండిచు నెవరు -
వారెవ్వరు ఇక వేరెవ్వరు
అలమేలు విభుడే ఆ శ్రీహరి

**క**రుణెంతో ఒలికించి కన్నీరు తుడిచి
కడదాక బ్రతుకున కాపాడు నెవరు
వారెరవ్వరు వారింకెవ్వరు
ఆ శ్రీనివాసుడు అలమేల్పతి -

**చి**రునవ్వు లొలికించి ఆనంద మందించి
ధరలోన ధర్మాన్ని కాపాడు నెవరో
వారెవ్వరు ఇక వేరెవ్వరు
కమలేశుడే కద కంజాక్షుడు

**ప్రా**ర్థింప మొరవిని పాలించునెవరో
పాపాలు కడజేర్చునది ఎవ్వరో
వారెవ్వరౌను వేరెవ్వరౌను
శ్రీగిరి నిలయుడు శ్రీదేవుడే -

**శ్రీ**నివాసుని కరుణ ఉంటే
సిరులు మనకిక కురియవా
అతని ప్రేమకు పాత్రులైతే
బ్రతుకు సర్వం మారదా -

**అ**తని బంధము అందము
అందమున ఆనందము - అది
అణువు అణువున తనువు లోన
అమర నాట్యము చేయదా

**అ**తనికై నీ తపన ఉంటే
తప్పులన్నీ తెలియవా
తప్పు తెలసిన మనసు క్రుంగి
శ్రీశు శరణము కోరదా

**అ**తడె బ్రతుకున భాగమైతే
అతని వీడుట సాధ్యమా
అతడె నిత్యం నీకు వేల్పై
నిన్ను కాచుట భాగ్యమేగా -

**భ**క్తిలోన నీవు పెరిగిన
భాగ్యమే కాదందువా
దేవుడే నీ దరికి రాడా
దయామృతమే చిలుకడా



**వే**ంకటాద్రి నిలయుడు కాదా మన జనకుడు
అతడె హితుడు ప్రాణ సముడు
సఖుడు విభుడు సర్వము

**అ**తడె పరమ జ్ఞానము అతడె పరంజ్యోతి
అతడె కరుణ అతడె ప్రేమ అతడె శక్తి భక్తి
అతడె దాత - ప్రసాదించు జీవన్ముక్తి

**అ**తడె పతిత పావనుడు అతడె సనాతనుడు
అతడె సత్యరూపుడు అతడె నిత్య సుందరుడు
అతడె కాల మతడె మూల మతడె ప్రణవరూపుడు

**అ**తని ఎరుక జ్ఞానము అతని నామపానము
అతడె సుగుణ బ్రహ్మము అతడె విశ్వరూపము
అతడె జగతి అతడె ప్రగతి అతడే సుగతి

**ఆ** శ్రీనివాసుడు అందరివాడు
ప్రతి భక్తునికి స్వంతమైనాడు

**ఎ**వరి దేవుడు వారికే స్వంతము
ఎవరి బంధము వారిదే నిత్యము
నీది నాదను వాదమే నిజము కాదా
నీ తీరు నా తీరు ఏదైన వేరు -

**నీ** దేవుడే నీకు నిజమనుట సత్యం
నా దేవుడే నాకు నావాడు నిజము
నీకైన నాకైన ఆ దేవుడే
నీకును నాకునూ వేరుగా తోచు

**గో**పికలతో నున్న గోవిందు డొకడే
ఒక్కొక్క నారికే ఒకడా మురారి
ఎవరి లోకము వారిదే -
ఎవరి రూపము వారిదే -

**అ**న్నమయ్యకు దైవమా దేముడే
తిరుపతమ్మకు కూడా ఆ వేలుపే
వెంగమాంబే కాని వేరెవరు కానీ

ఎవరి తీరున వారి అనుభూతులు
భక్తి లాహిరిలోన పరవశించారు



**శ్రీ** దేవుని భజనం - అది భవభయ హరణం
కలిగించును మనలో అది సమభావన
కామిత మీడేర్చునదే దివ్య దీవెన

**శ్రీ**రమణా శ్రిత చరణా కరుణా భరణా - అని
సుగుణాలను కీర్తిస్తూ పాడే గీతం
పదిమందీ పలకాలి - పాడి వేడుకోవాలి

**మ**దిలోని గదిలోన శ్రీపతినే నిలపాలి
ఏ యోచన లేకుండా ఏకాగ్రత పెంచాలి
కనులు మూసి అదే పనిగ దేవుని ధ్యానించాలి

**లో**లోన మెలకువలో పుణ్య చింతన
మదిలోన ఆ చింతన మధుర భావన
మనలోన కలుగదా పరివర్తన
మనలకు కానేరద శుభదీవెన

**శ్రీ**శుని నమ్ముకొని
శ్రీశుని తలచుకొని
అతని నామమే జపించండి జపించండి తరించండి

**అ**తడే పరదైవం
అతడే వరరూపం
అతడే అతడే దైవమని
భజించండి భజించండి తరించండి

**ర**మణుని కృప ఉంటే
ఏ బాధ లేకుంటే
అతడే అతడే అతడే దేవుడు
పాడాలి జనమంతా తరం తరం నిరంతరం

**గో**విందా అనగానే
కొడిగట్టు కష్టాలే
'కేశవా మాధవా మధుసూదన' అంటే
మనకే కైవల్యం కదా ఏల సందేహం



**చ**క్కనిది చక్కనిది ఒక్కటున్నది - అది
చిక్కితే బ్రతుకే సుఖ స్వప్నమన్నది -
ఏమది ఏమిటది ఏమిటది
అదే వేంకటాచలపతి ప్రేమ పెన్నిధి -

**నీ** డబ్బుల గాలానికి చిక్కనన్నది
అహంకారమే ఉంటే రానన్నది
మదమన్నది నీకుంటే పొందవన్నది
దాసోహం అంటేనే దక్కు నన్నది -

**చే**సిన పాపాలకె ఏడ్వమన్నది
చెడు పనులు ఇకమీద చేయకన్నది
మదిలోని కుళ్ళునే కడగమన్నది
మంచినే నీలోన పెంచమన్నది

**ని**జమైన నీవాడు శ్రీహరన్నది
నిన్ను సదా కాచేది ఆతడన్నది
భక్తితో శ్రీదేవుని కొలువమన్నది
శ్రద్ధతో శరణాగతి చూపమన్నది

**వేం**కటేశునే మనసున వేడమన్నది
గోవింద నామ జపం చేయమన్నది
ప్రాణికోటికే ప్రేమను చూపమన్నది
అప్పుడే పూర్తిగ తను దక్కునన్నది

**మం**గపతికే జీవితం
చేయలేవా అంకితం
ఆతడే శ్రీ తిరుమలేశుడు
ఆతడేగా జగన్నాథుడు

**ఆ**తడే ఈ జగత్సర్వం
అతని హృదయం కృపా సంద్రం
అతని పాదం పూజనీయం
అతడె నీకిక కామితం

**జ**న్మనిచ్చిన దేవుడతడే
కర్మ కడిగే స్వామి అతడే
బ్రతుకు నడిపే దేవుడతడే
మరణ మావలి తీరమతడే -

**జ**గతి నడిపే దేవుడతడే
జ్ఞాన మిచ్చే దేవుడతడే
జనుల నెపుడును కాచువాడు
జాలితో మననేలు వాడు

**పా**పులకు క్షమ చూపు దేవుడు
లోపములు సరిదిద్దు దేవుడు
మముక్షువునిగ మార్చగలడు
మోక్షమే నీకీయగలడు-



**భ**క్తిని తేలించు భావాలతో నిండి
భుజగ శయనునే వేడండి

జయ జయ జయ జయ జయ జయ జయహో
జయ జయ జయ జయ జయహో శుభాంగా

**గో**విందా గోవింద గోవింద అంటూ
గోవింద నామం జపియించండి
మరచిపోలేని మాధవుని కరుణ
మనపైన కురిసేన మరుజన్మ రాదండి - జయ జయ

**దే**వుని కళ్ళను చూడండి
దేవకాంతులే కనరండి
ఊర్ధ్వపుండ్రమును చూడండి
ఉన్నత లోకాలు దర్శించండి - జయ జయ

**మం**ధర ధరుడే మనకు రక్షకుడు
మకుట దర్శనం మన పాపహరణం
ఆనంద నిలయుడు అందరివాడు
అందరందరికి అందే వాడండి - జయ జయ

**భ**క్త పరాధీనుడు శ్రీనివాసుడు
కలి బాధా విమోచకుడు కమలేశుడు
వేంకటాద్రి నిలయుడు
వేణుగాన లోలుడు -

**క**నుల చూపుతో కలియుగ బాధలు తొలగించు
కరములు జోడించితే కరుణే కలుగు
పదములపై పడిన చాలు పోవును పాపం
పూజ చేసి వేడితే పుణ్యం ప్రసాదం

**ఆ**పద మొక్కుల వాడు చిక్కులు తీరుస్తాడు
అడ్డంకులు తీసివేసి ఒడ్డున పడవేస్తాడు
కొంగుబంగారం కద కోనేటి రాయుడు
కొండంత అండ అతడు కొండమీది దేవుడు

**భ**క్తిని వ్యక్తం చేస్తే భగవంతుడు
శక్తిగ నువ్వు నమ్మితే బలవంతుడు
యుక్తులకే ఆతడు నీవాడు కాడు
ముక్తి కోరి ఆతడినే శరణు వేడు



**స**ర్వం విష్ణుమయం - ధరలో
సకలం హరి నిలయం
విష్ణు సృష్టి కద ఏదైనా - జిష్ణు కరుణ కద ప్రకృతిలో

**దా**హం తీర్చగ నీరుందంటే దామోదరు దయ కాదా
ఆకలి తీర్చే పంట ఫలాలు అనంతు దయగా నమ్మండి
నీడకు తరువులు నివాస గృహములు
నీరజాక్షుని కృపగా మదిలో నమ్మండి నమ్మండి

**మే**ఘం వర్షం కురిసిందంటే
మెండుగ జలమే పారిందంటే
పంటపొలాలు కలకల లాడి
ఆహారం మనకమరిందంటే
అంతా ఆతని ప్రేమే అంటే - నమ్మండి నమ్మండి నమ్మండి

**ఎ**ండలు కాసిన వెన్నెల కురిసిన
చల్లని గాలులు వీచేయన్నా
కాల ప్రవాహం గ్రహాల గమనం
సర్వం శ్రీగిరి నిలయుని దయగా-నమ్మండి నమ్మండి నమ్మండి

**పూ**వులు ఘుమ ఘుమ లాడాయంటే
గుండెలు తేటికి చూపేయంటే
వర్ణమాలగా నిలచాయంటే
దేవుని పూజకు వేచాయంటే
దేవదేవుని కరుణగ ఎదలో- నమ్మండి..... నమ్మండి..... నమ్మండి

**ఎ**ందెందు వెదకిన అందందె కలడండీ
శ్రీ వేంకటేశుడు - శ్రిత భక్తపాలుడు

**సృ**ష్టికి పూర్వం తానున్నాడు
సృష్టి చేసినది తానైన వాడు
సకల చరాచర సృజన కారకుడు
సర్వేశ్వరుడు శ్రీనివాసుడు

**కా**ల గమనమును చేయించువాడు
యుగ చక్రమునే తిరిగించువాడు
ఆరు ఋతువుల అమరికతోనే
హాయిగ జగతిని ఏలేవాడు

**గి**రి పై వెలసిన నారాయణుడు
నరుల బ్రతుకులో వెలుగీయువాడు
కర్మ ఫలమును కరగించువాడు
కైవల్యమును చూపేవాడు

**నీ**లో నాలో నిండినవాడు
సకల జీవులకు సర్వేశ్వరుడు
ఇహపర సాధన కతడే ధ్యేయం
అతడే తలచిన చింతలు మాయం



**ఉ**దయాద్రి వెలుగులో నీ నవ్వులు
ఉదయ రవిబింబాన నీ సొగసులు

శ్రీ రమాకాంతా శ్రితదీనపాలా
సర్వేశ లోకేశ సర్వాంతరంగా -

**చి**రు గాలి వీచితే నీ స్పర్శలు
సెలయేరు గమనాన నీ నడకలు
ముకురాలు విరిసిన నీ ఊసులు
కలఘోషలో నీ గుసగుసలు

**సి**రిమల్లె గుండెలో నీ మానసం
నెలరేని నవ్వులో నిండు నీ వదనం
నిన్నెపుడు తలపించు వని ఆమని
నిఖిలావనిని నీ అందం చందం

**మ**హియంత నవనవోన్మేషం నిత్యం
మహిలోన అణువణువులో నీవె సత్యం
చేతనా చేతపు సృష్టి నీ కరుణే
కనుటలోనే కదా విద్యా జ్ఞానం

**నీ** ధ్యాసలో బ్రతుకు సాగాలి
నీవే నన్నెన్నడైన కరుణించాలి - శ్రీశ కాపాడాలి

**ని**న్నే ఓ వేంకటేశ నమ్మినానయా
నీకు సర్వమర్పించి నిల్చినానయా
నిల్పితి నీ పైన నా విశ్వాసం
నీవే నీవే కదా నాకిక గమ్యం

**ఆ**నందం ప్రసాదించు నాకనునిత్యం
అఖిలేశా నీవేగా ఆనంద నిలయం
ఎన్ని జన్మలెత్తినా నీకే ఆరాధనం
నను నీవే చూసుకో నా జీవితాంతం

**నీ**తో నా ఏకత్వమే వాంఛితం
కడలో నీ పిలుపే నాకిక స్వర్గం
పరచింత అనుక్షణం పాలించాలి
పరమాత్మా నా వినతులు చేయవ సఫలం



**ఇ**ందు గలడు అందు లేడని
సందేహము వదలుకొండి -

వింత వింత రూపాలను వేంకటేశుడు
అంతటను నిండినాడు అఖిలాత్ముడు

**భు**విపై పాదాలతో గగనానికి పెరిగి పెరిగి
రవి మండలము దాటిన త్రివిక్రముడు ఆతడు
సూర్య చంద్రులాతనికి నయనాలై వెలిగే
భూ నభో మండలాలు నిండగల్గు దేవుడు

**ఆ**కసాన విహరించి తారల్లో తేజరిల్లి
పాల పుంతలందు తాను మసలిన ఆ దేవుడు
అణువణువున చైతన్యంగా నిండిన దేవుడు
అన్నిటినీ చూడగల్గు ఆది దేవుడాతడు

**జీ**వులలో జీవుడైన జీవితేశుడు
జీవితాలు నడిపించే సూత్రధారుడు
జీవాత్మకు ముక్తి నిచ్చు పరమాత్ముడు
లోకాలను ఏలే ఏకైక దేవుడు

**వి**ష్ణు పాదం విష్ణు పాదం విమల సద్గుణ శోభితం
కాద మనకది కామితం

**వి**ష్ణు పాదం విష్ణు పాదం పరమపావనం
విష్ణు పాదం విష్ణు పాదం నిత్య పూజితం

**వి**ష్ణు పాదం విష్ణు పాదం ఖేద నాశకం
విష్ణు పాదం విష్ణు పాదం మోద కారకం

**వి**ష్ణు పాదం విష్ణు పాదం మనకదే శరణం
విష్ణు పాదం విష్ణు పాదం శాశ్వతం సంసేవితం

**వి**ష్ణు పాదం విష్ణు పాదం మనకు సర్వస్వం
విష్ణు పాదం విష్ణు పాదం నిశ్చలానందం

**వి**ష్ణు పాదం ముక్తి సాధన ప్రథమ సోపానం
విష్ణు పాదం చరమ గమ్యం మోక్షదాయకం



**క**లలు కలలు కలలు కలలో గిలిగింతలు
కరి వరదుని పదములు
కరుణా భరణాలు -

**క**న్నులకవి అందాల విందులు
మిన్నులలో మిలమిలమను చందమామలు
వెన్నలాంటి వెలుగుల వెల్లువలు
వెల్లువలో నర్తించే మోహినీ భంగిమలు

**కై**లాస కమనీయమౌ మంచు ముద్దలు
కైక సుతుని ఎడదలో తృప్తి తీరులు
పరిపాలన చేసిన ఆ పాదుకలకు అతీతం
విరివనిలో విరిబాలల కన్నా సుకుమారం

**పా**లకడలి అలల తలల విలువలు
అలల పైని తలలు లేపు ఆదిశేషు నీడలు
పాన్పు పైన శ్రీలక్ష్మి పట్టిన భాగ్యాలు
దివిని భువిని కొలువగల్గు దివ్యమైన వింతలు

**శి**లను పొలతిగా మార్చిన చిరు స్పర్శలు
అలల పైన గుహుని నావలో అందాలు
భావనలో భక్తులకు ప్రాణ సమానాలు
దీవెనలా మోక్ష మార్గ దర్శకాలు

**జే**జేలు జేజేలు దేవ దేవునికి జేజేలు
వేంకటేశునికి జేజేలు - వెన్నుడు హరికే జేజేలు

**జ**గన్నాథునికి జేజేలు
జనార్ధనునికి జేజేలు
పద్మనాభునికి జేజేలు
ప్రవిమల మూర్తికి జేజేలు

**గో**విందునికే జేజేలు
ముకుంద మూర్తికి జేజేలు
రమా రమణునికి జేజేలు
రఘుకుల స్వామికి జేజేలు

**ధ**రాధరునికే జేజేలు
దనుజ వైరికే జేజేలు
చక్రధారికివె జేజేలు
శరణు ప్రదాతకు జేజేలు

**ము**రళీధరునకు జేజేలు
మురహరి స్వామికి జేజేలు
పాండవ ప్రియునకు జేజేలు
పరబ్రహ్మ కివె జేజేలు

**శే**ష శయనునకు జేజేలు
శ్రిత చరణునకు జేజేలు
సిరి వల్లభునకు జేజేలు
శ్రీనివాసునకు జేజేలు



**నా** మనసు నీ పదముల నిలువనీవా
నారాయణ నామజపం సాగనీవా

**న**ర నరాన నా తపనే నిండనీవా
నా గుండెను నీ రూపం ఉండనీవా
ఆరాటం లోలోపల ఆగనీవా
పోరాటం జీవితాన తొలగనీవా

**ఆ**లోచనలన్నిటినీ నీ చుట్టూ తిరగనీ
స్వామీ నీ సేవలకై ఆత్రంగా చూడనీ
అనుక్షణం నీ ఉనికిని తెలియ నీవా
ఆనందం కెరటంలా లేవనీవా

**క**లలలో నీ ఆకృతిని కదలనీవా
తలపులలో నీ లీలలు మెదలనీవా
అహర్నిశలు హరిభక్తే అమరనీవా
అఖిలేశా అనుభూతులు నాకీయవా

**నీ** మకుటపు కాంతులన్ని కనుల నిండనీ
నందకాన్ని నాలోని చెడును చంపనీ
గోవింద నామాలే గుండె గుడిని గంటలై
ఆ గంటల గణగణలో బ్రతుకే తెల్లారనీ -

పాపాల కడలిని శాపాల నావై
పయనించుటేనా జీవితం -
లోకాన కాచేది వేరెవ్వరోయి
లోకేశ నీవేగ - శ్రీ వేంకటేశా -

నా వారు ప్రేమతో నాకుందు రేయని
నాకేల వ్యామోహము
నా ఇల్లు నా వన్ని నాకుండు నెపుడని
నాకేల జంజాటము -

మనసులో నిలకడ లేదేల నోయి
మెలకువను సైతం యోచన లోయి
నాకెపుడు ఇంపైన తలపులే నోయి
నాలోన నేనన్న భావమే నోయి -

పెరవారిపై అసలు ప్రేమనేదే రాదు
లోపాలనే వారిలో ఎంచునోయి
నీ ప్రేమతో గుండె నింపేయవోయి
శోకానికిక తావు లేదోయి -

కామాదులకు లొంగి కడగండ్ల పాలై
కలకాల మటులనే కూలనీకోయి
ముచ్చట్లు మూడై అగచాట్లు ఆరై
మురిపించు మాయలో బ్రతకలేనోయి



నిజ మెరిగిన వారె కదా నిను నమ్మెదురు
నిను నమ్మిన వారే కద నీ కొండకు వత్తురు

ఓ తిరుమల గిరివాసా
ఓ వేంకటేశా -

ఎరుగని వారందరికి నీవే ఎరిగించాలి
నిన్నెరిగిన వెంటనే నీ ధ్యాస రావాలి
నమ్మని వారెవరైన నమ్మిక కలిగించాలి
నీ శక్తిని వారెరిగి నీ వెంటనె పడాలి -

పాపంతో జనమంతా పతనమౌతున్నారు
పంతాలు పట్టింపులు దురాగతాలు -
నిదురిస్తూ మేల్కొనే ఉన్నామను తీరు
నీ మహిమను చూపవా జాగృతం చేయవా

మనుషులందరూ నిన్నే మరి మరి సేవించాలి
మతం గతం మరచిపోయి మంచివారు కావాలి
రానీయకు మాకింక కలి మాయలు
రానీవా శ్రీఘ్రంగా కృతయుగపు రోజులు

**వేం**కటాచలేశుడు
శ్రీ శ్రీనివాసుడు -

కోరుకోండి కోరుకోండి అందరు
చేరుకోండి వేంకటాద్రి అందరు

**అ**దొక ప్రభంజనం అదుత్తుంగ తరంగం
ఆపలేరు ఎవ్వరు - అడ్డలేరు ఎవ్వరు
ఆధ్యాత్మిక ప్రకంపనం
ఆగని అకర్షణం

**అ**ది నీలి కలువమాల
అది లేగులాబి బాల
వద్దనేది ఎవ్వరు - వలదనేది ఎవ్వరు
అదే సుధాభాండం - అదే మధుర క్షీరం
త్రాగమనే దెవ్వరు - రుచి మరుగని దెవ్వరు

**అ**ది పవిత్ర క్షేత్రం అది చతుర్వేద తుల్యం
కరుణా ప్రపూర్ణుని కైవల్య ధామం
రంగ రంగ వైభోగ కల్యాణ రంగం
వరప్రదం శుభప్రదం వైకుంఠ ద్వారం



**చి**దానందరూప శివోహం శివోహం
అదే శ్రీనివాసం సదా వందనం

**పం**చేంద్రియ జ్ఞానమే నీవు కావు
మనసు బుద్ధి అహంకార మేమీ కావు
భూమి ఆకాశం నీవు కావు
గాలి నీరు వెలుగేదీ నీవు కావు -

**పా**ప పుణ్య సుఖ దుఃఖము లంటరావు
భయ రాగద్వేషాలు దరికి రావు
మిన్న నీకు ఎవరైన లేని వాడవు
నిన్న నీవె సృజియించుకున్న వాడవు

**అ**రిషడ్వర్గము ఎన్నడు నిన్ను చేరదు
పురుషార్థము లెన్నడును నిన్ను కోరవు
పంచకోశములు ఏవీ నీకు లేవు
పంచప్రాణములు అసలే నీవు కావు -

**ఏ**ది కాని దేదో అదే కదా నీవు
ఏ నాటికి స్థిరమేదో అదే కదా నీవు
జన్మ జన్మాంతరములు లేని వాడవు
నిర్వికార నిర్వికల్ప నిరంజనుడ వీవు -

**బృ**ందావన చందమామ - ఆ వేంకటేశుడు
నందన ఆనందమూర్తి - ఆ శ్రీనివాసుడు

నారాయణ రూపుడు నవ కమల నేత్రుడు
వందనాలు వందనాలు వందలాది వందనాలు

**చే**పలా వచ్చాడు చదవులిచ్చి పోయాడు
కూర్మంగా వచ్చాడు కొండెత్తి పోయాడు
వరాహంలా వచ్చి వసుధను కాచేడు
నరకేసరిగా వచ్చి బాలుని రక్షించేడు -

**ఆ** చిన్ని వామనుడే నా శ్రీనివాసుడు
అలనాటి రాముడే నా శ్రీనివాసుడు
ఒకనాటి కృష్ణుడే నా శ్రీనివాసుడు
తరువాత గౌతమ బుద్ధుడు నా దేవుడు

**వై**కుంఠ పుర ఏలిక ఆ వేంకటేశుడు
శివ కేశవ రూపుడే ఆ శ్రీనివాసుడు
నిత్య నిర్మలాకారుడు సత్యస్వరూపుడు
ఆనంద నందనుడు ఆనంద నిలయుడు

**అ**మ్మలా ప్రేమ చూపు అలమేలు మంగపతి
బొమ్మలాట లాడించే దైవ స్వరూపుడు
సత్త్వ రజస్తమో గుణాతీతుడు శ్రీ దేవుడు
సకల భవన పాలకుడు సనాతనుడు శ్రీశుడు



**ఓ**ం నారాయణా ఓం దీనవనా
ఓం సర్వేశ్వరా ఓం సత్యేశ్వరా

**ఓ**ం మధుసూదనా ఓం శ్రీ మాధవా
ఓం నరకేసరి ఓం లోకేశ్వరా

**ఓ**ం సనాతనా ఓం సంకర్షణ
ఓం ధరాధరా ఓం దామోదరా

**ఓ**ం నిరంజనా ఓం నిరామయా
ఓం జనార్ధనా ఓం జగదీశ్వరా

**ఓ**ం శ్రీ శ్రీధరా ఓం కరుణాలయ
ఓం జగత్పతీ ఓం జగత్పితా

**ఓ**ం పరాత్పరా ఓం దివిజేశ్వరా
ఓం త్రివిక్రమా ఓం పురుషోత్తమా

**వే**డుకుంటే వేంకటేశుడు
కరుణాలవాలుడే  కరగిపోడా

భక్తిలో తేలిపోదాం
భావంలో మునిగిపోదాం

**కం**ఠమెత్తి పాటలలో పరవశించుదాం
కలసి మనం ప్రార్థనలే చేసుకుందాం
పాపాలు ఒప్పుకొని దోషాలు చెప్పుకొని
మన బాధ విన్నవించుదాం -

**దే**వాది దేవునే 'దేహి' అందాం
జీవులను కాపాడే దైవ మందాం

మదిలోని మలినాన్ని
కన్నీటితో కడిగి
మనసులో మంచి నింపుదాం -

**ఆ**నంద నిలయునికి హారతిద్దాం
అందరం ఆతనికి 'జై జై' అందాం

గతమంతా దండగే
భవితవ్యం పండగే
సుఖ శాంతులే పొందుదాం



**చ**ల్లని చంద్రుని అందాలు
చక్కని శ్రీపతి స్వంతాలు
మకుటధారి కవి మరీ మరీ
మనసును దోచే కనువిందులు

**శా**రద రాత్రుల కళకళలు
శ్రీశుని నామాన కోకొల్లలు
శ్రావణ జలదాల జల్లులు
శ్రీశుని ప్రేమ తుషారాలు

**వి**రిసిన కుసుమాల మకరందం
మురారి కరుణకు ఉపమానం
శాంత శీతల హిమాలయం
శ్రీహరి మదిలో అనుగ్రహం

**త**ల్లి జోలలో ప్రేమ ప్రవాహం
శ్రీహరి అభయాన ప్రదర్శితం
కృతయుగ ధర్మ ప్రభావం
కలియుగ దేవునిలో వ్యక్తం

**ఒ**క దీపం వెలిగించుమా
ఒకసారి శ్రీహరి యనుమా

దీపం నీ జీవితాన కాంతి చిందును
నామం నీ మనికిలో హాయి నింపును

**ఒ**క్క పూవు పూజ చేయవా
ఒక్కసారి మనసు నిలుపవా
పూజ నీకు పుణ్యదాయకం
మనసంత దేవాలయం

**ఒ**ళ్ళు మరచి పాట పాడవా
కళ్ళు మూసి తాళం వేయవా
మైమరపే మధుర మౌనుగా
కళ్ళ ముందు కమలేశుడు కదలాడుగా

**ఒ**క్కసారి ప్రణమిల్లవా
ఒక్కసారి ప్రార్థింపవా
ప్రేమంతా ప్రవహించులే
ప్రార్థనకే ప్రసన్నించులే

**శ్రీ**నివాస సర్వం నీవనవా
శ్రీదేవుడే దైవం అనవా
నీవన్నది నిజమని దైవ మెరుగును
నీకతడే రక్షకుడగును



**అ**నంత నామా ఆశ్రిత చరణా
అమృత మానస అలమేలు విభో

**భ**క్త జనప్రియ దీన జనావన
భాగ్య ప్రదాతా పరమాత్మా
దుర్గుణ నాశక నిర్గుణ రూపా
సద్గుణ దాయక సుగుణ స్వరూపా

**స**నక సనంద మునిజన సేవిత
సర్వేశా సర్వ లోకేశా
సకల చరాచర సృష్టి కారకా
సన్నుత వరదా నిరంజనా

**భు**విలో కలియుగ జన సంరక్షక
క్షీర జలధి శయనా శ్రీకర
ధర్మ రక్షణకు మూలాధారా
దనుజ నాశకా ధరాధరా

**నీ**వు కరుణించాలి - ఉనికి ఎరిగించాలి
ప్రేమతో నా బ్రతుకును తీర్చి దిద్దాలి
శ్రీశ దీవించాలి

**నీ** చల్లని చూపులు చిరువెన్నెలవాలి
వెన్నెలలో చకోరమై నే నెగరాలి
నీ మనసే పాలపుంతగా నిలవాలి
ఆ వెలుగుల నేనే మై మరవాలి

**పూ**జలన్ని నీ కోసం - పులకిస్తాను
భజనలన్ని నీ కోసం - భావిస్తాను
ఆటలన్ని నీ కోసం - ఆనందిస్తా
పాటలన్ని నీ కోసం - పరవశిస్తా

**త**ప్పులన్ని మన్నించి కాపాడాలి
తపనెపుడును నీకోసం కలిగించాలి
మంచితో నా గుండెను నింపేయాలి
మహిమలతో నన్నెపుడూ మరపించాలి



**న**ను పాలింపగ నారాయణాద్రీశ
నడచి రావయ్యా నా గుండెలోకి -
నడచి రాగా నీ సేవ చేసి
న వ్యానుభూతిని పొందాలి -

**ని**రతం నాలో నీ వుండి పోవా
నిజమగు సురసీమ అనుభూతి కాదా
అందాల ఆనంద లోకాల తేల్చు
ఆ భోగమే నాకు అమరిన చాలు

**అ**హమంత కర్పూరమై మండిపోగా
ఇహమంత ఇసుమంత ఇక నిలువదోయి
జగమేలు పరమాత్మ ఖగవాహనా
జలజాననా మనసు శాంతింపనీ

**అ**జ్ఞాన తిమిరాలు అణగారనీ
అసమాన భాసము దర్శింపనీ
నీ చెలిమి నాలోన అపురూప భాగ్యం
అదె కలిమి నాకది మేలిమి భోగం

**స్వా**గతం శ్రీనివాస స్వాగత కుసుమాంజలి
అదే నా అభిమతం అదే నిత్య తపనం -

**హృ**దయాలయమ్ములో ఉదయ వేళ శాంతిలో
చంద్రపూర్ణ శోభతో ఇంద్రనీల కాంతిలో

ఇంపుగా కనిపింపవా
ఇది చాలు ననిపించవా -

**గు**డి వాకిలి తుడిచితి తడిగ నీరు చల్లితి
రంగవల్లి వేసితి రసరమ్యం చేసితి

నీ ఆగమనానికి
ఆ శుభ సమయానికి

**గు**డి తలుపులు తెరచితి తోరణాలు కట్టితి
పూమాలను పూనితి పుణ్యపురుష వేచితి

నీ మెడలో వేయాలని
నీ కాళ్ళకు మొక్కాలని

**పీ**ఠమే వేసితి ప్రియునిగ నిను తలచితి
పదముల సడి ఊహలో మైమరచి తూలితి

మధురమౌ అనుభూతదే
మాధవా మరచిపోనదే



**ఫ**లములు తినిపింతును పాలే త్రాగించును
బడలిన నీ పదములను చేతులతో రాతును

చేతనమును మరచిపోదును
మధుర సుప్తిలో పడెదను

**న**న్నేల లాగితివి నీ భక్తిని ముంచితివి
నిను కోరితి రాననకు నిను వేడెదను కాదనకు

ఆవేదన ఆర్పివేయవా
ఆనందంలో ముంచవా

ఛంగు ఛంగున కదలి రావయ్య
రివ్వు రివ్వున సాగి రావయ్య
చిన్ని కృష్ణునిగ చిరు పాదాలతో
కన్నుల పున్నమి పూయగ నీవు -

కన్నెవాగులా పరుగున రమణా
గున్న లేడిలా దూకుచు గోవింద
రావా రావా రాజీవ నయనా -
లేడిగ నే బెదరక - నిలకడగ
వాగుల నన్నుండనీ

చిన్న బర్హిలా నటనల తేలుచు
వన్నె పూవులా విరిసిన రూపై
రావా రావా శిఖిపించ మౌళి
పువ్వుగ నను నవ్వనీ - నెమలి
కన్నుగ నను నిలవనీ -

కన్న తండ్రిలా ప్రేమతో రావా
కన్ను రెప్పలా కావగ రావా
రావా రావా కల్యాణ గుణధామా -
నిను చూచి తరియింపనీ - నీ
ప్రేమతొ నిను పొందనీ



కరుణ కడలిని తేలిపోనీ
కాంతిలోకము చేరుకోనీ
ఎపుడు నాకా పుణ్యతరుణం
ఎన్నడో నా జన్మ సఫలం

జీవితం ఒక గగన యానం
మాయ మబ్బులలోన పయనం
దిక్కు తెలియదు దారి కానం
నీవె చూపుము దిక్కు గమ్యం

అడవి నడిమిని కాందిశీకుని
బడుగు ముదుసలి బాటసారిని
అర్ధరాతిరి దాటెనోయి -
అమావాసే సాగిపోదా

నీదు తేజం చూడలేదు
నీదు ఘనతను వింటినోయి
నన్ను నడుపుట నీదె భారం
వినతి వినవో వేంకటేశా -

**క**న్నుల పొరలను తొలగించు
కాంతుల తలుపులు తెరిపించు
శ్రీశా నీ దయ చూపించు
శ్రీగిరి ప్రభలను కురిపించు

**'నీ** నా' భేదం మరపించు
నిర్మలముగ నా మనసుంచు
లోలో భక్తిని పెరిగించు
లోపాలన్నీ దిద్దించు -

**ని**న్నే నిరతం కొలిపించు
సర్వం నీవని అనిపించు
మాయా మేయం మహియను భావం
మరి మరి నాలో మరుగున పడనీకు

**నీ** నామావళి పలికించు
నిజమేదొ నాలో మెరపించు
సర్వేశ్వరుడవు అనిపించు
అల వైకుంఠం తోపించు



**అ**భయ మీయలేవ అచ్యుత అనంత
అంజలింతునోయి అయ్య వేంకటేశా
ప్రణమిల్లెద నోయి - పరంధామ కనుమ

**ఆ**లసింపకోయి అపరాధ మెంచకోయి
ఆగలేనోయి ఎడబాటు చేయకోయి
పాపినైతి దేవా పతనమైతి నోయి
కన్నతండ్రి వోయి కనికరము చూపవోయి

**బ్ర**తుకు సాగు వైనం బహు ఘోర మాయెనోయి
తీరు తెన్ను లేదె తెరువు చూపవోయి
నదిని సాగు నావ నా బ్రతుకు తీరు దేవ
దరికి జేర్చవోయి దయరాద ఏల నోయి

**వ**యసు ఎంత ఉన్న బ్రతకాలనే ఉంది
జగతి మాయ కాద జన్మ మాయ కాదా
నిన్నె చేరి కొల్చి నీదు ప్రేమ దెలసి
జీవితాంతమందు నిన్నె చేరుకొనగ -

**మ**నవిని వినుమా మాధవమూర్తీ
మరి కరుణింతువొ మరచి విడతువొ -

**మా**యా మానుష రూపా దేవా
మధుసూదన ఓ శ్రీనివాసా
పంతము చేయకు వింతగ చూడకు
ఎంతటి వాడను నీ పరీక్షకు -

**బ్ర**తుకున బంధము లేనివాడను
నమ్మిక నిలువని ఒంటరివాడను
ప్రేమకు నోచని పేదవాడిని
పెన్నిధి నీవని ప్రార్థన చేతును

**నా** చేతలతో నా పలుకులలో
ఆలోచనలో అన్ని వేళలా
దోషము లేకనె దినము గడువదు
బ్రతుకును మార్చే శాంతి ప్రదాత

**న**మ్మిన చాలట నడచి వత్తువట
నరకము నైనా తప్పింతువట
నీటముంతువో పాలముంతువో
నీదే భారం నీవే సర్వం



**మా**నస వీథుల మధురా నగరిని
మాధవ దేవ నీ మధురోరహలలో

నిను కననీవా నను మరువనీవా
శ్రీ వేంకటేశా శ్రితపారిజాతా

**కా**నల యానం కాదా మనుగడ
కడకు గమ్యమే మరుగౌను కద
నీకే ఎరుకిక జీవిత మర్మం
నీలో నున్నవి నిజమగు సౌఖ్యం

**ఆ**శలు తీరని అంతర్వేదన
పాప పంకిలము పోయేదెటులో -
మొర విను మాధవ నీకే తెలియును
మేల్కొనె నేడిక నీకై తహతహ

**క**లలో నీవే కనిపింతువని
మర్మము లేకనె సూచించెదవని
కమ్మని నవ్వులు మనసు నేలగా
ఊహల దేలితి ఉల్లాసంలో

**మా**నసమా మరువకుమా
దేహినిత్యుడు దేహము కాదని
శ్రీనివాసుడే మోక్ష ప్రదాతని -

**మ**మతలు స్థిరమని నమ్మకు నమ్మకు
మనుగడ స్థిరమని నడవడి చూపకు
తన పర భేదము ఎంచకు ఎంచకు
తలపులు ఇలకే పరిమిత మనకు -

**కో**ర్కెలు పెంచకు కొండలు చేయకు
సుఖ దుఃఖాలకు వంగకు లొంగకు
గాలిని దివ్వెగ రెపరెపలాడకు
గంభీరతనే వదలకు వదలకు -

**జ**నన మరణములు భాధాయుతము
జర వ్యాధులతో నరకతుల్యము
ఆగని ఆరని ఆరాటంతో
చింతాక్రాంత జీవిత చక్రం -

**పా**ప కర్మలకు ఫలితం జననం
పరి పరి విధముల పరితాపం
జన్మ కర్మల సాలిగూటిలో -
చిక్కకు నిలకడ సడల నీయకు -



**ప**దములు వదలను పరమాత్మా
ఎదలో దయతో ఏలేదాక -

**క**మలా కాంతా కరుణా వారివి
కాదన గలవా కడకు దారివి
మనసున నిలకడ కూర్చేవాడిని
మాయ వలదయా మధుసూదనా

**చీ**కటి కావల వెలుగులు నీవే
సృజనకు వెలుపల కారణ మీవే
జగతి నాటకపు రచయిత నీవే
ఎటులిక విడతును ఏమని నిలువను

**పా**ప చింతనలు పగిలే యోగం
పుణ్యసీమలో పులకించు యోగం
నీ స్వాధీనం శ్రీ శ్రీనివాసా
అన్నియు నీవని నా విశ్వాసం
నిన్నే కాదని మనలే నోయి -

**వి**డువను నీ పదకమలం
విడువను నీ గుణ గానం
విడువను నీ నామ జపం
విడవనోయి విడువనోయి వేంకటేశా

**మ**రవను నీ ముఖ పద్మం
మరువను బంగరు మకుటం
మరువను నీ తిరునామం
మరువను సుందరరూపం మధుసూదనా

**మ**రువను నీ కనుదోయిని
మరువను నీ కరయుగళిని
మరువను ఆభరణాలను
మరువనోయి నీ ప్రేమను మాధవ దేవా

**మ**రువను నీ ఆలయం
మరువను నీ నవ్యత్యం
మరువను నీ దివ్యత్వం
మరువను నీ వేంకటాద్రి ఇల వైకుంఠం

**మ**రువను పరమాత్మవని
మరువను జన రక్షకుడని
మరువను నా హితుడవని
మరువను అవతార పురుషుడని మంగళరూపా



**నీ** నామ్మసర్మణమే నిశ్చలానందం
నీ కీర్తన గానమే నిశ్చితానందం
శ్రీశా శుభ గుణలోలా
శ్రీనివాస దయాలవాలా

**నీ** భజన భాగ్యమే నిత్యానందం
భావరాగతాళంలో బ్రహ్మానందం
లయ గతులకు నాట్యంలో అమరానందం
మైమరచి ఊగుటలో మహదానందం

**నా**మ స్మరణంలో నాకు నవ్యానందం
నిన్నే భావించుటలో నిర్మలానందం
ఎదను నీకు గుడి చేయుట ఏదో ఆనందం
సదా నీకు చింతనలో సత్యానందం

**భ**క్తితో కీర్తించుట పరమానందం
ఆర్తి మరచి మనుటలో అసలానందం
శక్తిగా ఎరుగుటలో జ్ఞానానందం
ముక్తికై నిను వేడుట ముఖ్యానందం

**ఎ**ంత దయామూర్తివో ఎలా చెప్పను
ఎంత ప్రేమదాతవో ఎలా తెలుపను

అనుభవించి తీరాలి అది భరించి తీరాలి
అంజనాద్రీశా నీ భక్తితో నిండాలి

**ఆ**కాశం నీలమని నేనన గలను
గాలి వీచితే హాయని నేననగలను
రంగు లేని రూపులేని దైవ ప్రేమ తెల్పుటెలా
శ్రీశా నీ కరుణలో గల సుఖమును తెల్పుటెలా

**పూ**లంటే అందాలని నే తెలుపగలను
పూల తేనె తీపియని నేను చెప్పగలను
వేంకటేశ నీ ప్రేమ మాధుర్యత చెప్పుటెలా
నీ దయెంత విశాలమో ఎలా తెలుపను

**మా**టలలో చెప్పలేను మదిలోని భావన
మౌనముగా ఉండలేను ప్రేమ స్వరూపా
చెప్పాలని తపనున్నా పెదవి విప్పలేనయా
చెప్పాలనుకున్నదంత చెప్పుటెలా దయామయా



**నా**కేల నాకేల లోకపు వెలుగులు నాకేల
కన నీవా కమలేశా లోలో వెలుగుల వేకువలు

**లో**కపు వెలుగులు - చీకటి దారులు
లోపలి వెలుగులె - మెలకువలు
లోకపు వెలుగుల మాయ తెరలలో
లోకేశా నిను కనలేనోయ్ -

**చీ**కటి వెలుగులు కల్పించావు
చీకటిలో మము నిలిపేవు
చీకటి అయినా చింతన మరువను
చింతనలో నీ రూపము ప్రాణం

**ని**న్నే తెలిసిన నిన్నే పిలచిన
నీరదశ్యామా నారద వినుతా
నిస్పృహాయతను నీ సహాయమున
నినుగని మురియుదు నిఖిలేశా

**నీ** దయా భారమును మోయలేదీ ఎడద
నీ కృపా వీక్షణము భరియించ లేదోయి
శ్రీనివాసా నీవు విస్తుపోకోయి
ప్రేమ సంద్రము నీవు చాల చిన్నది ఎడద -

**నీ** మేను సర్వము జగమంత వ్యాప్తము
నీ గుండెలో సుధయె నిండు పెను భాండము
ఒక చిన్న బిందువే చిన్న ఎడదకు చాలు
అంత నీ వొలికింప ఆగలేదీ ఎడద -

**నీ** చూపులో కరుణ కాంతిధారై రాగ
వెలుగు కిరణాలన్ని ప్రదరముగ ఛేదించు
నా చిన్న ఎడదకు కిరణ మొకటే చాలు
ప్రబలైనా పెను వెలుగు తాళలేకనె రాలు -

**అ**య్యా నీ కరుణకై అశ్రు చాపినదోయి
అనుభవించే దెటుల కరుణామయుడవోయి
లీల ఎరుగని బాల ఏల తెలియదనేల
శ్రీశ నీ పదముకడ ఎడద పూవై రాల -



**ము**ద్దైన పాదాల ముద్దులాడాలని నా కోరిక
ముద్దు మురిపెము నీవె తీర్చాలిక
నీరజాక్షా నీవు నిరసింపకు
వేంకటేశా నన్ను మురిపించకు

**నా**లోని కోరిక అరుదైనదే
నీకే కోరిక తీర్చే శక్తున్నదే
ఆగలేదీ మనసు అది కానవా
అందుకోవా వినతి అంజనాద్రీశా

**పా**పాల స్పర్శలో పరమాత్మా దేవా
ఆ సుఖము తన్మయము నను పొందనీవా
పద ధూళి పదివేలు అది చాలునోయి
పరమాత్మ ఈజన్మ చరితార్థమోయి

**ప**ద చుంబనంలో పర సుఖమేగా
పరబ్రహ్మా నీవు కరుణించవా
పాపాలను పడగొట్టు పరమామృతం
లోపాలను సరిదిద్దు పంచామృతం

**నీ** చరణ ధూళులే నిత్య నిధులోయి
వేరేల నాకింక భోగ భాగ్యాలు
వేంకటేశా అవే వైభోగ సిరులు
అలమేలు మంగపతి అణిమాది సిరులు

**గో**విందు నామమే గొప్పదగు మంత్రం
నీ రూప ధ్యానమే నిక్కంపు తపము
లేకున్న లేదసలు పరలోక విశ్రాంతి
ఇహలోకమున శాంతి

**నీ** పాటలే పాడి నిను తలవకున్న
నీ భక్తులను కలసి సేవింపకున్న
బ్రతుకంత వ్యర్థమేగా
భరియింప శక్యమేనా ?

**నీ** కథలు వినకున్న బ్రతుకెందుకోయి
నీ రూపకనకున్న జన్మెందుకోయి
నీదు కథలే నాకు వేదతుల్యాలు
నీ రూపమున కందు సౌందర్య లహరులు



**వే**ద ఘోషలు నీకు వినిపించనా
వేదమూర్తిగ నిన్నె వినుతించనా
వేద నాదాలలో నాదమై పోనీవ
వేదమూర్తీ నీదు పద ధూళి కానీవ -

**పా**టలే నీ మీద నను పాడనీవా
పాటలో ప్రతి పదముగా నన్ను మార్చవా
నీ పటమునే వేసి నను మరియు నీవా
పటములో ప్రతి గీతగా నన్ను చేయవా -

**పూ**లతో నిలువెల్ల పూజింపనీవా
పూలలో ప్రతిపూవుగా నన్ను మార్చవా
ఆరతులు నీ కెపుడు అర్పించ నీవా
కర్పూరముగ బ్రతుకు కరగిపోనీవా -

**పా**దాలనే రమణ పట్టుకో నీయవా
పట్టులో పరవశము నన్ను కానీవా
నా సర్వమును నీకె అర్పించనీవా
ఆత్మార్పణము నీకె నన్ను కానీవా

**వ**ద్దు వద్దు ఏ భోగాలు - వేంకటేశ
వద్దు వద్దు ఏ భాగ్యాలు

నీపై నా భక్తుంటే చాలు
నాపై నీ ప్రేముంటే చాలు

**వ**ద్దు వద్దు ఈర్ష్యాద్వేషాలు
వద్దు వద్దు వైషమ్యాలు
మేమంతా కలిసుంటే చాలు
మాకెపుడూ నువ్వే చాలు

**వ**ద్దు వద్దు కుల మతాల కూతలు
వద్దు వద్దు అవినీతి నేతలు
సమైక్యతే మాకుంటే చాలు
సర్వసాక్షి నీ తపనే చాలు చాలు

**వ**ద్దు వద్దు కోరికల జాతరలు
వద్దు వద్దు అత్యాశల ఆకసాలు
నీ పూజా భాగ్యం శ్రీశా చాలు
నీ దర్శన భాగ్యం వేంకటేశ చాలు



**పో**నీ జీవిత శకటం రమణా
పోనీ జీవిత శకటం - నా జీవిత శకటం

కరుణా కటాక్ష మార్గంలో - నీ
చల్లని చూపుల నీడల్లో -

**గ**తుకు దారుల పోనీయకుమా
వాగుల వంకలు రానీయకుమా
మాయల లోయల దిగనీకోయి
కొండలపై కది పోనీయకుమా

**ఎ**త్తు పల్లములు వలదే వలదు
ఎటు వైపున ఆటంకము వలదు
వేగము పెంచి పోనీయకుమా
ఆలసింపక ఆగనీయక -

**పా**ర్థుని అంశ నాలో లేదు
బ్రతుకే రణరంగము కానీకు
గీతా బోధన చేసిన దేవా
నీవే సర్వం నీకే వినతి

**ర**హదారికి అది రానీయకుమా
మార్గ మధ్యమున మళ్ళించకుమా
నీపై ధ్యాసయె చిరు దీపంగా
నిన్నె గమ్యముగ సా.....గనీవా

**ఎ**వ్వరు నావారు లేరు
ఏమందువో వేంకటేశ

ఎన్నాళ్ళు జీవన పోరాటం
ఎన్నాళ్ళు బ్రతుకున ఆరాటం -

**నీ**వే కదా నాకు నిజమైన తండ్రి
నీవే సదా నాకు నిజమైన హితుడు
నన్ను నన్నుగా ప్రేమించు వాడు
నీవొక్కడవె కాద నిదురించు నాడు

**నా** వారుగా నేను భావించువారు
వారెందరున్నా రాలేరు వారు
నన్నంటి నా వెంట నెచ్చోట నైన
నరరూప దైవము నావాడు నీవె

**భా**వికి బంగరు బాటలు నీవే
జీవితము తీయగా సాగనీవా
ఏమని నిన్నింక కోరేది లేదు
దీవెనతో దయ చూపించవోయి - నీ
దయతో నా బ్రతుకు సాగింపవా



**చి**న్నది నా హృదయ నావ - శ్రీశా
చూపించు సరియైన త్రోవ

నా వినతి నీకిదె సతతం
నా ప్రార్థ నిదె నీకు నిరతం

**జీ**వన గంగా ప్రవాహ వేగం
పాపాల పెనుగాలి కూల్చే భయం
నైరాశ్య గ్రీష్మ తపములోని నరకం
అది తాళ లేదోయి చేరదే తీరం

**ఆ** వైపు ఈ వైపు ఆకర్షణీయం
ఆగేస నా పడవ చేరదే - గమ్యం
కామాదులను వారి కాఠిన్య వ్యూహం
కడదాక నా నావ నీ స్వాధీనం

**నీ** దృష్టిలో అది కాగితపు పడవ -
చులకనగ చూడకు తేలుతూ నడువ
నాకున్నది దది ఒక్కటే చిన్న నావ
మునిగెనా తేలదు గుర్తుంచుకోవ

**ఎ**వ్వరికి ఏమౌను ఈ జీవుడు
ఎవ్వరెవ్వరివాడు ఈ జీవుడు

ఎన్ని జన్మల నెత్తె ఈ జీవుడు
ఎవరికై జన్మించె నీ జీవుడు -

**ఎ**ందరికి తండ్రాయె నీ జీవుడు
ఎందరికి తల్లాయెనో జీవుడు
ఎవ్వరికి కొడుకాయెనో - శ్రీశా
ఎవ్వరికి తనయాయెనో -

**క**ర్మతో ముడిపడెన ఈ జన్మ
జన్మ ఎత్తుట కర్మ చేసేందుకా
కర్మ జన్మల మధ్య సతమతము జీవితం
మొదట ఏ కర్మతో జన్మ నెత్తెనోయి -

**ఎ**ందుకయ జన్మలు ఓ శ్రీనివాసా
ఎందుకయ కర్మలు ఓ వేంకటేశా
ఏమి సాధించేను జన్మ జన్మలకు
ఏలనయ జీవులకు ఈ నాటకాలు -



**అ**హం - ఎందుకంత గర్వం
ఏమి చేశానని సాధించానని -

**అ**దే అదే కనుల పొరలు మూయును
అదే అదే అధికుడ ననిపించును
అదే కదా పరులను దూషించును
అదే కదా పాపములను చేయించును

**ఏ**మున్నను జన్మలో నీ విచ్చినదే శ్రీశా
ఏది సాధించినా నీ కరుణే రమణా
సంకల్పం నీది కదా నా జన్మకు
సరే అని అంటే కదా నా ఈ బ్రతుకు -

**క**న్నులున్న అంధుడను నే నొకనాడు
మునుల తీరు ఆలోచన లేదా నాడు
నాదనేది లేదని నీవే నా సర్వమని
నేడు తెలుసుకుంటిని
నా కన్నులు తెరచితిని

**నే** నేమిటో చూపించవా
నే నెవరినో ఎరిగించవా

క్షీరసాగర శయనా
శ్రీనివాసా -

**గ**త జన్మలో స్వామి నేనేమిటో
ఆ జన్మలో నాదు కర్మేమిటో
ఆ కర్మకీజన్మ కేమిటి బంధం
అది చూపి కను విప్పి నాకిమ్ము నవజీవితం

**నా** లోని లోపాలు దర్శింపనీ
నా పాపములనన్ని నన్నెరుగనీ
నా పాపకర్మకు నను వగవనీ
నా కర్మ కరగించి కాపాడవా

**నా** స్థానమేదో నీ సృష్టిలో
నా ధర్మమేమో నీ దృష్టిలో -
కర్తవ్య మెరిగించి కాపాడవా
కలి దోషహరణ కల్యాణ ధామా



**నీ** గుడి వాకిట అడుగిడితి
నీ సన్నిధిలో నిలబడితి

కమలేశా ఓ కరుణామూర్తీ
శరణం శరణం శరణం ప్రపద్యే

**భ**క్తుల బ్రోచే పరమాత్మా
భావన కందని భాగ్య విధాతా
నీవొక్కడివే దిక్కిక దిక్కిక
మ్రొక్కిన నీకే మోక్ష ప్రదాత -

**రా**గం నీవే యోగం నీవే
భాగం నీవే పూర్ణం నీవే
ప్రకృతి నీవే ప్రణవం నీవే
ప్రణవంలో గల నాదం నీవే -

**ది**విలో నీవే దిక్కుల నీవే
కాలం నీవే మూలం నీవే
నీవే లేనిది నీవే కానిది
ఏదీ లేదిక ఏకైక శక్తివి

**చా**లింక ఈ జీవితం - శేషశయన
లేదింక నాకే సహనం

నా వినతిని వినవోయి నారాయణా
నా మనవిని ఆలించుమో శ్రీనివాసా

**నీ**తో బంధము కోరి నీ కరుణకై కాచితి
నీతో బంధము కాద నిజ జీవితం
సందర్శనం కాద నిజ సంతసం

**నా** వారనేదే నాలోని లోపం
నాకున్నవన్నీ నా వను భావం -
నా కెవరు లేరోయి నిన్నే వినా
నాదేది కాదోయి నీ సృష్టిలో

**ని**న్నెరుగుటే కద నిజ జ్ఞానము
నిను మరచుటే కద అజ్ఞానము
నీవే కదా నాకు కడదాక తోడు
నీ దయే కద నాకు నిజమైననీడ



**క**లి తొలగించే వేలుపు నీవే
కలియుగ జనులకు ఆశవు నీవే

ఓ తిరుమల తిరుపతి శ్రీశా
శ్రీహరి శ్రీ వేంకటేశా

**ని**ర్వికల్పుడవు నీవే నీవే
నిరాకారుడవు నీవే నీవే
నిర్గుణ సద్గుణరాసివి నీవే
నీలి నీరద శ్యాముడు నీవే

**స**త్యరూపుడవు నీవే నీవే
సర్వేశ్వరుడవు నీవే నీవే
సామజ వరదుడు నీవే నీవే
సాకారుడవు నీవే నీవే

**పు**రుషోత్తముడవు నీవే నీవే
పూజ్య చరణుడవు నీవే నీవే
వేద వేద్యుడవు నీవే నీవే
దివిజ వంద్యుడవు నీవే నీవే

**క**రుణామూర్తివి నీవే నీవే
కారణ కారణ నీవే నీవే
సర్వోత్తముడవు నీవే నీవే
సర్వోన్నతుడవు నీవే నీవే

**పూ**ర్ణమిదం పూర్ణమదః నమః నమః
పూర్ణ రూప ఆదిదేవ నమః నమః

**ప**రవాసు దేవమూర్తి నమః నమః
పరంధామ పరిశుద్ధా నమః నమః
వ్యూహరూప దేవ దేవ నమః నమః
క్షీరసాగర శయన నమః నమః

**సం**కర్షణ అనిరుద్ధా నమః నమః
సర్వావతారరూప నమః నమః
విభవావతారమూర్తి నమః నమః
విశ్వరూప వేదవేద్య నమః నమః

**శ్రీ**రంగవేంకటాద్రి శ్రీమూర్తీ నమః నమః
గుడి గుడిలో పూజ నీయ నమః నమః
బహు రీతుల భక్త జనాశ్రిత మూర్తీ నమః నమః
అర్చావతారమూర్తి నమః నమః

**కే**శవాది నామధేయ నమః నమః
క్లేశము తొలగించు బ్రహ్మ నమః నమః
చేతనా చేతనముల మూలమూర్తి నమః నమః
అంతర్యామి నీకు నమః నమః



**హ**రే శ్రీశ హరే శ్రీశ శ్రీశ శ్రీశ హరే హరే
హరే వెంకటేశ హరే శ్రీనివాస -

అనుటలోనె పరవశం
వినుటలోనే భక్తి తరంగం

**భ**వ జలనిధిని దాటించే భక్తికి మూలం
పాపాలను పరిహరించు పావన మార్గం
కలియుగాన దీనులకది కల్మష హరణం
బాధలలో శుభకరం పుణ్యప్రదాయకం

**వేం**కటేశు నెద నిల్పుట కదియు సాధనం
ఎవరికైన ఏనాటికి ఎనలేని ధనం
దైవారాధన కోసం మననం ఘనం
దైవాన్ని మెప్పించి దరిజేర్చే ద్వారం

**క**నులు మూసి స్మరించుటకు కమ్మని మంత్రం
మది నిలకడ కోసమదే మంచి ఉపాయం
ఏకాగ్రత కోసం అది ఎన్న తగినది
ఏనాడైనా సరే అదే కదా కాపాడేది

**జో**హారు శ్రీ వేంకటేశా
జోహారు జోహారు శ్రీ శ్రీనివాసా

జోహారు జోహారు ఓ పరంధామా
జోహారు జోహారు దివ్య గుణ సదనా

**నీ** వాకిటను నిలచి నిన్నెదను తలతు
నీ దేవళము లోన నిన్నె ప్రార్థింతు
నీ చరణ కమలాల నీడ కాక్షింతు
నీ సన్నిధిని మ్రొక్కి నీకు వశమౌదు

**నీ** పాదముల చెంత పాపాలు పతనం
నీ గర్భగుడిలోన దోషాలు శిథిలం
నీ నామ జపములో నిత్య సుఖవాసం
నీదు సందర్శనం నిజ భోగ భాగ్యం

**ని**ను వినా మనలేని నిర్భాగ్య జీవితం
నిన్ను కనలేకుంటె వ్యర్థమే జీవితం
నీ ప్రేమ పొందితే నిండుగా శాంతం
నీ ప్రేమ పంచితే నీకు సన్నిహితం



**చి**త్తగించు నా మాటలు శ్రీ వేంకటేశా
ఉత్తమాట లివి కావు శ్రిత జనేశా

**ప**వలు రేలు నీకోసం పదే పదే తపన
పరమాత్మా కనలేవా పాప నాశకా
కను మూసిన కను తెరచిన నీ రూపం ప్రత్యక్షం
కరునామృత పయోనిధీ కరుణే రాదా

**ని**దురలో నీ కలలే - కలవరింతలు
ఏమరినే ఉన్నానా చెంతనె నీవనిపించు
కలలన్నీ కల్లలు కానీకుమా
నీవే నా ఊపిరి - సన్నిధిలో లాహిరి

**ఏ**కాంతముగా నీతో నీ సన్నిధి నుండాలని
బ్రతుకంతా ఆ తీరుగ నీతో గడవాలని
బ్రతుకు ముగియు మరుక్షణం నీ లోకం రావాలని
నీతోనే ఉండాలని
ఎందుకో నాలో ఆశ
అలా చేస్తావని మదిలో ఆశ

**క**ల నిజమే నువు చేస్తావ
కమలేశా వరమిస్తావ -

ఎంతైనా నిను కానియాడెదను
సుంతైనా దయ కోరెదను

**నీ** దరి నిలచి నీ దయ కోరి
నిన్నే మరి మరి సేవిస్తూ -
నేనే నీవని - నీవే నేనను
కలనే నిజముగనే కంటే - ఆ...

**మా**నస మహలున నిన్నూహించి
మధురోహలతో మరి మరి తేలి
నీ పదసీమను పూవును నేనై
నిదురించానని నే కలగంటే - ఆ...

**నీ** అడుగులకై నీ జాడలకై
నీకై నిన్నే అన్వేషిస్తూ
నీ నవ్వులగని నీ సవ్వడి విని
నీ దాసినియనినే కలగంటే - ఆ....



**మా**ర జనక మనోహరా మరువలేనురా - నీ
మధురాకృతి మదిలోన ముద్ర వేసెరా - స్వామి శ్రీనివాసా...

**బా**లనురా బేలనురా దీనాతి దీననురా
ఆగమన్న ఆగదోయి ఈ లేత మనసు
ఆపలేదు ఓపలేదు నిను కానక దేలనో -

**క**న్నీరే ఆగదోయి నరనరాన నీ తలపే
నిదురొకింత రాదోయి నీ ధ్యాస ఆగదోయి
కన్నులలో నీ మంగళ రూపము కదలాడురా

**ని**ను స్పృశించి నీరౌతా నీ నవ్వుల వెన్నెలలో
చకోరినై విహరిస్తా చంచలనై ప్రహసిస్తా
నీ జాడకు నీ నీడకు బ్రతుకంత అర్పిస్తా

**ఊ**పిరికే ఊపిరిగా నిను భావిస్తా
ఊహల్లో విహరిస్తూ ఉరకలు వేస్తా
ఊహలకే ఊపిరూది ఉర్ధ్వలోకమే చూస్తా

**అ**తివను నను వీడకోయి నిస్సహాయను
అనుభూతిని ఆపకోయి అమృత మానసా
కథగా అది మిగలనీక నిజము చేయవా - వినతులు వినవా

**ఉ**పేక్షింపకో కమలేశా
అపేక్ష నేరము అఖిలేశా
నా శిక్షకుడవు నా రక్షకుడవు
అక్షర రూప పరబ్రహ్మవేగా

**నీ** పైనే నా ధ్యాసంతా నిరతం కోరితి నీ చెంత
చేతనమున్నా లేకున్నా హద్దులు ఎరుగదు ఆరాధన -

**వె**న్నగ నీ మది కరుగనిదా
వెన్నుడు ధరపై నీవేగా
చిన్నగ చూడకు మంగవిభో
మన్నన చేయవ నేరమెయున్న -

**చీ**కటి బ్రతుకున కాంతి వారివి
హృదయ తపనమున శమనము నీవే
ఆశల అలలను తేలిన డోలను
నిరాశ బరువై మునుగ నీయకు



**డో**ల లూగుమా శ్రీశ డోల లూగుమా
గాలితో తేలుచూ గాన గగన వీథిలో -

**మె**ల్లగా చల్లగా ఉల్లమే పల్లవింప
అల్లరిగా నవ్వుతూ కొల్లగొనగ మానసమే -

**న**వ వసంత వలపు పూల నవ విలాస రాగహేల
భక్త రక్షణే మరచి బంధాలకు దూరంగా -

**అ**లలపైన కలువలా ఆలల తలల కలిమితో
తేలి తేలి తూగి తూగి తెలియనెదో అనుభూతిని -

**హృ**దయమె సుమడోలగా
ముదమున ఊహించగా
వదనము హాసోదయ
వికసనతో విలసిల్లగ -

**నా**లో నవవీణ మీటి నరనరాన సుఖము రేపి
జగము మరచి నీ దరికే జరిగి సోలిపోవు నటుల -

**ని**ను పొగడ నా తరమా
నారద సనన్నుత క్షీరాబ్ధి శయనా

**స**నక సనంద సన్నుత రూపా
సకల జగాలకు సంరక్షకా
భువన మోహనా గగన సద్రుశా
భువిలో వెలసిన వైకుంఠవాసా

**శు**భముల నొసగే శుద్ధ శుభాంగా
అభయము నొసగే అలమేలు విభో
ధరలో నీవే దామోదరా
నరులను బ్రోచే నారాయణా

**నీ** శాసనముగ తిరుగు గ్రహాలు
నీ ఆసనమున నిండదు శ్రీలు
నీ సముఖమున నిండు శుభాలు
ఆలనతో మాకు అమరు సుఖాలు



**ని**ను కానక మనలేనురా
నిను కోరక ఉండలేనురా
నీవే నా లోకం నీ సముఖం నాకం
నిఖిలేశా నీరజాక్ష శ్రీనివాసా

**నీ** రూపం కన్నులలో మలచుకొంటిని
నీ నవ్వుల మల్లెలనే ఏరుకొంటిని
నీ కదలిక ఊహిస్తూ మైమరచితిని
నీ దయనే గుండెలలో పదిల పరచితి

**లో**లోన ఆలోచనలన్నిట నీవే
అనుభూతుల ఆనవాలు చెదరిపోదులే
నీ జ్ఞానం మనసంతా నిండిపోయెలే
నా ధ్యానం నా యోగం నా జీవం నీవేలే

**ని**దురించిన కన్నులలో తొంగిచూతువు
కలవరమున కను విప్పిన కందును నిన్నే
మరపన్నది నా జన్మకు మరి రాదులే
మధుసూదన నా ఆత్మకు నీతో శాంతి

**శ**రదిందు బింబము నీ మోములో
అరవింద శోభలు నయనాలలో
వరదాన గుణరేఖ నీ కరములో
సురలోక భోగమే నీ ప్రేమలో

**మ**ందాకినీ వీచికే చూపులో
మధురామృతము శ్రీశ నీ గుండెలో
ఉదయాద్రి వెలుగులే నీ మేనిలో
ఊరించు వింతలే నీ ఉనికలో

**ప**ద్మాలు వికసించు పాదాలలో
పన్నీరు వర్షించు నయనాలలో
పగడాల జిలుగులు నీ పెదవిలో
శాంత శీతల సరసి సముఖమ్ములో

**క**లలందు కనువిందు నీ రూపమే
కైలాస వెలుగులు నీ నామమే
సురలోక మిలమిలలు మకుటమ్ములో
శ్రీ వేంకటేశా సిరి వల్లభా



**స**రసిజనాభా సనాతనా
నిరుపమ శుభగుణ నిరంజనా

**స**ర్వోన్నతుడవు సర్వేశ్వరుడవు
సాకారా నిరాకారా
పవిత్ర చరణా పాపవినాశక
ప్రవిమల రూపా ప్రసన్న వదనా

**జ్ఞా**న నిధానా కాంతి స్వరూపా
జయ నారాయణ జనార్దనా
నీవే వేదం నీవే నాదం
నీవే నిగూఢ శక్తిమయం

**దీ**వి భువి నిండిన దివిజేశా
దివ్య ప్రభావా ధరణీశా
కలియుగ జన సంరక్షక పోషక
కల్యాణ గుణధామ కరుణామయా

**శ**రణం ప్రపద్యే శరణం ప్రపద్యే
శరణం తన చరణం
తవ చరణం శరణం

**ఉ**దయాన విరిసిన ఉల్లాస విరులు
కోకొల్లలుగ చేరి మురిసే చరణం
తాపసులు లోలోన దర్శించు చరణం
మునివరులు కీర్తించి కొనియాడు చరణం

**ఆ**కాశ సీమను అంటిన చరణం
కాళీయు పడగల కదలిన చరణం
వనిలో శిలయే వనితైన చరణం
పార్థుని నడిపిన పావన చరణం

**వై**కుంఠ లోకాన అలరిన చరణం
కలి కల్మషము నెల్ల కడిగే చరణం
భక్తు లెల్లరకు అనువైన చరణం
ముక్తి నీయుటకు ముందున్న చరణం



**స**ంగీత సారంగి వాయించనా
సరికొత్త రాగాలనే పాడనా
కీర్తించుచూ నిన్ను శ్రీనివాసా
సంకీర్తనల నిను సర్వేశ్వరా

**ప**ంచమములో పాడు ఎలకోయిలై
షడ్జమములో పాడు సరికేకినై
మందరములో పల్కు గోమాతనై
మరిమరి నే పాడనా - విభో

**క**డలి ఘోషకు గొంతు నే కలపనా
వాగు గలగలకే శ్రుతి కలపనా
శుకపిక గీతాల జతగూడనా
అకలంక రూపా నినుస్తుతియించనా

**ఎ**ల తేటితో ఝుమ్మని పాడనా
కలఘోషతో కంఠము కలుపనా
మలయ మారుతమున కీర్తించనా
అల స్వర్గలోకేశ నుతియించనా

**రెం**డు రోజుల పండుగ - ఈ
బ్రతుకు సర్వం దండగ
మేలుకొనవో బేల మనసా
మేలుకో ఇక మేలుకో

**ఆ**వలి తీరం లేని యానం
ఆరిపోయే గాలిని దీపం
తీర మెటులను చేరు ప్రయాణం -
గాలి నాపుట ఎవరికి సాధ్యం

**ఎం**దుకో ఇక యాతన
ఎందుకో ఆవేదన
తరుణ మిదియే మేలుకో
వెల్తురుండగనే దిద్దుకో

**ఎ**వరు ఉన్నారన్నా సరి ఇక
ఎంత వరకు అండదండలు
రుద్రభూమిని చేరిన సమయం
భద్రతన్నది లేదిక సత్యం

**రే**యి పవలుగ మరిపోయే
రేపు నీదే ఔనో కాదో
ఎందుకో ఈ యాతన శ్రీశా
ఏలుకోవా వేంకటేశా



**హ**రి ఓం హరి ఓం అనరండి
కలియుగేశునే కనరండి
అలమేల్మంగకి అతడే విభుడు
అవని జనులకు ఆరాధ్యుడతడు -

**శ**రణం శరణని సన్నిధి జేరి
పాహి పాహి యని పదములు తాకి
అన్యులు లేరని అతడే హితుడని
అతడే నిజముగ అనంతుడనుకొని -

**స**త్యరూపుడు సర్వేశ్వరుడు
నిత్యుడు పూజ్యులు నీరజాక్షుడు
సకల చరాచర సృజన కారకుడు
ఆత్మారాముడు అఖిలాత్ముడతడు

**ఇ**హ పరములకు ఇంపగు వారధి
అందరి ముక్తికి అతడే సారధి
పురుషోత్తముడు పరంధాముడు
అతడు సనాతను డందరి హితుడు

**సు**ందర రూపుని కనరే కనరే
సురుచిర వదనారవిందుని కనరే
వేంకటాద్రిపై వెలసిన దేవుడు
వెన్నగ మనసై మనకున్న దేవుడు

**క**న్నుల నున్నది కరుణ కాపురం
నామము మహియే పాప హరణం
చేతుల నున్నది రక్షణ భాగ్యం
వదనములోనే పరమార్థసారం

**అ**ధరము గమనింప కదలిన భావం
ఏదో పలికిన అనుభూతి యోగం
పదములలోనే పరలోక భోగం
పదములు తాకిన తలలో ప్రశాంతం

**స**న్నిధిలోనే సంకట హరణం
ఉన్నది తెలియని దివ్య ప్రభావం
భావనలోనే భక్తి ప్రగాఢం
ఏదలో ఏదో వింత ప్రమోదం



**ఇ**తడే ఇతడే పరమాత్ముడు
ఇతడే నిజముగ అఖిలాత్ముడు
అల వైంకుఠము దిగినాడు
ఇలలో గిరిపై కొలువైనాడు

**ఇ**తడే ఇతడే ప్రణవ పవిత్రుడు
ఇతడే పరమ జ్ఞాన ప్రదాత
ఇతడే కనుడు పురుషోత్తముడు
ఇతడే సత్యం పరంధాముడు

**సా**కారుడుగా ఇతడే శ్రీశుడు
నిరాకారుడు నిరంజనుడు
నాదరూపుడు మోదకారకుడు
నామ రహితుడును అనంతనాముడు

**ప్ర**త్యగాత్మగా ప్రభవించు నితడే
పరమ ప్రజ్ఞకు పవిత్రతకును
అనితరఘనుడు అనూహ్యుడితడు
సర్వ నియామక సర్వేశుడితడే

**వే**ంకటేశుడు ఇతడు వైకుంఠధాముడు
వేంకటాద్రిని చేరి విడిది చేసేడు
పరమాత్ముడే నాకు పరమాప్తుడు
పరచింత కలిగించి పాలించు నా వాడు

**స**కల భువనాలకు సామ్రాజ్య నేత
సకలమును కలకలముగా నుంచు అధినేత
సర్వమును పాలించు సర్వేశుడే అతడు
సకల కార్యాలకు సర్వసాక్షుగువాడు -

**మ**నసులో తమసులో వెలుగు తానగువాడు
మనుగడను తనవైపు మరలించుకొనువాడు
సుఖశాంతులకు తానె కారణంబగువాడు
సుగుణాభిరాముడు శుభము లొసగేవాడు

**చి**ంతలన్నీ బాపు చిద్విలాసుడు అతడు
అంతరంగములోన ఆనంద నిలయుడు
చెంతనే తానుండి వంత బాపేవాడు
వింత లెన్నో చూపు విశ్వాంతరంగుడు



**ఇ**ందరి దేవుడు ఇతడే ఇతడే
ఇహము పరము ఇతడే ఇతడు
అలిమేల్విభునిగ అలరే దేవుడు
వడ్డికాసులవాడు వరదానహస్తుడు

**ఆ**దివిష్ణువు ఇతడే ఇతడు
అనంతనాముడు నిజముగ నితడు
అంతర్యామి ఇతడే దేవుడు
ఆత్మారాముడు అకళంక రూపుడు

**ద**శ దిశలందున ఇతడే ఇతడు
ధరణిని సర్వము నితడే ఇతడు
దశావతారుడు దనుజభంజనుడు
ధర్మరక్షకుడు ధరణీధరుడు -

**నా**మరహితుడు ఇతడే ఇతడే
సగుణ నిర్గుణ బ్రహ్మయు నితడే
నమ్మిన వారికి నారాయణుడు
దామోదరుడు దయార్ద్రసోముడు

**ప**రపమదం అదె పరమపదం
తిరు వేంకటగిరి ఇల వైకుంఠం
శ్రీ శ్రీనివాసా శ్రితమందారా
నేనౌనంటే కాదంటావా

**నీ** చూపులలో కృపా శరాలు
నీ వదనంలో శాంతి ప్రసారం
నీ హృదయంలో ప్రేమ మరందం
నీ భక్తులకై నీ ఆహ్వానం

**ప**దముల కద నా ప్రశాంత నిలయం
నీ భావనలో నిర్మల పవనం
నీ మౌనంలో గీతాసారం
బ్రతుకందుకనే నీ కంకితం

**నీ** గుడివాకిట నిండు వసంతం
నా మానసమే మల్లెల క్షేత్రం
గుడిగంటలలో అమర సంగీతం
గుడిదీపంలో జ్ఞానపు ప్రకాశం



**ఆ**లమేల జాలమేల ఆదిదేవా
అంతా నీ దయ కాదా వేంకటేశా

**నీ** గుడికే వస్తానని నిన్నే దర్శిస్తానని
పొంగి పోయి చకోరినై నింగినందితి
ఆవేదన అంతరించి ఆశ పెంచితి
అన్నిటికీ అంతరాన నిన్నె నమ్మితి -

**నీ** మహిమలు నాకు చూపి నను లాగేవు
నీ తలపులు నా మదిలో నింపేశావు
నీవె నాకు తోడని నీ పదములె గతియని
అంతరాన ఆశ పెంచితి
అన్నిటికీ నిన్నె నమ్మితి

**ని**ను చూసిన నిముషాన కాల మెరుగను
నీ చూపుల వానలో వేదనారును
నీ మాలలు హారాలు నను చుట్టిన తీరై
బానిసగా భవదీయుని బందీనని
అంతరాన ఆశ పెంచితి
అన్నిటికీ నిన్నె నమ్మితి

**నా**రాయణుడవు నీవంటారు
నాకిక సర్వం నీవంటాను
శ్రీ రమణా - రమారమణా

**న**రసింహుడవని జనమంటారు
వామనుడేయని ఒకరంటారు
రమావల్లభుడు నీవని అన్నా -
రమణీయ గుణా ఔనంటాను
దైవం నీవని అంటాను

**రా**ముడు నీవని ఒకరంటారు
కృష్ణుడవే అది నిజమంటారు
ఎవరేమన్నా నమ్మకమేగా
నమ్మిన దైవం నీవంటాను
నాకిక భయమే లేదంటాను

**న**మ్మి పిలచితే నాకౌతావు
పేరేదైనా నీదంటాను
అనంతనామా అమృత నిలయా
ఆశ్రిత చరణా అనాధ నాధా
నమ్మిక నీపై నేనుంచాను
వమ్ము చేయనని ఆశిస్తాను



**ని**లకడ సడలకు మనసా - నీ
నిలకడ నిలుపుము మనసా
జడియకు జడియకు తడబడకు
చిరాకు పడకు పరాకు పడకు -

**క**నులను మూయును మాయల పొరలు
తెన్నులు చూపవు మాపటి తెరలు
పెడదారికి కద ఆకర్షలు
అడుగడుగున ఇక ఆటంకాలు -

**మ**మకారాలే మాయని బంధం
మనవారనునది మనలో లోపం
అది ఇది నాదను తాపత్రయము
అంతా హరికే వదలిన జయము

**వేం**కటేశునికి అర్పిత భావం
ఆతని నామం తరుణోపాయం
ఆతని శక్తికి కలి ఇక మాయం
శ్రీహరి భక్తే జీవితమార్గం

**గో**విందం భజగోవిందం
గోపీ మానస చోరం -

పంకజనాభం పన్నగ శయనం
ప్రవిమల రూపం ప్రసన్న వదనం
దీన శరణ్యం దివ్య ప్రభావం
బృందావన సంచారం దేవం -

**వ**సుదేవసుతం వేద వేద్యం
గాన విలోలం లీలా వినోదం
యదుకుల తిలకం మధుసూదనం
నీరదశ్యామం నిర్గుణ భరితం

**చం**దన చర్చిత చారు శరీరం
సనక సనందన హృదయ నివాసం
సురముని వందిత సుందర చరణం
వంశీలోలం వర వేంకటేశం



**హ**రి గోవింద హరే - గోవింద
హరి గోవింద హరే -
గోవింద - గోవింద - గోవింద
గోవింద - గోవింద - గోవింద

**నా**రదసన్నుత గోవింద
వారధి నిర్మాత గోవింద
పంకజనాభ గోవింద
పరమాత్మ ప్రద్యుమ్న గోవింద
గోవింద - గోవింద - గోవింద
గోవింద - గోవింద - గోవింద

**ము**నిజన వందిత గోవింద
ముకుంద మాధవ గోవింద
భక్త పరాధీన గోవింద
బంధ విమోచక గోవింద
గోవింద - గోవింద - గోవింద
గోవింద - గోవింద - గోవింద

**గో**కుల తిలకా గోవింద
గోవర్ధనధర గోవింద
కౌస్తుభమణిధారి గోవిందా
కలియుగ వరదా గోవిందా
గోవింద - గోవింద - గోవింద
గోవింద - గోవింద - గోవింద

**ఊ**హలలో తేలుమా - వేంకటపతి
యోచనలో మునుగుమా
చంచలమౌ ఓ మనసా
చలింపకనె కాస్త సేపు -

**నా** హృదయం నవాలయం అందున గర్భాలయం
లోనున్నది పీఠం - అది హరి సిరి నిలయం
పుణ్యాల రాసులుగా - పూజకు ఇలవేల్పుగా
కొలువై ఉన్నారని - కోరిక తీరుస్తారని -

**ప**న్నీటిని జల్లుతూ - పదములనే కడుగుచూ
పూలతో పూజించి పుణ్యాల నిండుచూ
పూలమాలలే వేసి పులకరించిపోవుచూ
దోసిట ముత్యాలతో అభిషేకం చేసినటుల

**ప**సి శిశువుగ మారినటుల కపటమే లేనటుల
సర్వం అర్పణ జేసి సాగిల పడిపోయి నటుల
మరుజన్మిక వలదని వరమేదో పొందినటుల
ఆ సుఖమే తలచి తలచి అటుల కరగినటుల



**ఎ**టుల దెల్పెదనోయి నా భక్తి నీకు
శ్రీ వేంకటేశా శ్రితపారిజాతా

**వే**కువ వేళను వేగమె లేచి
పూవులనెన్నో కోసి కోసి
మాలల నెన్నో కూర్చి కూర్చి
మాలల నర్పించనా - స్వామి పూవుల పూజించనా

**ఆ**వు పాలతో అభిషేకించి
పన్నీటి స్నానాలు చేయించనా
మేనికి గంధం నే పూయవా
పదములనే పట్టినా - స్వామి పదములు నే పాడనా

**నీ** నామమునే నిరతం పలికి
నీ రూపమునే ఎదలో నింపి
గీతామృతమే ఆస్వాదించి
సాగిలి నే మ్రొక్కనా - స్వామి సర్వం అర్పించనా

**మ**రుడవు గురుడవు అని భావించి
నాదే భాగ్యం అని నే మురియన
నీ లీలలనే చాటనా
దాసుని నను చూడవా - స్వామి
దరి జేర్చుకోలేవా

ప్రణవం నీవే పరమాత్మ
శరణం నీవే అఖిలాత్మ

**ము**రహరి నరహరి శరణం శరణం
ముకుంద మాధవ శరణం శరణం
విశ్వవిశాలా శరణం శరణం
విశ్వాకారా శరణం శరణం

**గ**రుడ తురంగా శరణం శరణం
శ్రీరంగ రంగా శరణం శరణం
ఓయి శుభాంగా శరణం శరణం
కృపా తరంగా శరణం శరణం

**అ**చ్యుత కేశవ శరణం శరణం
అనంత నామా శరణం శరణం
ఆనంద నిలయా శరణం శరణం
అవతార రూప శరణం శరణం



**హృ**దయాలయమున ఉండుమయా
సదమల హృదయా దయామయా

సిరిదొర బ్రతుకును నడపుమయా
తరుణోపాయం చూపుమయా

**ది**న దిన గండపు నిండు బ్రతుకులో
దీనత్వం తొలగించుమయా
ఘనమగు దైవం నీవయ్యా
అనవతరమునను కావుమయా

**వ్యా**మోహానికి బందీ నేను
వ్యాకులతకు నే బానిసను
ఆశామోసుల జిక్కితినయ్యా
అందుకె నన్నిక కావుమయా

**మో**సాలకు నే మొగ్గితినోయి
ద్వేషానికి నే లొంగితినోయి
కోపతాపములు తొలగించుమయా
కోరితి వరదా కోమల హృదయా

**అ**నుకోనా నేనుకోనా
అనుకుంటూ నేమనుకోనా -
కమలేశా నువు కరుణాకరుడని
కోరిన వారికి వరసింధువని -

**నీ**వే బ్రతుకున వైభోగం
నీవే ధరలో వైకుంఠం
నీవే ఊపిరి నా ప్రాణం
నీవే నిరతం నా సర్వం -

**బా**ధలలో నా బంధువని
వేదనలో నా వేల్పువని
పిలచిన పలికే దైవమని
వేడిన వెన్నగ కరగెదవని నే-

**వే**సవి బ్రతుకున చలిపవనం
శిశిరము తొలగే మధుర మాధవం
ఆశ మోహం ఆరిత తీరం
ప్రేమ ప్రవాహం నీ హృదయం -

**నే**ననుకున్నది ఔనంటావని
నాకిక ఎపుడును తోడుంటావని
హృదయంలో నువు కొలువుంటావని
ఉదయ ప్రశాంతం నాకిస్తావని -



**అ**ణువణువున నీవున్నావు
అన్నిటిలో నీవున్నావు
సిరిదొర భవహర శ్రీనివాసా
సనాతనా సర్వేశా

**గా**లి వీచితే నీ కరుణ
రవి ఉదయిస్తే నీ కరుణ
వీచే గాలిని నీ స్పర్శ
లేచే సూర్యుడు నీ అంశ

**నీ**లాకాశం నీ కరుణ
నింగిని చంద్రుడు నీ కరుణ
గగన విశాలం నీ మానసం
చంద్రుని లోని చల్లదనం

**త**రువుల ఫలములు నీ కరుణ
విరిసిన పూవులు నీ కరుణ
ఫలములలో నీ ప్రేమ మరందం
పూవులలో నీ అంద చందం

**లా**లనుచు ఊపెదను నా శ్రీనివాసా
లాలనగ నా ఎదను నిదురపో శ్రీశా
లాలీ లాలీ........ లాలీ లాలీ......

**ఎ**దలోన నిదురపో ఏడిపించకు మోయి
ఏనాడు నిన్నిటుల జోకొట్టు టెరుగను
ఏనాటి నోములో ఈనాడు ఫలియించె
ఏ జన్మ పుణ్యమో ఈనాటికే పూచె

**మా**రాము చేయకు మరిపించలేనోయి
మనసంత నిండేవు మధుసూదనా నీవె
బూచాడు వచ్చెనని భయపెట్టలేనోయి
బూచాళ్ళకే బూచి భువన మోహన నీవు

**అ**లనాడు కృష్ణునిగన ఆ యశోదే ఊపె
రామునిగ ఊగేవు కౌశల్య జోలలో
వటపత్ర శాయివై విలసిల్లు లోకేశ
ఇపుడు నన్నూపనీ ముచ్చటలు తీరనీ



**జో**లాలి జోలాలి ఓ తిరుమలేశా
జోలాలి జగదీశ నిదుర పోవయ్యా

**మా** బాధ తీర్చమను వినతులే వింటావు
భక్త రక్షణ చేసి అలసిపోతావు
విసుగన్నదే నీకు సుంతైన లేదు
నీవింక కనుమూసి నిదురింపవా స్వామి

**పా**పులకు క్షమనిచ్చు పరమాత్మ లోకేశ
మూర్ఖులకు నమ్మిక కలిగించు కమలేశ
మొలక నవ్వులు చిలుకు పసిపాపవోలె-
మము గూర్చి తలపులే ఆపి నిదురింపవా

**ఈ** జోలయే నీకు ఇంపుగా తోచగా
నెమ్మదిగ కనుమూసి నీరజాక్షా కాస్త
నిదురపో నిదురపో నిముషమైన చాలు
నిరుపమాన దేవ నిశ్చింతగా -

**శ**యనించ రావయ్య శ్రీ వేంకటేశా
శయనించు నెమ్మదిని శ్రీ తిరుమలేశా
శయనించరా ....... శయనించరా

**పా**వని జనయిత్రి అలమేలు మాయమ్మ
ప్రక్కనే తానుండి పరిచర్య చేయ
భక్తులందరు చేరి పరవశముతో నిలువ
వైభోగమున దేలి వటపత్రశాయిలా -

**ప**ట్టు శాలువ పరచి పాన్పునే సరిచేయ
మల్లెలు మొల్లలు కొల్లగా జల్లగా
పసిడి గిన్నెల నిండ పాలు మీగడలుండ
పరమాత్మ సేవించి పవళించ రావోయి -

**అ**గరు పొగలే నీకు ఆహ్లాద మనిపింప
ఆనంద మోహనా అలుక లసలే లేక
గుండెలో గుట్టుగా అణువణువులో నిండి
గోవింద పరవశముతో నేను పిలువ -



**ఊ**గుమా ఉయ్యాల అలమేలుమంగ
ఊగుమా సిరిరాణి హృదయాంతరాన -

ఊగుమా అపరంజి బొమ్మ
ఊగుమా మా మరుమల్లె రెమ్మా

**పం**డు వెన్నెల నూగు సన్నజాజిగ మెరసి
పిల్లగాలికీ తూగు విరజాజిలా మురిసి
పసిడి నవ్వుల మొలక పలుకు తేనెల చిలుక
బంగారు నా తల్లి ముద్దు మురిపాలొలుక

**భా**వాలు గీతాలు గొలుసులై ఉండగా
భక్తి సర్వము ఎదను పీఠమై అమరగా
శరణాగతే పరచు పట్టుశాలువగా
శరవిందు వదనా శాంత శీతల సరసి -

**క**నులలో కరుణంత కమనీయవమ్మా
హృదయాన నీ ప్రేమ ప్రవహింపనీవమ్మ
వదనాన శ్రీలన్ని దర్శింపనీవమ్మ
నినుగాంచు కన్నులకు కలికమోయమ్మ

**సా**హిత్య నీరాజనం - నీకు
సంగీత నీరాజనం -
సాహిత్య సంగీత సమతుల్య నీరాజనం
గైకొమ్ము నాదేవ శ్రీ వేంకటేశా -

**ప**ద పదములో నీ భక్తి నిండి
పంక్తి పంక్తిలో పరిణత చెంది
భావాంబరములో విహరణ చేసి
చరణాల చెంతను శరణాగతిని సాగు -

**స**ప్తస్వరములు ఒత్తులుకాగా
సంగీత సారము ఘృతమే కాగా
సరస్వతి రాగమె సరిదీపాలై
ప్రణవ నాదసుధ ప్రభలే చిందగ -

**ప**ల్లవి కుందున పదిల దీపమై
ఏకాగ్రతయే దీప నిశ్చలత
ఆలాపనయే వెలుగు వెల్లువై
రాగాన గమకాలు హారతి వలయాల-



**నీ**రాజనం నీకు అలమేల్మంగ
నీరాజనం నీకు మము కావంగ
నీరాజనం...... నీరాజనం

**ప**లుకు తేనెల తల్లీ పగడాల హారతి
పావనీ జనయిత్రి పచ్చల హారతి
నిత్య సుమంగళీ నీలాల హారతి
రమణీలలామ రమణీయ హారతి -

**వ**రహాల జనని వజ్రాల హారతి
వైభోగ శ్రీల వైడూర్య హారతి
మురిపించే శ్రీదేవి ముత్యాల హారతి
కమల మనోహరి కమనీయ హారతి -

**పు**ణ్యాల మాల పుష్యరాగ హారతి
గోవిందుని ప్రియసతి గోమేధిక హారతి
ఇంపైన దేవేరి కెంపుల హారతి
నారీ శిరోమణి నవరత్న హారతి

**మా** శ్రీనివాసునికి మణిదీప హారతులు
మా దేవదేవునికి మంగళారతులు

**న**రులకై నరునిగా గిరిని వెలసినవాడు
నరుల బాధలు తీర్చి నవ్వించు దేవుడు
అవతారమూర్తిగా ఆర్త రక్షకుడతడు
అమృతాంగ రంగుడు ఆనంద నిలయుడు -

**మ**నసంత ప్రేమతో నిండిపోయినవాడు
మన వినతులను విని బాధ బాపేవాడు
కల్యాణమూర్తిగా కనుల కరుణొలికించి
కలియుగేశుడుగను కాపాడు దేవుడు -

**భ**క్త వరదుడు యతడు
బంధరహితుడు యతడు
కల్పతరువుగ తానె కోర్కెలన్నీ తీర్చి
కల్యాణ శ్రీలతో కళలొలుకు వాడు



**జ**యహో జయహో కమలేశా
జయ జయ జయహో శ్రీ గిరివాసా

**జ**య విజయీభవ వేంకట రమణా
దిగ్విజయీభవ సంకట హరణా
జయ విజయీభవ శక్తియుతా
దిగ్విజయీభవ భక్తనుతా

**జ**య విజయీభవ ఆనందకారక
దిగ్విజయీ భవ దివిజ పాలకా
జయ విజయీభవ శ్రిత చరణా
దిగ్విజయీభవ భవ హరణా

**జ**య విజయీభవ క్షీరాబ్ధి శయనా
దిగ్విజయీభవ లక్ష్మీకాంతా
జయ విజయీభవ అభయ ప్రదాతా
దిగ్విజయీభవ శుభవరదా

**నీ**వేవి యోచింతువో - శ్రీహరి
యోచన నీది యోగము నాది
నీవేమి యోచింతువో - శ్రీహరి
నా యోగ మెటులున్నదో

**జ**నన మరణముల సూత్రధారివి
జనులందరు నీ పాత్రధారులు
ఆది అంతములు నీకే ఎరుక
అందరి బ్రతుకుల నీవే ఏలిక

**నా** జీవితానికి ఆధారమై
నాలో దాగిన అమృతమూర్తీ
నా శిక్షకుడవు నా రక్షకుడవు

కడదాకా నను చూసుకో - రమణా
నీ నీడలో నిల్పుకో

**నీ**వే నిజమని నిన్నే నమ్మితి
నీకే బ్రతుకును అర్పణ జేసితి
నిను సేవించితి - నిను భావించితి

కడ ఊపిరిలో కనుపించుమా
కమలేశ నీలో నను కలుపుకో



**ఈ** జీవితం ఇలా సాగిపోనీ
నీ భక్తిలో రమణ మునిగిపోనీ

విన్నపాన్ని మరువకు
చిన్న చూపు చూడకు -

**నే**నన్నది తొలగనీ అహమంతా ఆరనీ
అన్నిటిలో నిన్ను చూడనీ
అంతట నీ ఉనికిని అనుభవించనీ
శూన్యాన్నీ తెలియనీ శోకాన్ని మరువనీ -

**మ**నసాడే ఆటలను అంతం కానీ
మదిలోని కోరికలను మాయం కానీ
మాయా మానుషరూపా ముక్తి నీయవా
దివ్యాను భూతులొసగి దీవింపవా

**అ**ంతరాన సంవాదము అణగిపోనీ
అంతులేని సంఘర్షణలాగిపోనీ
సాక్షిగ నన్ను నిలువనీ
ప్రేక్షకునిగ వీక్షింపనీ

